బుధవారం
12•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 348
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం


# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE









## గబ్బర్‌కు గాయం

మూడు మ్యాచ్‌లకు శిఖర్ లేకుండానే బరిలోకి భారత్

రోహిత్‌తో కలిసి ఓపెనర్‌గా రాహుల్

**నాటింగ్‌హామ్:** ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దూసుకెళుతున్న టైటిల్ ఫేవరెట్ భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సూపర్ ఫామ్‌మీదున్న ఓపెనర్ 'గబ్బర్' శిఖర్ ధవన్ గాయం కారణంగా మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆస్ట్రేలియాతో గత మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కిన ధవన్ ఎడమచేతి బొటనవేలికి గాయమైంది. ఆసీస్ పేసర్ ప్యాట్ కమ్మిన్స్ వేసిన బంతి ధవన్ చేతిని బలంగా తాకింది. గాయం తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మంగళవారం జరిపిన వైద్య పరీక్షల్లో వేలి ఎముకలో చిన్న చీలిక ఏర్పడినట్లు తేలింది. ఈ కారణంగా న్యూజిలాండ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే తర్వాతి మ్యాచ్‌లకు ధవన్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో రోహిత్‌శర్మతో కలిసి కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టనుండగా, దినేశ్ కార్తీక్ లేదా విజయ్ శంకర్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. ధవన్‌కు ప్రత్యామ్నాయంగా రిషబ్ పంత్, రాయుడిని తీసుకుంటారని వార్తలు వస్తున్నాయి.

› వివరాలు ఆటలో



## వృద్ధిరేటు అంతలేదు!

దేశ జీడీపీని ఎక్కువగా అంచనా వేశారు

2011-17 మధ్య 2.5 శాతం అధికంగా చూపారు


మాజీ సీఈఏ అర్వింద్ సుబ్రమణియన్ సంచలన వ్యాఖ్యలు

11

# గ్రామస్వరాజ్యమే లక్ష్యం

### గ్రామీణాభివృద్ధికి దోహదంచేసిన పంచాయతీరాజ్, సహకార ఉద్యమాలు

- మళ్లీ ఆ పూర్వవైభవం సాధించాలి
- లక్ష్యాలు సాధించిన జెడ్పీకి రూ.10 కోట్లు
- 32 జిల్లాలూ ఆ నిధులు అందుకోవాలి
- జెడ్పీ చైర్మన్లందరికీ కార్లు కొనిస్తాం
- జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లకు త్వరలో శిక్షణ
- పారిశుద్ధ్యం, హరితహారంపై దృష్టిపెట్టాలి
- స్థానికసంస్థల పటిష్టానికి ఆలోచిస్తున్నాం
- మీరు సాధించిన ఏకపక్ష విజయాలు మీ బాధ్యతలను మరింత పెంచాయి: కేసీఆర్



మంగళవారం ప్రగతిభవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి మహమూద్‌అలీ కూడా ఉన్నారు.

> **పదవి** వచ్చిన తర్వాత మన సహజత్వాన్ని కోల్పోకూడదు. పెట్టుడు గుణాల కంటే, పుట్టుడు గుణం మంచిది అంటారు పెద్దలు. మన వ్యవహారశైలే మనకు లాభం చేకూరుస్తుంది. ప్రజలకు అనేక సమస్యలుంటాయి. వారు ఆ సమస్యల పరిష్కారానికి మీ దగ్గరకు వస్తారు. వారి సమస్యలను ఓపికగా, సావధానంగా వినండి. వాళ్లను కూచోబెట్టి మర్యాద చేయండి. ఆ తర్వాత వారి సమస్యలను ఎలా పరిష్కరించాలో ప్రయత్నం చేయండి.
>
> –జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల సమావేశంలో సీఎం కేసీఆర్

**ప్రతి గ్రామం ఒక గంగదేవిపల్లి, అంకాపూర్, ముల్కనూర్ కావాలి**

**ఆరునెలల్లోనే ఈ మార్పు రావాలి • అందుకు మీరు ప్రతిజ్ఞ తీసుకోవాలి**

**ప్రగతిసాధనలో మీదే క్రియాశీల పాత్ర**

**జిల్లాపరిషత్ చైర్మన్లు, వైస్‌చైర్మన్ల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అభివృద్ధిలో రాష్ట్రంలోని ప్రతి గ్రామం ఒక గంగదేవిపల్లి, అంకాపూర్, ముల్కనూర్‌గా తయారు కావాలని, ఈ మార్పు ఆరునెలల్లో రావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. పంచాయతీరాజ్ ఉద్యమస్ఫూర్తితో గ్రామస్వరాజ్యం లక్ష్యంగా, గ్రామీణప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కొత్తగా ఎన్నికైన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు ప్రగతిసాధనలో క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ ఉద్యమం, సహకార ఉద్యమం ఎంతగానో దోహదపడ్డాయని గుర్తుచేసిన సీఎం.. ఆ ఉద్యమానికి పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. నిర్దేశిత లక్ష్యాలను ఛేదించి, గ్రామాల వికాసానికి కృషిచేయడంలో అగ్రగామిగా నిలిచిన జిల్లా పరిషత్తులకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రగతినిధి నుంచి రూ.10 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరుచేయనున్నట్లు ప్రకటించారు. జెడ్పీ చైర్‌పర్సన్లకు కొత్త కార్లు కొనిస్తామని చెప్పారు. కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లకు త్వరలోనే హైదరాబాద్‌లో శిక్షణాకార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం జిల్లాస్థాయిలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు కూడా శిక్షణనిస్తామని చెప్పారు. గ్రామాలు పచ్చదనంతో, పరిశుభ్రతతో వర్ధిల్లాలనే ప్రధాన లక్ష్యంతో రూపొందించిన కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలులో పరిషత్ ప్రజాప్రతినిధులు ముఖ్యభూమిక పోషించాలని కోరారు. కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లతో ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి ప్రభుత్వం

› మిగతా 2వ పేజీలో

## నైరుతి రాక మరింత ఆలస్యం

అడ్డంకిగా మారిన 'వాయు'తుఫాన్

రుతుపవనాల మందగమనం

తెలంగాణను తాకేందుకు మరికొంత సమయం

15 లేదా 16న రాష్ట్రానికి నైరుతి!

రెండురోజులపాటు వడగాలులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:



నైరుతి రుతుపవనాల రాక మందగించింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన 'వాయు' తుఫాన్ రుతుపవనాల రాకకు అడ్డంకిగా మారింది. దీంతో తెలంగాణకు నైరుతి రాక మరింత ఆలస్యం కావచ్చునని వాతావరణశాఖ పేర్కొన్నది. ఈ నెల 13 లేదా 14వ తేదీన నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకవచ్చని వాతావరణశాఖ ముందుగా అంచనా వేసింది. ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా రుతుపవనాలు వేగంగా కదిలి శ్రీలంక మీదుగా ఈ నెల 8న కేరళను తాకాయి. కేరళలోని చాలాప్రాంతాల్లో, తమిళనాడులోని కొన్నిప్రాంతాల్లో విస్తరించాయి. అక్కడి నుంచి రుతుపవనాలు 12వ తేదీన రాయలసీమను తాకి.. 13వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముందని భావించారు. అయితే రాయలసీమలోకి ప్రవేశించబోతున్న సమయంలోనే అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయు అనే తుఫాన్ రుతుపవనాల కదలికకు బ్రేక్ వేసిందని అధికారులు చెప్తున్నారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం మరింత తీవ్ర రూపందాల్చి తుఫాన్‌గా మారిందని వాతావరణశాఖ ప్రకటించింది. ఇది గురువారం గుజరాత్ తీరాన్ని తాకనున్నదని..110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ ఉత్తరదిశగా

› మిగతా 5వ పేజీలో



## నేటినుంచి బడిగంట

వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు తరగతులు

మొత్తం పనిదినాలు 232

పాఠశాలల వేళల్లో మార్పులు లేవు

ఏడాదిలో రెండుసార్లు హెల్త్ చెకప్

అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

2019-20 విద్యాక్యాలండర్ విడుదల

5

## ఉస్మానియావర్సిటీలో 415 పోస్టుల భర్తీకి సన్నాహాలు

రెండువారాల్లో నోటిఫికేషన్

ఓయూ వీసీ రామచంద్రం వెల్లడి

2






# భూమి పెరుగును!

## అవును.. 64 ఎకరాలను 291 ఎకరాలుగా అమ్మేశారు

**ధర్మగంట**

- చనిపోయినవాళ్లు సంతకాలు చేసినట్టు రికార్డులు
- ఒకే భూమిపై పెద్ద సంఖ్యలో సేల్‌డీడ్లు
- అసలు పట్టాదారుల కన్నుగప్పి దందా
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, పోలీసు అధికారుల కుమ్మక్కు.. యథేచ్ఛగా అమ్మకాలు
- పీవోబీలో ఉన్నప్పటికీ భూముల రిజిస్ట్రేషన్
- రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో రెవెన్యూ లీలలు



తమ భూమికోసం పోరాటంచేస్తున్న ఎండీ బషీరుద్దీన్

**ఆ** ఊళ్లో ఓ ఐదు సర్వే నంబర్లలో ఉన్న భూమి 64 ఎకరాలు. కానీ.. అరవైకిపైగా సాగిన సేల్‌డీడ్ల లెక్క చూస్తే.. 291 ఎకరాలు. అంటే.. దాదాపు నాలుగున్నర రెట్లు! తరగని.. పెరగని భూమి.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తిలో మాత్రం పెరుగుతూ పోయింది. అలా కాగితాలపై భూమిని పుట్టించి.. ఒకే భూమిని అనేకమందికి అమ్మేశారు! అసలు పట్టాదారులకు తెలియకుండా యథేచ్ఛగా విక్రయాలు సాగిపోయాయి. చనిపోయినవారి సంతకాలతో సేల్‌డీడ్లు అయ్యాయి! హక్కుదారులకు బదులు.. వేరొకరి నుంచి భూములు కొనుగోలు చేసినట్లు రికార్డులు పుట్టుకొచ్చాయి! భూమి కొన్నవారికి సేల్‌డీడ్లు ఉన్నా.. పహాణీల్లో నమోదుకాలేదు. క్షేత్రస్థాయిలో భూమిలేదు. నిజానికి తాము కొనుగోలు చేసిన భూమి ఎక్కడున్నదో కూడా వారికి తెలియదు. అలా కొన్నవారు సైతం మోసపోయారు. సదరు 64 ఎకరాల అసలు పట్టాదారులు.. ఇది తమ భూమి అంటూ 1995 నుంచి పోరాడుతున్నా.. పట్టించుకున్న అధికారి లేడు. పైగా.. వారిపైనే ఉల్టా కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలకు తోడు.. పోలీసు అధికారులు కుమ్మక్కయి సాగించిన ఈ దందాలో బాధితులు ధర్మగంటను ఆశ్రయించారు.

3

### ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

నల్లగొండ జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్

'ఒక ఊరు వంద తప్పులు' కథనానికి స్పందన

### రిటైర్డ్ ఆర్డీవోకు పాస్‌పుస్తకాలు

కదిలిన రెవెన్యూ యంత్రాంగం

'రిటైర్డ్ ఆర్డీవోకూ తప్పని వ్యథ' కథనంపై స్పందన

4

# 21.22 లక్షల ఖాతాల్లోకి 2,233 కోట్లు జమ

- ఆర్బీఐ ఈ కుబేర్ ద్వారా కొనసాగుతున్న ప్రక్రియ
- ఖాతా నంబర్ మార్చుకునే రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి
- ధాన్యం కొనుగోలు బకాయిలు త్వరలోనే చెల్లిస్తాం
- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో రైతుల ఖాతాల్లో రైతుబంధు పెట్టుబడి సాయం త్వరితగతిన జమ చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 21.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో పంటపెట్టుబడి సాయం జమచేసినట్టు వెల్లడించారు. పంట పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపులపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా

› మిగతా 5వ పేజీలో



## బెంగాల్ ఆటబొమ్మ కాదు

రాష్ట్రంతో బీజేపీ ఆడుకోజాలదు

- ఘర్షణల్లో చనిపోయినవారిలో 8 మంది తృణమూల్‌వారే
- బెంగాల్‌ను గుజరాత్‌లా మార్చేందుకు కుట్రలు
- బీజేపీపై ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి మమతాబెనర్జీ
- ధ్వంసమైన చోటే విద్యాసాగర్ నూతన విగ్రహం ఆవిష్కరణ

9




గోపనపల్లిలో కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు

## వానలకోసం కప్పతల్లి ఆట

**వరుణుడి** కరుణ కోసం వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలంలో మంగళవారం కప్పతల్లి ఆడారు. గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో చిన్నారులు కప్పతల్లి ఆడుతూ సందడి చేశారు. పెద్దల సలహాతో చిన్నారులు రోకలి బండకు కప్పను కట్టి గ్రామాల్లో ఊరేగించారు. ప్రజలు రోకలి బండపై నీళ్లు పోశారు. వర్షాలు కురవాలని కోరుతూ అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. – పర్వతగిరి

## వాయుగండం

అరేబియా సముద్రంలో తుఫాన్



రేపు గుజరాత్‌లో తీరాన్ని తాకే అవకాశం

సురక్షిత ప్రాంతాలకు తీర ప్రాంత ప్రజల తరలింపు

8

## వడదెబ్బకు రైల్లోనే ముగ్గురు మృత్యువాత

దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలిన మరొకరు

మృతులంతా తమిళనాడువాసులు

ఉత్తరాది తీర్థయాత్రకు వెళ్లి వస్తుండగా ఉత్తరప్రదేశ్‌లో దుర్ఘటన

9






యాదగిరి గుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని బర్కత్‌పురాలో నిర్మించిన యాదాద్రి భవన్ సమాచార కేంద్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 14న ప్రారంభించనున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులు మంగళ వారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఈ భవన ప్రారంభోత్సవ ఆహ్వానపత్రికను అందజేశారు.



రాష్ట్రంలోని 32 జిల్లా పరిషత్‌లకు కొత్తగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఉద్దేశించి మంగళ వారం ప్రగతిభవన్‌లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్ కూడా ఉన్నారు.



## ఉస్మానియావర్సిటీలో 415 పోస్టుల భర్తీకి సన్నాహాలు

రెండువారాల్లో నోటిఫికేషన్

ఓయూ వీసీ రామచంద్రం వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో టీచింగ్ పోస్టుల భర్తీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు 415 పోస్టులకు భర్తీ కోసం రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు తయారుచేశామని ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. రెండువారాల్లో నియామక నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 294 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 121 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీకి సిద్ధంగా ఉన్నాయని, రాష్ట్రంలో ఎన్నికోడ్ ముగిసిన నేపథ్యంలో నియామకాల ప్రక్రియ వేగవంతమైందని అధికారులు చెప్పారు.

## తుంగభద్రకు ఈసారి 163 టీఎంసీల వరద

2019-20కి అంచనా వేసిన బోర్డు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/అయిజ:** కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఈసారి (2019-20 నీటి సంవత్సరంలో) 163 టీఎంసీల వరద రావచ్చని తుంగభద్ర బోర్డు అంచనా వేసింది. తుంగభద్రలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించి 212 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. మంగళవారం కర్ణాటకలోని హొస్పేటలో జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశానికి కర్ణాటక అధికారులు హాజరుకాలేదు. సినీ నటుడు గిరీశ్ కర్నాడ్ మృతికి సంతాపంగా కర్ణాటక ప్రభుత్వం సెలవు ప్రకటించడమే ఇందుకు కారణం. తెలంగాణ, ఏపీ అధికారులు మాత్రమే హాజరుకావడంతో బోర్డు భేటీలో ఎలాంటి చర్చలు జరుగలేదు. ముఖ్యంగా ఆర్డీఎస్ ఆధునీకరణ పనులపై తెలంగాణ చర్చించాలని అనుకున్నా వీలు కాలేదు.

### ముహూర్తం



సూర్యోదయం: 5.45 గంటలకు



సూర్యాస్తమయం: 6.47 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం దశమి సాయంత్రం 6.29 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: హస్త ఉదయం 11.52 వరకు, తదుపరి చిత్త, అమృత ఘడియలు: ఉదయం 6.09 నుంచి 7.45 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.16 నుంచి 1.54 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.50 నుంచి 12.42 వరకు, వర్జ్యం: రాత్రి 7.33 నుంచి 9.09 వరకు.



హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంగళ వారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి గ్రూప్ ఫొటో దిగిన కొత్త జిల్లా పరిషత్ చైర్మన్లు, చైర్‌పర్సన్లు

# గ్రామస్వరాజ్యమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

తీసుకున్న చర్యలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలను ముఖ్యమంత్రి కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'జిల్లా పరిషత్ చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా ఏకపక్ష విజయం సాధించినందుకు మీ అందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీరు పనిచేయబోయే ఈ ఐదేండ్లకాలంలో మంచిపేరు తెచ్చుకోవాలని, మీకు పనిచేసే ధైర్యాన్ని, అభినివేశాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. మీరింకా ఉన్నత పదవులు అధిష్ఠించాలని ఆకాంక్షిస్తున్నాను. మీకు లభించిన పదవిని ఎంత గొప్పగా నిలబెట్టుకుంటే అంతమంచిది. ఎవరూ పుట్టినప్పుడే అన్నీ నేర్చుకోలేదు. పరిస్థితులనుబట్టి నేర్చుకుంటూపోతారు. మనిషి చివరిశ్వాస విడిచే వరకు కూడా జ్ఞానసముపార్జన చేసుకుంటూపోవాలి. మన జీవితం చాలా చిన్నది. ఆ కాస్త సమయంలోనే మంచిపేరు తెచ్చుకోవాలి. అజ్ఞాని ఏ రోజైనా జ్ఞాని కాగలుగుతాడు కానీ, మూర్ఖుడు జ్ఞానికాలేడు. వాడు తనకే అన్నీ తెలుసు అనుకుంటాడు. అలా కాకుండా అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్నవారే తాము ఎంచుకున్న రంగంలో ముందడుగు వేయగలరు. అన్ని విషయాల్లాగానే పంచాయతీరాజ్ విషయాలను కూడా నేర్చుకునే ప్రయత్నం చేయాలి' అని సీఎం ఉద్బోధించారు.

### పెట్టుడు గుణాలకంటే, పుట్టుడు గుణం మంచిది

'పదవి వచ్చిన తర్వాత మన సహజత్వాన్ని కోల్పోకూడదు. అలాచేస్తే మన వెనుకనున్న జనం నవ్వుతారు. లేనిపోని దర్పం తెచ్చుకోకూడదు. పదవిరాగానే మీరు మారిపోకూడదు. మనకు రావాల్సిన, దక్కాల్సిన గౌరవం ఆటోమేటిక్‌గా అదే వస్తుంది. పెట్టుడు గుణాల కంటే, పుట్టుడు గుణం మంచిది అంటారు పెద్దలు. మన వ్యవహారశైలే మనకు లాభం చేకూరుస్తుంది. ప్రజలకు అనేక సమస్యలుంటాయి. వారు వాటి పరిష్కారంకోసం మీదగ్గరికి వస్తారు. నాయకుల మంచి లక్షణం ఒకరు చెప్పింది వినటం. అదే మీరు చేయండి. వారి సమస్యలను ఓపికగా, సావధానంగా వినండి. వాళ్లను కూచోబెట్టి మర్యాదచేయండి. అప్పుడే వాళ్లకు రిలీఫ్ వస్తుంది. ఆ తర్వాత వారి సమస్యలను ఎలా పరిష్కరించాలో ప్రయత్నం చేయండి. సహజత్వాన్ని కోల్పోకుండా ప్రవర్తిస్తే మంచిపేరు వస్తుంది. మంచిపేరుతోనే ఉన్నతస్థాయి వస్తుంది' అని సీఎం అన్నారు.

### హైదరాబాద్ నుంచే యావత్‌దేశానికి పంచాయతీరాజ్ ఉద్యమం

'పంచాయతీరాజ్ ఒక అద్భుత ఉద్యమం. స్వాతంత్ర్యం వచ్చిన ఆరంభ రోజుల్లో దీనికి రూపకల్పనచేశారు. రాష్ట్రాలకు పాలనలో స్వతంత్రత ఉండాలని, అది వికేంద్రీకరణ జరుగాలని స్థానిక స్వపరిపాలనకు శ్రీకారం చుట్టారు. కేంద్రీకృత పాలన క్షేత్రస్థాయిలో ఫలితాలు రాబట్టలేదు. ఎక్కడికక్కడే అభివృద్ధి జరుగాలని ఒక అద్భుతమైన ఉద్యమానికి ప్రాణం పోశారు. దీని మొట్టమొదటి పేరు కమ్యూనిటీ డెవలప్‌మెంట్. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న కొత్తరోజుల్లో అమెరికా వెళ్లినప్పుడు ఆ దేశాధ్యక్షుడు ఐసన్‌హోవర్ ఆయనకు ఎస్కే డే అనే వ్యక్తిని పరిచయం చేశారు. ఆయన భారతీయుడని, గ్రామీణ అమెరికా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అవి అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని నెహ్రూకు చెప్పాడు. ఆయనను అమెరికా అధ్యక్షుడు పొగడటంపట్ల సంతోషం వ్యక్తపరిచిన నెహ్రూ.. భారతదేశానికి రావాలంటూ ఎస్కే డేను ఆహ్వానించారు. నెహ్రూ ప్రథమ పంచవర్షప్రణాళికలో భారతదేశ అవసరాలకు భిన్నంగా సత్వర పారిశ్రామీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం తనకు అభ్యంతరమని, అది తప్పని, మొదలు సాగునీటిరంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్కే డే సూచించారు. ఆహారరంగంలో స్వయంసమృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నెహ్రూ ఆహ్వానాన్ని తిరస్కరించారు. నెహ్రూ స్వదేశానికి తిరిగివచ్చిన తర్వాత మంత్రి మండలిలో, పార్టీలో ఎస్కే డే సలహాపై చర్చించాడు. ఫలితంగా రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యక్రమం మారింది. ఆధునిక దేవాలయాల పేరిట భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. అప్పటి ఆ మార్పువల్ల ఈ రోజున ఆహార రంగంలో స్వావలంబన వచ్చింది. నెహ్రూ తీసుకువచ్చిన మార్పులతో సంతోషించిన ఎస్కే డే భారతదేశానికి వస్తానని నెహ్రూకు లేఖ రాశాడు. అలా ఆయన ఇండియాకు వచ్చాడు. ఆయనను తక్షణమే రాజ్యసభ సభ్యుడిగా, క్యాబినెట్ మంత్రిగా నెహ్రూ నియమించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ శాఖను కేటాయించి, గ్రామీణ భారతాన్ని ఆయన చేతుల్లో పెట్టారు. ఎస్కే డే సరాసరి హైదరాబాద్ నగరానికి వచ్చి ఎన్ఐఆర్డీలో నివాసం ఏర్పాటుచేసుకున్నారు. హైదరాబాద్ నుంచే యావత్ భారతదేశానికి పంచాయతీరాజ్ ఉద్యమాన్ని విస్తరింపజేశారు. అప్పట్లో ఆయన దేశంలోనే మొట్టమొదటి సమితి (పటాన్‌చెరువు) అధ్యక్షుడిగా పీ రామచంద్రారెడ్డిని నియమించారు. అలా మొదలైంది పంచాయతీరాజ్ ఉద్యమం' అని కేసీఆర్ వివరించారు.



### ప్రజలతో నిత్య సంబంధాలు ఉండాలి

'మీలో ప్రతివారు మీమీ సామర్థ్యాన్ని బట్టి, అదృష్టాన్ని బట్టి ఈ పదవుల్లోకి వచ్చారు. ఇదంతా మీమీ సత్ప్రవర్తన వల్లే. మంచిపనులు చేయడానికి పెట్టుబడులు అవసరంలేదు. సరళంగా మాట్లాడటమే ఏ రోజునైనా మనకు పెట్టని కోట. ప్రజాసమస్యల పట్ల ప్రజాప్రతినిధులు ఎంతటి శ్రద్ధ కనబరుస్తున్నారో ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారు. దీని వల్ల మనకు ఇంకా ఉన్నతావకాశాలు వస్తాయి. విజయాలు, అపజయాలు సర్వసాధారణం. కానీ, రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండటం ప్రాథమిక లక్షణం' అని సీఎం చెప్పారు.

### మీ బాధ్యత పెంచిన ఫలితాలు

'గతంలో జెడ్పీ చైర్మన్లకు పెద్దగా పనిలేదు. ఇటీవల కేంద్ర ఆర్థికసంఘాన్ని కలిసినప్పుడు మన వ్యవస్థ గురించి వివరించాను. ఇక్కడ జెడ్పీ చైర్మన్లకు మినిస్టర్ ఆఫ్ స్టేట్ ర్యాంక్ ఇచ్చామని చెప్పాను. వాళ్లు ఇకముందు క్రియాశీలకంగా పనిచేస్తారని కూడా చెప్పాను. అవసరమైన సహాయం చేస్తామని ఆర్థిక సంఘం అధ్యక్షుడు మాట ఇచ్చారు. ఏ విధంగానైనా మీ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆలోచన చేస్తున్నాం. రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన అన్ని అధికారాలు సంక్రమింపజేస్తాం. ఇంత ఏకపక్షంగా 32 జిల్లా పరిషత్ ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ రాలేదు. దాంతోపాటే మీకు బరువు బాధ్యతలు పెరిగాయి. మీ పాత్ర ఉన్నతంగా ఉండాలి. జిల్లా పరిషత్ క్రియాశీలకం కావాలి. మీ విధులు, బాధ్యతలు పటిష్ఠం కావాలి' అని కేసీఆర్ వివరించారు.

### కొరవడిన పంచాయతీరాజ్ స్ఫూర్తి

'చాలాకాలం పంచాయతీరాజ్ ఉద్యమస్ఫూర్తితో స్థానికసంస్థలు పనిచేశాయి. పారిశుద్ధ్య కార్యక్రమం బ్రహ్మాండంగా ఉండేది. దురదృష్టవశాత్తు ఆ స్ఫూర్తి ఇప్పుడు కొరవడింది. 70 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏ గ్రామానికి పోయినా అపరిశుభ్ర వాతావరణం కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. గ్రామాల్లో మంచిగా ఏదీ జరుగడంలేదు. పల్లెలు పెంటకుప్పల్లా తయారయ్యాయి. ఎందుకీ క్షీణత? మంచినీళ్ల గోస ఎందుకు? తెలంగాణ ఎక్కడో లేదు.. గ్రామాల్లోనే ఉన్నది. గ్రామాలను మనం అద్భుతంగా చేసుకుంటే రాష్ట్రం బాగుపడుతుంది. మీరంతా విద్యాధికులు. పరిస్థితులను అర్థం చేసుకోగలరు. మీరు గ్రామాలను అభివృద్ధిచేస్తామని ఒక ప్రతిజ్ఞ తీసుకోవాలి. భయంకరమైన గ్రామాల పరిస్థితుల్లో మార్పురావాలి. అది గుణాత్మక మార్పుకావాలి' అని సీఎం ఉద్బోధించారు.

### మీ శిక్షణకు కోర్స్ డిజైన్ చేస్తాం

'నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పంచాయతీరాజ్ విషయంలో అవగాహనకు రావడానికి స్వయంగా ఎన్ఐఆర్డీలో శిక్షణకు పోయాను. అక్కడే హాస్టల్లో ఆరురోజులుండి ఏడురోజుల శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యాను. అలాపోవడంవల్ల నాకు పూర్తి అవగాహన వచ్చింది. మీరు కూడా తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీరంతా జూలై నెలలో పదవీబాధ్యతలు స్వీకరిస్తారు. ఈలోపు మీరంతా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణకు పోవాలి. దానికి అధికారులు ఒక మంచి కోర్స్ డిజైన్ చేస్తారు' అని సీఎం తెలిపారు.

### ఆర్నెళ్లలో పూర్తి మార్పు కనపడాలి

'గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమించాం. పంచాయతీరాజ్ చట్టం చాలా కఠినంగా ఉన్నది. కార్యదర్శి చక్కగా పనిచేస్తేనే, అనుకున్న ఫలితాలను సాధిస్తేనే, మూడేండ్ల తర్వాత ఆయన సేవలను క్రమబద్ధీకరిస్తాం. పంచాయతీ కార్యదర్శుల మీద పూర్తి నియంత్రణ మీదే. అలాగే డీపీవో, డీఎల్పీవో, ఈవో ఆర్డీ, ఎంపీడీవోలతో బాగా పనిచేయించాలి. దీనికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, ఆజమాయిషీ అధికారాలను త్వరలోనే నిర్ణయిస్తాం. ఆర్నెళ్లలో పూర్తి మార్పు కనపడాలి.

### అగ్రభాగాన నిలిచే పరిషత్తులకు పదికోట్లు


'ఏ జిల్లా పరిషత్ అగ్రభాగాన ఉంటే, ఆ జిల్లాకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి రు.10 కోట్లు మంజూరు చేస్తాం. ఒకటికంటే ఎక్కువ పరిషత్తులు ముందుకుపోతే వాళ్లకూ మంజూరుచేస్తాం. 32 జిల్లాలు కూడా అగ్రభాగాన నిలువాలి. దీనికి కొన్ని బెంచ్ మార్క్ ప్రమాణాలు ఏర్పాటుచేస్తాం. అందరూ కలిసి మొత్తం రు.320 కోట్లు పొందాలనేది నా కోరిక. ప్రతి జిల్లా పరిషత్ చైర్మన్‌కు కొత్త కారు కొనిస్తాం. మీరు చాలా మంచి మార్పు తీసుకురాగలమన్న భావన ప్రజల్లో తీసుకురాగలిగితే అంతకన్నా గొప్ప లేదు. ప్రజల్లో బాగా తిరిగి పంచాయతీరాజ్ సంస్థను బలోపేతం చేయాలి. క్రియాశీలకంగా ఏ గ్రామానికి ఆ గ్రామమే అభివృద్ధి జరుగాలంటే మీరు బాధ్యత తీసుకోవాలి. మీరు నాయకత్వం వహించాలి. మీ కింది వారికి స్ఫూర్తి కావాలి. ఎలాగైతే తెలంగాణ సాధించామో అలాగే గ్రామాల అభివృద్ధి జరుగాలి' అని సీఎం జెడ్పీ చైర్మన్లకు, వైస్ చైర్మన్లకు ఉద్బోధించారు.

డీపీవోను పరిషత్తుల కిందకు తెచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. గతంలో మాదిరిగా కాకుండా అధికారాలు ఇచ్చే అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. జెడ్పీలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, హరితహారంపై బాగా దృష్టిపెట్టాలి. పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం బాగాలేదు. దృష్టి కేంద్రీకరించి సమస్య పరిష్కారం అయ్యేలాచేయాలి. వందల కోట్లు సంపాదించినా పీల్చుకునే గాలి లేకపోతే ప్రయోజనం లేదు. హరితహారంపై దృష్టిపెట్టాలి. చెట్లు పెంచాలి. గ్రామాల్లో బాగా తిరుగాలి, కష్టపడి పనిచేయాలి' అని సీఎం చెప్పారు.


### ప్రజల రుణం తీర్చుకోవాలి

'మన ప్రభుత్వం మానవీయ కోణంలో ప్రవేశపెట్టిన ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ఆదరణ పొంది, ఎన్నికల్లో మన విజయానికి కారణమయ్యాయి. అందుకే మనం వాళ్ల రుణం తీర్చుకోవాలి. దీనికి ఎక్కువ పాత్రధారులు మీరే. మండలాధ్యక్షులను మీలాగే తయారుచేయండి. నాలాగా మీరు కూడా వారికి అవగాహన కలిగించాలి. మీరు సందేశాత్మకంగా మాట్లాడాలి. ఆ స్థాయి రావడానికే మీకు శిక్షణ ఇప్పిస్తున్నాం. ఏ ఉద్యమస్ఫూర్తితో ఎస్కే డే పంచాయతీరాజ్ ఉద్యమాన్ని ప్రారంభించాడో, దాన్ని మనం ముందుకు తీసుకుపోవాలి. 60% జనాభా ఉన్న గ్రామీణ ప్రజలకు మీరు నాయకత్వం వహించాలి. గ్రామాలను పట్టుగొమ్మల్లాగా చేయడంలో నిమగ్నమైపోవాలి. అలాచేసి మీ జీవితాలను ధన్యం చేసుకోండి. గొప్ప పేరు సంపాదించుకోండి. అందులో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. గ్రామీణ తెలంగాణను అన్ని రకాలుగా బాగుచేయడానికి మీ శక్తియుక్తులను ఉపయోగించండి. ప్రతి గ్రామం ఒక గంగదేవిపల్లి, ఒక అంకాపూర్, ఒక ముల్కనూర్ కావాలి' అని సీఎం ఆకాంక్షించారు. సమావేశం ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పరిషత్ చైర్మన్లను, వైస్ చైర్మన్లను వారి స్థానాల దగ్గరికిపోయి కలిసి, ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అభినందించారు. వారందరితో కలిసి భోజనంచేశారు. ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సునీతా మహేందర్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, ఏ జీవన్‌రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, షకీల్, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, నల్లాల ఓదెలు, ఉమామాధవరెడ్డి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

### లోకం పోకడ




# చిన్నారుల్లో 'స్మార్ట్' వ్యసనం



**పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తే డ్రగ్స్ ఇచ్చినట్టే**

- పెరిగిన స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ క్లయింట్లు
- బానిసలుగా మారుస్తున్న మాధ్యమాలు
- ప్రముఖ అడిక్షన్ థెరపిస్ట్ సలిగరి హెచ్చరిక
- తాజా సర్వేలో విస్తుగొలిపే విషయాలు వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిన్నారుల చేతిలో స్మార్ట్‌ఫోన్ పెడుతున్నారా! పిల్లలు గంటలపాటు స్మార్ట్‌ఫోన్‌పై సమయం కేటాయిస్తున్నా.. చూస్తూ ఊరుకుంటున్నారా? అయితే మీరు స్వయంగా చిన్నపిల్లలకు డ్రగ్స్ అలవాటు చేస్తున్నట్టే. చిన్నారులకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వటం అనేది గ్రాము కొకైన్ ఇవ్వడంతో సమానమని ప్రముఖ అడిక్షన్ థెరపిస్ట్ డాక్టర్ మ్యాండి సలిగరి హెచ్చరించారు. స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలు యుక్తవయసులో ఉన్నవారిని డ్రగ్స్, మద్యంలాగే బానిసలుగా మార్చుకుంటున్నాయని లండన్ విద్యాసదస్సులో టీచర్లు అభిప్రాయపడ్డట్టు చెప్పారు. టెక్నాలజీ అడిక్షన్ అనేది యువతలో పెరిగిపోతున్నదని, ముఖ్యంగా 16 ఏండ్లలోపు చిన్నారులు తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. 'నేనెప్పుడు తల్లిదండ్రులకు ఒకటి చెప్తాను. పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్ లేదా ట్యాబ్లెట్ ఇస్తున్నట్టయితే.. బాటిల్ మద్యం లేదా గ్రాము కొకైన్ ఇస్తున్నట్టే' అని పేర్కొన్నారు. లండన్‌లో ఇటీవల 1500 మంది టీచర్ల ద్వారా సర్వే జరిపిన సర్వేలో పలు విస్తుగొలిపే విషయాలు బయటపడ్డాయని చెప్పారు. ఇంట్లో, పాఠశాలలో, ఇతర సమయాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగించడం అదుపులో పెట్టుకోవాలని, వ్యసనంగా మారే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గడిచిన పదేండ్లలో స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ క్లయింట్ల రాక విపరీతంగా పెరిగిపోయిందని ఆయన తెలిపారు. దీన్ని ప్రాథమికస్థాయిలోనే నివారించేందుకు ప్రయత్నించాలని తల్లిదండ్రులకు సూచించారు.

### లండన్‌లో టీచర్ల ద్వారా జరిపిన సర్వేలో వెల్లడైన అంశాలు

- పెద్దల దృష్టిలో పడనంత వరకు నగ్నచిత్రాలు, వీడియోలు షేరింగ్‌ను చాలా సాధారణ విషయంగా విద్యార్థులు భావిస్తున్నారు.
- ప్రతి నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు ప్రతి వారం సగటున ఆరున్నర గంటలపాటు ఇంటర్నెట్‌పై సమయం కేటాయిస్తున్నారు.
- విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ల ద్వారా సెక్సువల్ కంటెంట్ షేర్ చేసుకుంటున్నారని 2/3వ వంతులమంది టీచర్లు గుర్తించారు. ప్రాథమిక విద్యనభ్యసించే ప్రతి ఆరుగురు విద్యార్థుల్లో ఒకరు ఇందులో ఉంటారు.
- పదిమంది తల్లిదండ్రుల్లో నలుగురే పిల్లల స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని నియంత్రిస్తున్నారు. మిగతా వారు పట్టించుకోవటం లేదు.
- స్వీయ నియంత్రణపై చిన్నారులకు తల్లిదండ్రులు, టీచర్లు అవగాహన కల్పించాలి.



దివ్యాంగుడు శివకు బైక్‌ను అందజేస్తున్న టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద కూడా ఉన్నారు.

# దివ్యాంగుడికి కేటీఆర్ అండ

- మేడ్చల్ జిల్లా యువకుడి ట్వీట్‌కు స్పందన
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సహకారంతో బైక్ అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ దుండిగల్:** కాళ్లు కదపలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడికి టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అండగా నిలిచారు. బైక్ అందజేసేలా సాయం అందించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వెన్నెలగడ్డకు చెందిన సంబరబోయిన గోపీకృష్ణ కొడుకు శివ పుట్టుకతో దివ్యాంగుడు. కూలిపని చేస్తూ గోపీకృష్ణ కొడుకును పోషిస్తున్నాడు. తండ్రికి తోడుగా ఉండేందుకు ప్రైవేట్ ఉద్యోగం చేద్దామంటే కాళ్లు కదపలేని దుస్థితి. ఇదే విషయాన్ని కేటీఆర్‌కు విన్నవించాడు శివ. 'కష్టాల్లో ఉన్నాను. కాళ్లు కదలకపోయినా పనిచేయాలనుకుంటున్నా. ఏదైనా వాహనం ఇప్పిస్తే తండ్రికి చేదోడుగా నిలువాలనుకుంటున్నా. ఆదుకోండి సార్' అంటూ ఇటీవల ట్విట్టర్ వేదికగా విజ్ఞప్తి చేశాడు. దీనికి కేటీఆర్ వెంటనే స్పందించారు. శివకు సాయం అందజేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సూచించారు. దీంతో శంభీపూర్ రాజు సొంత ఖర్చుతో టీవీఎస్ జూపిటర్ బైక్‌ను శివకు ఇప్పించాడు. మంగళవారం ప్రగతిభవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేటీఆర్.. శివకు ద్విచక్రవాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్, శంభీపూర్ రాజుకు శివ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇంచార్జి జహంగీర్, మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతిరెడ్డికి కేటీఆర్ అభినందన**

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డిని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. మంగళవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, టీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు వీ నందు ఆధ్వర్యంలో తిరుపతిరెడ్డి ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. శంకర్‌పల్లి మాజీ సర్పంచ్, బీడీఎల్ విన్నర్స్ ఫౌండేషన్, మరికొందరు దాతల ఆర్థికసాయంతో ఎవరెస్టును అధిరోహించినట్టు ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి చెప్పారు.



మంగళవారం తనను కలిసిన యువ పర్వతారోహకుడు గుంతల తిరుపతిరెడ్డిని అభినందిస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా ఉన్నారు.





మంగళవారం ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్నతదితరులు కూడా ఉన్నారు.



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ కే విజయలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ సాగరబాయి. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



పరిషత్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అభినందనలు తెలుపుతున్న టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో మామిళ్ల రాజేందర్ తదితరులు ఉన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్లు

**కేసీఆర్ ఆశయ సాధనకు కృషిచేయాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూచన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఇటీవల ఎన్నికైన జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు మంగళవారం ప్రగతిభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని కేటీఆర్ అభినందిస్తూ.. గ్రామాల అభివృద్ధికి ముఖ్య మంత్రి కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేయాలని కోరారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిసినవారిలో నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ కే విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ సాగరబాయి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, వైస్‌చైర్మన్ ఆరె రాజన్నతోపాటు కో-ఆప్షన్ సభ్యులు సుభాష్‌రావు, రఫీక్ అహ్మద్, పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, జోగు రామన్న, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరిరావు, రాంకిషన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**టీఎన్జీవో, ఆటో యూనియన్ నేతల శుభాకాంక్షలు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ నాయకులు మంగళవారం కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసినవారిలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, రామినేని శ్రీనివాస్‌రావు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్, రాయకంటి ప్రతాప్, లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, కొండాల్‌రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు. మరోవైపు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య కూడా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్‌ఎస్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. టీఆర్‌ఎస్‌కేవీ నేతలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మిషన్ భగీరథకు సాయమందించండి

- ఆర్థికంగా ఆదుకోవాలి
- ప్రాజెక్టు నిర్వహణను భరించాలి
- కేంద్రమంత్రి గజేంద్రసింగ్‌ను కోరిన రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి
- ఢిల్లీలో జలశక్తి సదస్సుకు హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి ఆర్థికంగా సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కేంద్రాన్ని కోరారు. ప్రాజెక్టుకు అయిన ఖర్చులో సగభాగాన్ని నగదు రూపంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో గ్రామీణప్రాంతాల్లో తాగునీటి సరఫరా, స్వచ్ఛభారత్ నిర్వహణపై మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఎర్రబెల్లి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజు, కమిషనర్ నీతూప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి హాజరయ్యారు. ప్రతి ఇంటికి నీరందించేందుకు కేంద్రం ఇలాంటి సదస్సు నిర్వహించడం హర్షణీయమని, తెలంగాణలో ఇప్పటికే మిషన్‌భగీరథ పేరుతో ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. మిషన్‌భగీరథను అన్నిరాష్ర్టాల అధికారులు పర్యవేక్షించి అభినందించిన విషయాన్ని వివరించారు. వేసవికాలంలోనూ తాగునీటి కొరత లేకుండా చేయగలిగామని చెప్పారు. అయితే, మిషన్‌భగీరథ లాంటి భారీ ప్రాజెక్టుకు భారీగా నిధులు ఖర్చయ్యాయని.. కేంద్రం ఆర్థికంగా సహకారం అందించి ఆదుకోవాలని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరారు. మిషన్‌భగీరథ పథకం నిర్వహణకు ప్రతిఏటా రూ.2వేల కోట్లు ఖర్చవుతుందని.. కనీసం ఈ నిర్వహణ ఖర్చునైనా కేంద్రం భరించాలని విజ్ఞప్తి చేశారు.



మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి . చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ కూడా ఉన్నారు.



కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌ను కలుసుకొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎంపీ బండా ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

**కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రితో భేటీ**

రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం సాయంత్రం కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌తో భేటీ అయ్యారు. ఉపాధిహామీ పథకం అమలులో తెలంగాణ.. దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నదని వివరించారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో చేపట్టే అన్ని పథకాలనూ అమలుచేస్తున్నామని, ఈ పథకాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కింద రూ.175.18 కోట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.760 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 14వ ఆర్థికసంఘం మెరుగైన పనితీరు కనబరిస్తే ఇచ్చే (పెర్‌ఫార్మెన్స్) గ్రాంట్ కింద రూ.119.28 కోట్లు, 14వ ఆర్థికసంఘం నిధుల గ్రాంట్ కింద రూ.135.46 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ జనాభా 40 శాతం ఉన్న నేపథ్యంలో అంత్యోదయ మిషన్ అమలు చేస్తున్నామని.. రూర్బన్ క్లస్టర్ కింద యూనిట్లను మరిన్ని పెంచాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# భూమి పెరుగును!

- 64 ఎకరాలను 291 ఎకరాలుగా అమ్మేశారు.. చనిపోయినవాళ్లు సంతకాలు చేసినట్టు రికార్డులు
- ఒకే భూమిపై పెద్ద సంఖ్యలో సేల్ డీడ్లు.. అసలు పట్టాదారులకు తెలియకుండా దందా
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, పోలీసు అధికారుల కుమ్మక్కు.. 1990 నుంచి యథేచ్ఛగా కొనసాగుతున్న విక్రయాలు
- రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో రెవెన్యూ లీలలు


**ధర్మగంట**

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి (ఆవాస గ్రామం నీలిపోచమ్మ తండా)లో సర్వేనంబరు 356, 358, 360, 361, 369లలో ఖాస్రా పహాణీ ప్రకారం విస్తీర్ణం కంటే నాలుగున్నర రెట్ల భూమిని విక్రయించినట్లు సేల్‌డీడ్లు, పహాణీలు చెప్తున్నాయి. కనీసం రైతు టైటిల్‌డీడ్, పాస్‌పుస్తకాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలన్న నిబంధనను రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఉల్లంఘించారు. ఒకరు కొనుగోలుచేసిన భూమిని మళ్లీ రెవెన్యూ రికార్డులో మ్యుటేషన్ చేసి పాస్‌పుస్తకాలు విడుదల చేసేవరకు ఆగితే ఈ అక్రమాలు ఆగి ఉండేవేమో! కానీ.. ఒకదాని వెనుక మరొకటిగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నడిపారు. 1995 నుంచి ఇటీవల సాగిన సేల్‌డీడ్లను లెక్కిస్తే ఖాస్రా పహాణీలోని విస్తీర్ణానికి నాలుగున్నర రెట్లుగా తేలుతున్నది. ఇప్పటివరకు పెద్దసంఖ్యలో సేల్‌డీడ్స్ పుట్టుకొచ్చాయి. వీటిలో 10, 20 గుంటల వంతున విక్రయించిన డాక్యుమెంట్లు అధికంగానే ఉన్నాయి. వాటినే మళ్లీ మొత్తం విస్తీర్ణంతో మరొకరికి విక్రయించారు. ఈ తతంగం సర్వే నంబరు 360, 361 లలో చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది. 66 సేల్‌డీడ్స్‌కు పైగానే ఉన్నట్లు ఎన్‌కంబర్స్‌మెంట్ సర్టిఫికెట్లలో దర్శనమిస్తున్నాయి. లావాదేవీల సంఖ్య 140 వరకు ఉన్నది.

**నకిలీ వారసులతో దందా**

సర్వేనంబరు 360లో 13.32 ఎకరాలు, 361 లో 15.39 ఎకరాలుగా రికార్డులో ఉన్నది. ఖాస్రా పహాణీ ప్రకారం ఇక్రంఅలీ పట్టాదారుగా ఉన్నారు. ఆ తర్వాత వసూల్ బాకీ, సేత్వార్‌లో వారసులైన మహబూబ్‌అలీ, మహ్మద్ ఉమర్‌కు హక్కులు దక్కాయి. ఫ్యామిలీ సెటిల్‌మెంట్, ఖజాయిత్ ప్రకారం మహ్మద్ జహూర్ సర్వేనంబర్ 360లోని 13.32 ఎకరాలకు హక్కులు పొందారు. ఆర్వోఆర్, 1బీ, పాస్‌బుక్కులు తీసుకున్నారు. అయితే.. ఆయన వారసులైన తమకు హక్కులు కల్పించకుండా 1995 నుంచి ఇబ్బంది పెడుతున్నట్లు జహూర్ మనుమడు బషీరుద్దీన్ ఆవేదన వ్యక్తంచేశారు. పైగా హక్కుదారులకు బదులుగా మరొకరి నుంచి భూములు కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించుకొని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడో చనిపోయిన వ్యక్తులు కూడా బతికొచ్చినట్లుగా సేల్‌డీడ్స్ తయారుచేశారని ఆధారాలతో సహా రెవెన్యూ అధికారులకు చెప్పినా, చూపించినా ఇన్నేండ్లుగా పట్టించుకోవడం లేదని వాపోయారు.

**పీవోబీలో ఉన్నా రిజిస్ట్రేషన్లు**



మహ్మద్ జహూర్‌కి ఇచ్చిన పాస్‌పుస్తకం

సదరు సర్వేనంబర్లలోని భూములపై కేసులున్నాయి. అందుకే ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్ (పీవోబీ)లో 22ఏ కింద నమోదుచేశారు. ఈ భూములపై రిజిస్ట్రేషన్లు చేయకూడదని ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ జారీచేసిన ధ్రువీకరణ పత్రాలున్నాయి. సర్వేనంబర్లు 360, 361లోని 1111 గుంటల భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిషేధించారు. సర్వేనంబర్ 356, 358, 360, 361లో ఎఫ్‌ఐఆర్ నంబర్ 155/2010 ఉన్నట్టు, కోర్టు స్టే కారణాలతో నిలిపివేసినట్టు వెబ్‌సైట్‌లోనూ పేర్కొన్నారు. కానీ ఆ తర్వాత కూడా సేల్‌డీడ్స్ చేయడం విశేషం. సర్వేనంబరు 369లో భూమిని చూపించడం లేదు. ఇదేమని రిజిస్ట్రేషన్‌శాఖ సిబ్బందిని ప్రశ్నిస్తే.. వాళ్లకు పాస్ పుస్తకాలు ఇచ్చినందున రిజిస్ట్రేషన్ చేశామంటూ గద్దించినట్లు తెలిసింది.

**తప్పిదాలు జరిగినట్లు వీఆర్వో ధ్రువీకరణ**

సర్వేనంబరు 360, 361 అసలు యజమానుల విజ్ఞప్తిమేరకు 2010 జనవరి 30న అప్పట్లో పని చేసిన, ఈ వ్యవహారానికి సాక్షిగా నిలిచిన వీఆర్వో పీ రాధాకిషన్‌రావు లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చారు. సర్వేనంబర్ 360, 361లో అనేక తప్పిదాలు సాగాయని, అసలు పట్టాదారులకు బదులుగా ఇతరుల పేర్లు నమోదయ్యాయని, అనేక డాక్యుమెంట్లల్లో పొరపాట్లు దొర్లాయని ధ్రువీకరించారు. ఈ మేరకు వీఆర్వో రాసిచ్చిన పత్రాన్ని తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు సమర్పించినప్పటికీ లావాదేవీల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నట్లు బాధితుడు ఎండీ బషీరుద్దీన్ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ఒక కేసు దర్యాప్తు సందర్భంగా 2014 జూలై 18న అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్న ఓ పోలీసు అధికారి ఇప్పటికీ వాటిని తిరిగి ఇవ్వలేదు. పైగా కేసులో చార్జ్‌షీటు కూడా తయారు చేయకుండా పత్రాలను నాశనంచేసినట్లు బాధితుడు ఆరోపించారు. మహ్మద్ జహూర్‌కు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి అతని వారసులకు విరాసత్ చేయాలని, రికార్డుల్లో నమోదు చేయాలని కోరుతూ 1995 నుంచి తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు బషీరుద్దీన్ అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నారు. ఇప్పటికీ నకిలీ పట్టాదారులకు రైతుబంధు కింద ప్రభుత్వ సాయం అందుతుండటం విశేషం.

**పట్టాదారులెవరు? అమ్మిందెవరు?**

సర్వేనంబరు 360లో 13.32 ఎకరాలు, సర్వే నంబరు 361లో 15.39 ఎకరాలకు అసలు పట్టాదారులెవరు? ఖాస్రా పహాణీ, చెస్లా పహాణీ, సేత్వార్, తక్తా, చౌపస్లా రికార్డుల్లో ఉన్న పట్టాదారులు ఎప్పుడు చనిపోయారు? వారు విక్రయించినట్లుగా చెప్తున్న లేదా సృష్టించిన రికార్డుల్లో సంతకాలు పెట్టిందెదరు? రిజిస్ట్రేషన్లు ఎప్పుడు పూర్తయ్యాయి? చనిపోయిన వారు ఎట్లా వచ్చి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో సంతకాలు చేశారు? వారి అసలు వారసులెవరు? మొదటి రికార్డుల్లో పేర్లకు, సేల్‌డీడ్లలో విక్రయించిన వారి పేర్లకు మధ్య వ్యత్యాసం ఎందుకు? ఇలాంటి ప్రశ్నల పరంపరకు సమాధానాలు దొరికితే అసలుకంటే నాలుగున్నర రెట్ల భూమికి రిజిస్ట్రేషన్లు చేసి, అసలు భూయజమానులను, ప్రభుత్వాన్ని దగా చేసినవారి ఆచూకీ బయటికొస్తుంది. లేని భూమిని కొనుగోలుచేసిన అమాయకుల్లో పలు వృత్తులకు సంబంధించిన నిపుణులతోపాటు.. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో పనిచేసి రిటైరైనవారు కూడా ఉన్నారని తెలుస్తున్నది.

**ఎప్పుడో జరిగింది**

నా హయాంలో జరుగలేదు. ఇప్పుడేమో నన్ను అడుగుతున్నారు. నాకేమీ తెలియదు. ఇప్పుడు నన్ను చేయమంటే నేనేం చేస్తా? అంతా పాతవాళ్లు చేశారు. కొన్నింటిపైన కేసులున్నాయని తెలుసు. మిగతాది ఎలా జరిగిందో తెలియదు.

**– జగదీశ్, వీఆర్వో, నందివనపర్తి**

**కొనేటప్పుడే చూసుకోవాలి**

ఈమధ్యే విషయం నా దృష్టికి వచ్చింది. వీటిపై కేసులున్నాయి. పీవోబీలోనూ ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో తెలియదు. మ్యుటేషన్‌కు వస్తేనే తెలుస్తుంది. కొనుగోలు చేసేటప్పుడే విషయాలు చూసుకోవాలి. ఒక్కసారి రిజిస్ట్రేషన్ జరిగితే దాన్ని రద్దుచేసే అధికారం మాకు లేదు. కోర్టుకు వెళ్లాల్సిందే. ఐదు సర్వేనంబర్లలో లెక్కకు మించిన సేల్‌డీడ్స్ ఎలా అయ్యాయో పరిశీలిస్తాం. అంతకంటే ఇప్పుడేం చేయలేం.

**– పుష్పలత, తాసిల్దార్, యాచారం**

**ఎన్నో ఏండ్లుగా తిరుగుతున్నాం**

నందివనపర్తిలో మాకు సర్వేనంబర్ 360, 361లో భూమి ఉన్నది. మా నాన్న, తాతలు విక్రయించారంటూ కొందరు డాక్యుమెంట్లు సృష్టించారు. మా తాత ఎప్పుడో చనిపోయారు. ఆయన అమ్మినట్లుగా సేల్‌డీడ్ తయారుచేశారు. డెత్ సర్టిఫికెట్ చూపించాం. కానీ పట్టించుకోవడం లేదు. పైగా మా భూమిలోకి మేం వెళ్తే కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా మేం పెట్టిన దరఖాస్తులను పట్టించుకోవడం లేదు. ఆఖరికి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా దిక్కులేదు. కానీ అవతలి వ్యక్తులు ఫిర్యాదుచేయగానే మాపై కేసు నమోదుచేస్తున్నారు. మా ఒరిజినల్ డాక్యుమెంట్లు కూడా ఓ పోలీసు అధికారి తీసుకెళ్లాడు. మళ్లీ మేం సర్టిఫైడ్ కాపీలు తీసుకున్నాం. కానీ పోలీసులు తిరిగి ఇవ్వలేదు. భూమిని నాలుగున్నర రెట్లు పెంచేసి అనేక మందికి సేల్‌డీడ్స్ చేశారు. ఇకనైనా సమగ్ర దర్యాప్తు చేయకపోతే అనేకమంది మోసపోయే అవకాశం ఉన్నది. మా భూమికి సంబంధించిన రికార్డులను ఖాస్రా నుంచి పరిశీలిస్తే ఎవరికి హక్కులు ఉన్నాయో తెలుస్తుంది. ఆ పనిచేయకుండా ఈ మధ్యకాలంలో పాస్‌పుస్తకాలు అక్రమ మార్గంలో పొందినవారికే అధికారులు మద్దతు పలుకుతున్నారు. మాకు ఇకనైనా న్యాయం చేయండి.

**– ఎండీ బషీరుద్దీన్, పట్టాదారుడి వారసుడు**

**వాయిదాపడిన 18 మండలాల్లో**

## 15న ఎంపీపీ ఎన్నికలు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్‌ఈసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 18 మండలాల్లో ఇటీవల వివిధ కారణాలతో వాయిదాపడిన కో-ఆప్షన్, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను ఈ నెల 15న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పరిషత్ ఫలితాలు వెలువడిన తర్వాత ఈ నెల ఏడున ప్రత్యేక సమావేశాల ద్వారా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలోని 32 గ్రామీణ జిల్లా పరిషత్‌లలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తిచేశారు. 18 మండల ప్రజాపరిషత్తుల్లో కోరం లేకపోవడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోలేదు. ఈ 18 మండలాల్లోని పదవులకు ఈ నెల 15న ఎన్నికలు నిర్వహించాలని ఎస్‌ఈసీ కమిషనర్ నాగిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికయ్యే పాలక మండళ్ల పదవీకాలం ఏ తేదీ నుంచి మొదలవుతుందన్న విషయాన్ని ఎస్‌ఈసీ విడిగా నోటీఫై చేస్తుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, సారంగాపూర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆలపల్లి, ముల్కలపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవీపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలోని టెక్కల్, సంగారెడ్డి జిల్లాలోని మొగుడంపల్లి, నల్లగొండ జిల్లాలోని చందంపేట, కేతేపల్లి, నేరేడుగొమ్ము, సూర్యాపేట జిల్లాలోని చిల్కూరు, రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్, మాడుగుల, జనగామ జిల్లాలోని తరిగొప్పుల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల పరిషత్‌ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించారు. ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక సమావేశానికి సంబంధించి సంబంధిత మండలాల గెజిటెడ్ అధికారులు 14వ తేదీలోగా నోటీసులు జారీచేయాలని సూచించారు. ఈ మండలాల్లో ఉదయం 9-10 గంటల మధ్య కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక తర్వాత మ ధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్‌లో సూచించారు. ఏదైనా కారణాలతో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించలేకపోతే ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు కూడా నిర్వహించరాదని, దీనిపై ఎస్‌ఈసీకి నివేదించాలని పేర్కొన్నారు.


GITAM (DEEMED TO BE UNIVERSITY) (Estd. u/s 3 of the UGC Act, 1956)
VISAKHAPATNAM • HYDERABAD • BENGALURU
Accredited by NAAC with A+ Grade

CENTRE FOR DISTANCE LEARNING
Approved by Distance Education Bureau (DEB), UGC, New Delhi
ELIGIBLE FOR CENTRAL & STATE GOVERNMENT EMPLOYMENT

ADMISSIONS OPEN - ACADEMIC YEAR BATCH 2019-20

MBA* GENERAL | MBA HRM | MCA | M.Sc. Biotechnology | MA English/Economics | M.Com. | BA | B.Com

* with specialisations in Finance, Marketing, Systems, Hospital Management and Operations Management

- Diploma in Env. & Sustainable Mgmt.
- Diploma in Communicative English
- PG Diploma in Communication Skills
- Diploma in Computer Applications

Download / Sale of applications 12-06-2019 | Last Date for Submission 31-08-2019

పై కోర్సులతో పాటు ఏ విధమైన ప్రాథమిక విద్యార్హతలు లేని వారి కోసం
బి.ఎ./బి.కామ్ ప్రవేశ పరీక్ష

18 సంవత్సరాలు, ఆపై వయస్సు గల అభ్యర్థులు ఎవరైనా ఈ ప్రవేశ పరీక్షకు ధరఖాస్తు చేసుకొనవచ్చును. ఇందులో ఉత్తీర్ణులైన వారికి బి.ఎ./బి.కామ్ లో ప్రవేశం లభిస్తుంది

దరఖాస్తు చేయుటకు ఆఖరు తేది: 22-07-2019 | ప్రవేశ పరీక్ష నిర్వహించు తేది: 28-07-2019

హెల్ప్‌లైన్: 0891-2 866 466 / 2 866 455 / 81 796 81 900
పూర్తి వివరాలకు, దరఖాస్తు డౌన్ లోడు చేసుకొనుటకు : cdl.gitam.edu
DIRECTOR

GU City Centre : 2nd & 3rd Floors, Balaji Metro Plaza, Dondaparthi Main Road, Visakhapatnam - 530 016. Mob: 81 796 81 900
GU City Centre : 6-2-913/914, 2nd Floor, Progressive Towers, Khairatabad, Hyderabad- 500 004. Mob: 81 796 81 891 / 812

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



## ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

- నల్లగొండ జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్
- 'ఒక ఊరు వంద తప్పులు' కథనానికి స్పందన


గొట్టిముక్కల రైతులతో మాట్లాడుతున్న నల్లగొండ జేసీ చంద్రశేఖర్

**దేవరకొండ, నమస్తే తెలంగాణ:** రికార్డుల్లో తప్పుల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి రైతుకూ న్యాయంచేస్తామని నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'ఒక ఊరు వంద తప్పులు' కథనానికి జేసీ స్పందించారు. గొట్టిముక్కల సర్పంచ్ కడారి అయ్యన్నతోపాటు రైతులతో దేవరకొండ తాసిల్దార్ కార్యాలయంలో మాట్లాడి గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వారంరోజుల్లో గ్రామంలో ఉన్న భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంపై వీఆర్వోలతో ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ ద్వారా తెలుసుకొని వెనుకబడ్డ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. గొట్టిముక్కల గ్రామంలో తక్షణమే సమస్యలను పరిష్కరించేదిశగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ధరణి పూర్తయిన గ్రామాలకు చెందిన వీఆర్వోలను గొట్టిముక్కల భూ సమస్యలకోసం ప్రత్యేకంగా నియమిస్తామన్నారు. తాసిల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ జేసీ ఆదేశాలమేరకు ముగ్గురు ఆపరేటర్లను గొట్టిముక్కల గ్రామంలోనే ఉంచి రికార్డులను పూర్తిగా పరిశీలనచేయించి భూసమస్యలను కొలిక్కితెస్తామని పేర్కొన్నారు. గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి చొరువ చూపడంపై రైతులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

## రిటైర్డ్ ఆర్డీవోకు పాస్‌పుస్తకాలు

- 'రిటైర్డ్ ఆర్డీవోకూ తప్పని వ్యథ' కథనంపై స్పందన



**నల్లగొండ, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా రిటైర్డ్ ఆర్డీవోకు రెవెన్యూ వ్యథ తీరింది. మే నెల 17వ తేదీన 'రిటైర్డ్ ఆర్డీవోకూ తప్పని వ్యథ' శీర్షికన ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. నెల రోజుల తర్వాత మంగళవారం పాస్‌బుక్‌ను మంజూరుచేశారు. నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రం రెవెన్యూ శివారులోని సర్వే నం.1357, 1358లో 15 గుంటల భూమిని కొనుగోలు చేసిన రిటైర్డ్ ఆర్డీవో బషీరుద్దీన్ కుటుంబసభ్యులకు పాస్‌పుస్తకాలు అందకపోవడంతో, వారు మే 16న ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ వ్యవహారంపై నమస్తే తెలంగాణ పూర్తి కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ వివరాలను ఆరాతీసి విచారణకు ఆదేశించారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచన మేరకు కనగల్ రెవెన్యూ యంత్రాంగం విచారణ జరిపి ఎట్టకేలకు పాస్‌పుస్తకాలను జారీ చేసింది. 1358 సర్వే నంబర్‌లో బషీరుద్దీన్ భార్య వాయిదున్నిసా పేరుమీద 3.20 ఎకరాలతోపాటు పెద్ద కుమారుడి పేరిట 1.20 ఎకరాలను సరిచేసి ఇచ్చారు. రెండో కుమారుడి పేరిట 2 సర్వేనంబర్లలో ఉన్న 3.34 ఎకరాలకు సంబంధించి డిజిటల్ సంతకంచేసి పాస్‌పుస్తకం ముద్రణకోసం పంపినట్లు తాసిల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

## పట్టా చేయలేదని ఆత్మహత్యాయత్నం


- నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఘటన
- రైతుకు న్యాయంచేస్తామన్న రెవెన్యూ అధికారులు

**అమ్రాబాద్ రూరల్:** భూమి పట్టా చేయడంలేదని నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంకటయ్య కిరోసిన్ పోసుకోగా, గమనించిన రెవెన్యూ అధికారులు అడ్డుకొని, న్యాయం చేస్తామని చెప్పారు. తన తండ్రికి చెందిన నాలుగెకరాల భూమి పట్టా కావాల్సి ఉండగా ముగ్గురు అన్నదమ్ములకు మూడెకరాలు పట్టా చేశారని, మిగిలిన ఎకరా తనపేరున విరాసత్ చేయాల్సి ఉన్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని వెంకటయ్య తెలిపాడు. దీనిపై డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మీదేవిని వివరణ కోరగా గ్రామానికి చెందిన ఇద్దరి పేర్లు ఒకేలా ఉండటంతో ఆన్‌లైన్‌చేయడానికి సాంకేతిక లోపం ఏర్పడిందని, దానిని సరిచేసి రైతు పేర పట్టా చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మీ సేవలో కేవైసీని పూర్తిచేయించినట్టు తెలిపారు.


అమ్రాబాద్ తాసిల్దార్ కార్యాలయం వద్ద చేతిలో కిరోసిన్ డబ్బాతో రైతు వెంకటయ్య

# 2 లక్షలు తిన్నా పనిచేయలేదు

- స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబాన్ని ముప్పుతిప్పలు పెడుతున్న అధికారులు
- సర్వేచేసినా భూమిని అప్పగించని వైనం
- ఉన్నతాధికారుల ఆదేశాలను బుట్టదాఖలుచేసిన మండలాధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెంవాసి రామనర్సమ్మ


రామనర్సమ్మకు భూమి కేటాయించాలని సూచిస్తూ 2007లో అప్పటి కలెక్టర్ దమయంతి జారీచేసిన సర్క్యులర్

స్వాతంత్ర్యసమరయోధుడి కుటుంబం పట్ల కూడా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు కెళ్లిన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన కడారి కర్రెయ్య కుటుంబానికి ఐదెకరాల భూమిని అప్పగించాలని జిల్లాస్థాయి అధికారులు ఆదేశాలు జారీచేసినా.. స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. రికార్డులు దొరుకడం లేదంటూ.. ఆ భూమి వ్యవసాయానికి పనికిరాదంటూ ముప్పుతిప్పలు పెడ్తున్నారు. 20 ఏండ్లుగా అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన ఆ కుటుంబసభ్యులు చివరకు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

**నర్సింహులపేట:** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కడారి కర్రెయ్య 40 ఏండ్ల క్రితం చనిపోయారు. ఆయన మరణానంతరం ఆయన భార్య రామనర్సమ్మకు ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో పింఛన్ మంజూరుచేసింది. తమకు వ్యవసాయ భూమి ఇప్పించాలని కోరుతూ ఆమె అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ అంబరీశ్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఏడీ మాణిక్‌రావు, సర్వేయర్ నారాయణరెడ్డి సర్వే నిర్వహించి.. ముంగిమడుగు గ్రామంలోని సర్వే నంబర్ 310 లో ప్రభుత్వ భూమి ఉన్నట్టు గుర్తించారు. సదరు భూమికి హద్దులు ఏర్పాటు చేసి.. రామనర్సమ్మకు అప్పగించాలని 2002లోనే జిల్లా స్థాయి అధికారులు ఆదేశించారు. కానీ మండల రెవెన్యూ అధికారులు రాకుండానే.. సర్వేచేయకుండానే.. తమకు రికార్డులు దొరుకడంలేని.. అది సేద్యానికి పనికిరాని భూమి అంటూ సమరయోధుడి కుటుంబాన్ని తిప్పుకొంటున్నారు. తమ నుంచి దాదాపు రూ.2 లక్షల వరకు లంచాలు తీసుకొని కూడా రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడ్తున్నారని కర్రెయ్య కుటుంబసభ్యులు వాపోతున్నారు. సర్వే నంబర్ 310లో 5.28 ఎకరాల బంచరాయి (ప్రభుత్వ) భూమి ఉన్నదని.. దానిని కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు ఆక్రమించారని ఆరోపించారు.

### నాటి సీఎం వైఎస్ ఆదేశించినా.. ఫలితంలేదు



అప్పటి ఉమ్మడిరాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కూడా స్వయంగా కలిసి దరఖాస్తు చేసుకొన్నాం. అయినా రెవెన్యూ అధికారులు కనికరించలేదు. అప్పటి తాసిల్దార్, ఇతర అధికారులు మా దగ్గర డబ్బులు తీసుకొని కూడా పనిచేయలేదు. 1978 నుంచి 2002 వరకు పహాణీలు తీసుకొని రమ్మన్నారు. అవి తీసుకవెళ్లినా ఫలితంలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాం. ఉన్నతాధికారులు ఆదేశించినా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదు. 'గతంలో పనిచేసిన వీఆర్వో.. తాసిల్దార్‌ను అడుగు. నాకు తెలియదు' అని సమాధానమిస్తున్నారు. ఈ విషయం తలనొప్పిగా మారిందంటూ తాసిల్దార్ దురుసుగా ప్రవర్తించి.. బయటకు పంపించారు. చేసేదిలేక మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుచేశా.

**- నారాయణరెడ్డి, రామనర్సమ్మ కుమారుడు**

### నా కుమారుడికి భూమి ఇప్పించండి



మా ఆయన పోరాటంచేసి జైలుకు పోయిండు. ఆయన పోయినాక నాకు పింఛన్ ఇస్తున్నారు. ఐదెకరాల భూమి ఇస్తామంటే చాలాసార్లు హైదరాబాద్, వరంగల్‌కు పోయిన. మా ఇంటికి అధికారులు వచ్చిండ్రు.. భూమి ఇస్తామన్నారు. ఇప్పటివరకు భూమి చూపించలె. నాకు చేతకావడంలేదు. కండ్లు సరిగా కనిపించడంలేదు. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు, కోడలు చనిపోయారు. వాళ్లకు కుమార్తె ఉన్నది. వాళ్లు ఇబ్బందుల్లో ఉన్నారు. మా ఆయన స్వాతంత్ర్య పోరాటంచేసినదానికి అధికారులు కనీసం గౌరవం ఇవ్వడంలేదు. బాధేస్తున్నది. చివరిదశలో ఉన్నా. భూమి ఇస్తే నా కుమారుడు వ్యవసాయం చేసుకొని బతుకుతాడు.

**- రామనర్సమ్మ, స్వాతంత్ర్య సమరయోధుడి భార్య**

## పట్టాలివ్వండి లేదా.. ప్రాణం తీసుకోనివ్వండి

- జేసీకి మొరపెట్టుకున్న దుగ్గొండి మండల రైతులు
- దుగ్గొండిలో తాసిల్దార్, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని ధర్నా
- అర్హులకు పట్టాలిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ


పట్టా ఇప్పించాలంటూ జేసీ కాళ్లు మొక్కుతున్న రైతు బొమ్మకంటి మొగిలి

**దుగ్గొండి:** భూములకు పట్టాలు ఇవ్వాలని వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండల రైతులు మంగళవారం జాయింట్ కలెక్టర్ మహేందర్‌రెడ్డికి మొరపెట్టుకొన్నారు. మంగళవారం జేసీ తాసిల్దార్ కార్యాలయానికి వస్తున్నారని తెలుసుకొన్న దుగ్గొండి మండలంలోని నాచినపల్లి, తొగర్రాయి, లక్ష్మీపురం, దేశాయిపల్లి, రేఖంపల్లి, వెంకటాపురం, ముద్దునూరు, స్వామిరావుపల్లి, జాఫర్‌పల్లి గ్రామాల రైతులు అక్కడికి చేరుకొన్నారు. తాసిల్దార్, వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని, వారిని సస్పెండ్‌చేయాలని డిమాండ్‌చేశారు. తాసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాచేశారు. తాసిల్దార్, వీఆర్వో అవినీతి నశించాలని నినాదాలుచేశారు. తాసిల్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమైన జేసీ బయటకు రావాలని రైతులు కోరారు. బయటకు వచ్చిన జేసీని దాదాపు గంటసేపు చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. తమ సమస్యలపై తాసిల్దార్, వీఆర్వో వ్యవహరించిన తీరును వివరించారు. సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకొన్న తమకు పట్టాలు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. భూములకు పట్టాలు అయినా ఇవ్వండి.. ప్రాణాలైనా తీసుకోనివ్వండంటూ జేసీతో ఆవేదనతో అన్నారు. భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు జేసీ మహేందర్‌రెడ్డి కాళ్లు మొక్కారు. దీంతో చలించిన జేసీ రైతులు దరఖాస్తులను పరిశీలించి వారంలోగా పట్టాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యు అధికారులను ఆదేశించారు.

### నా బిడ్డను అల్లుడు హింసిస్తున్నాడు

మాది దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామం. నా బిడ్డకు కట్నం కింద 1.30 ఎకరాల భూమి ఇచ్చిన. ఏడాది క్రితం సాదాబైనామాలో పట్టాకోసం దరఖాస్తు చేసుకొన్నా అధికారులు పట్టా ఇవ్వలేదు. పట్టాపుస్తకం లేకపోవడంతో రైతుబంధు రావడంలేదు. దీంతో నా అల్లుడు బిడ్డను హింసిస్తున్నాడు.

**- బండి కొమరమ్మ, తొగర్రాయి మహిళా రైతు**



### అర్హులైన రైతులకు పట్టాలు అందిస్తాం

దుగ్గొండి మండలంలోని వివిధ గ్రామాల రైతులకు అధికారుల నిర్లక్ష్యంతో పట్టాలు రాక రైతుబంధు కోల్పోవడం వాస్తవమని జాయింట్ కలెక్టర్ మహేందర్‌రెడ్డి అన్నారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకొని పట్టాలు రాని రైతులందరికీ పట్టాలిస్తామని చెప్పారు. మండలంలోని రెవెన్యు అధికారులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ నిమిత్తం వెళ్లిన తనకు రైతులు సమస్యలు చెప్పకొన్నారని, వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారని జేసీ పేర్కొన్నారు.

**- మహేందర్‌రెడ్డి జేసీ**

## ఆర్‌ఐ, వీఆర్వో సస్పెన్షన్

రెవెన్యూ రికార్డుల్లో తప్పులకు మూల్యం

మరో తాసిల్దార్‌కు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ మెమో.. పెద్దపల్లి కలెక్టర్ ఉత్తర్వులు

**పెద్దపల్లి కలెక్టరేట్:** మంథని మండలం నాగారంలో ప్రతాప్‌రెడ్డి అనే రైతుకు సంబంధించిన భూ రికార్డుల్లో చోటుచేసుకొన్న తప్పులకు అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతాపరెడ్డి పట్టా భూమి నమోదులో జరిగిన పొరపాట్లకు బాధ్యులైన అధికారులపై కొరడా ఝుళిపించారు. బాధిత రైతుచేసిన ఫిర్యాదుపై కలెక్టర్ దేవసేన తీవ్రంగా స్పందించారు. అప్పటి తాసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాజం, గ్రామరెవెన్యూ అధికారి సమ్మయ్యపై క్రమశిక్షణచర్యలు తీసుకొన్నారు. తాసిల్దార్ శ్రీనివాస్‌కు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ మెమో జారీచేశారు. ఆర్‌ఐ వెంకట్రాజం, వీఆర్వో సమ్మయ్యను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు.

## మా మాట!

### ఏండ్ల సమస్యలు తీరిపోతున్నాయ్



భూరికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేయించుకునేందుకు ఎన్నో ఏండ్లు ప్రయత్నించినా అవి సరికాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూశాఖలో తీసుకొస్తున్న మార్పులతో ఆ సమస్యలన్నీ తీరిపోతున్నాయి. ఇన్నాళ్లూ రైతులు ఎన్నిసార్లు అధికారులను కలిసినా పట్టించుకొనే వారు కాదు. ఎవరు డబ్బులు ఇస్తే అధికారులు వాళ్ల పనులే చేసిపెట్టేది. ఇప్పుడు పరిస్థితి అలాలేదు. సమస్య ఉందంటూ వెళ్తే వెంటనే పనులు చేస్తున్నారు. అధికారుల్లో ఈ మార్పు సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైంది.

**- పాశం పుల్లారెడ్డి, కల్మల్‌చెర్వు రైతు, గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా**

### రైతులకు మేలు జరుగుతున్నది



'ధర్మగంట' ద్వారా భూసమస్యలు తీరిపోయి రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు అధికారుల చుట్టూ తిరిగి వేసారిపోయారు. ధర్మగంటతో అధికారుల్లో చలనం వచ్చింది. భూరికార్డుల్లో ఉన్న తప్పులను సవరించి రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు అందజేస్తున్నారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన చేపట్టింది. కానీ అధికారుల అలసత్వంతో రికార్డుల ప్రక్షాళన పూర్తిస్థాయిలో జరుగలేదు. ఇప్పుడు ధర్మగంట ద్వారా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి రైతులకు మేలు చేస్తున్న 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- నిమ్మల శ్రీకాంత్ తిమ్మాపురం, అర్వపల్లి మండలం, సూర్యాపేట జిల్లా**

### అధికారులు నిర్లక్ష్యం వీడుతున్నారు



రైతులకు జీవనాధారమైన భూమి హక్కులను పొందడానికి రెవెన్యూ అధికారులు సతాయించడం నిత్యకృత్యంగా మారింది. కొందరు అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాంటి వారిని ధర్మగంట ద్వారా నమస్తే తెలంగాణ మేలుకొలిపి వారి బాధ్యతను గుర్తుచేస్తున్నది. అధికారులు నిర్లక్ష్యం వీడుతుండటంతో ఎన్నో ఏండ్లుగా పరిష్కారం కాని సమస్యలు తీరుతున్నాయి.

**- శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి దేవస్థానం చైర్మన్**

### రెవెన్యూశాఖ ప్రక్షాళన అవసరం



రెవెన్యూశాఖలో సమస్యలపై నమస్తే తెలంగాణ చేపట్టిన 'ధర్మగంట' ఎంతో బాగున్నది. భూరికార్డుల ప్రక్షాళన ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించే వీలున్నప్పటికీ, ఉద్యోగులు పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవడంతో సామాన్యులు ఇబ్బందులెదుర్కొన్నారు. ధర్మగంట ద్వారా అటు అధికారుల్లో, ఇటు సామాన్యుల్లో కొంతమేర చైతన్యం వచ్చింది.

**-వైకుంఠచారి, మిర్యాలగూడ**

# ధర్మారెడ్డి దౌర్జన్యం

- నల్లగొండ జిల్లా వనిపాకలో రెండెకరాలు కబ్జా
- ఆయన కనుసన్నల్లోనే రెవెన్యూ, పోలీస్ సిబ్బంది
- పదకొండేండ్లుగా బాధితుల పోరాటం


బాధితుడు భానుప్రకాశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆయన పేరు ధర్మారెడ్డి. చేసేది కోళ్ల వ్యాపారం. పైగా కాంగ్రెస్ నేత. పేరులో ధర్మం ఉన్నదే తప్ప చేసేవన్నీ అధర్మ పనులే. తన గ్రామంలోని భూములన్నీ ఆయనే కొంటుంటాడు. తను చెప్పిన రేటుకు అమ్మాల్సిందే. లేకపోతే, ఆ ఊర్లో గుంట భూమి కూడా ఎవరూ అమ్మడానికి వీల్లేదు. ఇలానే వందెకరాల దాకా సంపాదించాడని గ్రామస్థులు చెప్తారు. ఆయనకున్న రాజకీయ, ధనబలం కారణంగా సర్వేయర్లు సర్వేకూ రారు. ఒకవేళ వచ్చినా నివేదిక ఇవ్వడానికి జంకుతారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని తన అంగ, అర్థబలంతో అదుపులో ఉంచుకున్నాడు. ధర్మారెడ్డి తన పాలోళ్ల పొలాలనూ వదల్లేదు. అతనికి ఉన్న తొమ్మిది ఎకరాల పక్కనే ఉన్న భానుప్రకాశ్‌రెడ్డికి చెందిన రెండెకరాల భూమిని కబ్జా చేశాడు. ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు.. పదకొండేండ్ల నుంచి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని భానుప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అతని ఆగడాలతో విసుగు చెందిన బాధితుడు నమస్తే తెలంగాణ కార్యాలయానికి లేఖ రాశాడు. ఆ లేఖలోని సారాంశం భానుప్రకాశ్‌రెడ్డి మాటల్లోనే..

'మాది నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామం. సర్వేనంబర్లు 439, 440, 450లలో 11.21 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి మా తాత కొన్‌రెడ్డి నారాయణరెడ్డి నుంచి మా నాన్న మల్లారెడ్డికి వారసత్వంగా వచ్చింది. నాకు ఏడాది, మా అక్కకు మూడేండ్ల వయసున్నప్పుడు మా అమ్మ మరణించింది. మాకు భవిష్యత్తులో ఎలాంటి సమస్య రాకూడదన్న ఉద్దేశంతో మా తాత ఇద్దరి పేరిట 5.31 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. 1989 నుంచి అన్ని రికార్డులు, పట్టా, పహాణీ, కాస్తు ఆరోజు నుంచి ప్రభుత్వం ఇటీవల జారీచేసిన కొత్త పాస్‌పుస్తకం (2018) వరకూ మా పేరిట ఉన్నాయి. ఇందులో మా అక్కకు చెందిన 5.31 ఎకరాల భూమిని మా పెద్దమ్మ కొనుగోలుచేశారు. నా భూమిని మా నాన్న సాగుచేసేవారు. 2009లో నాన్న మరణించారు. అప్పుడు, మేం భూమి సేద్యం కోసం వెళ్లగా.. అందులోని రెండెకరాలను ధర్మారెడ్డి కబ్జా చేశారని తెలిసింది. వెంటనే చిట్యాల తాసిల్దార్ కార్యాలయంలో భూమి సర్వే చేయించాలని దరఖాస్తు చేసుకొన్నాం. అప్పటి ఎమ్మార్వో సర్వేచేయమని సర్వేయర్ మజీద్‌కు అప్పగించినప్పటికీ ఆయన సర్వే చేయలేదు. తర్వాత ఆయన స్థానంలో మరో సర్వేయర్ శ్రీధర్ వచ్చారు. ఎంతగానో ప్రాధేయపడ్డాక.. సర్వేనంబర్ 450లో ధర్మారెడ్డి కబ్జాలో ఉండటం వల్ల పూర్తి సర్వే చేయలేనని చెప్పి వెనుతిరిగి వెళ్లారు. సర్వే రిపోర్టు ఇవ్వమన్నా ససేమిరా అన్నారు. ఈ లోపు మరో సర్వేయర్ శ్రీహరి వచ్చారు. తనూ పట్టించుకోలేదు. అప్పట్నుంచి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రెవెన్యూ సిబ్బంది సర్వేచేయడం లేదు. 2007 నుంచి సర్వేయర్, వీఆర్వో, ఆర్‌ఐ, తాసిల్దార్, ఆర్డీవో, జిల్లా ల్యాండ్ సర్వే సంచాలకుడు, కలెక్టర్ల చుట్టూ పదకొండేండ్లుగా తిరుగుతున్నా పరిష్కారం కాలేదు. చివరగా డీఐ సర్వేచేసి హద్దు రాళ్లు చూపించి సర్వే పంచనామా నివేదిక ఇచ్చి ధర్మారెడ్డి రెండెకరాలు కబ్జాచేశారని నిర్ధారించారు. దీంతో భూమి సాగు కోసం వెళ్లగా ధర్మారెడ్డి అడ్డుకున్నారు. సర్వేయర్ చూపించిన రాళ్లు తొలిగించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. స్థానిక పోలీసులను తన ఆర్థిక బలంతో లొంగదీసుకొని బెదిరించారు. మా భూమిని తక్కువ రేటుకే అమ్మాలని, లేకపోతే ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరిస్తున్నారు. ధర్మగంట ద్వారా రెవెన్యూ అధికారులు మా బాధను విని.. ఇప్పటికైనా పరిష్కరిస్తారని ఆశిస్తున్నా'

### కబ్జాచేశాడని తేలితే..

భానుప్రకాష్‌రెడ్డి ఫిర్యాదు ఆధారంగా పరిశీలిస్తే.. వారి పేరిటే రికార్డులున్నాయని తెలిసింది. వచ్చే సోమవారం నోటీసులిచ్చి సర్వేచేయాలని నిర్ణయించాం. సర్వేలో ధర్మారెడ్డి కబ్జాచేశాడని తేలితే ఆర్డీవోకు సమాచారం అందజేసి.. తర్వాతి చర్యల్ని చేపడతాం. బాధితుడికి తగిన న్యాయంచేస్తాం.

**- విశాలాక్షి, ఎమ్మార్వో, చిట్యాల**


మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర క్వారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాయత్రి రవి


ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసి తన కూతురు స్నేహ వివాహానికి హాజరు కావల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా


ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసి తన కుమారుడి పెండ్లికి రావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేస్తున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి. చిత్రంలో ఎమ్మెల్యే షకీల్ ఉన్నారు


తాను రచించిన తెలి రేకలు పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న ప్రముఖ పాత్రికేయులు టంకశాల అశోక్. చిత్రంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

## 'చుక్కాని' ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు రచించి, ప్రచురించిన చుక్కాని (సంక్షేమ పాలనకు పునర్ నిర్వచనం కేసీఆర్) అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఒక పని విధానమైతే, పథకాల అమలు వెనుక ఉన్న ప్రభుత్వ లక్ష్యాలను, ఆశయాలను సాధికారికంగా చెప్పడం ఎంతైనా అవసరమని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి రచనలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. వకుళాభరణంను సీఎం కేసీఆర్ అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు పాల్గొన్నారు.

## కాళేశ్వరానికి కట్టుదిట్టమైన భద్రత

- ప్రాజెక్టు పరిధిలోని పీఎస్‌లు టైప్ 'ఏ'కు అప్‌గ్రేడ్
- కాటారం వద్ద ట్రాఫిక్ పీఎస్.. పోలీస్‌శాఖ ప్రతిపాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. ప్రాజెక్టు రక్షణతోపాటు పరిసర ప్రాంతాల్లో భవిష్యత్‌లో పెరుగనున్న పర్యాటకుల రద్దీ దృష్ట్యా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పరిధి ప్రాంతాల్లోని నాలుగు పోలీస్‌స్టేషన్లను 'ఎఫ్' టైప్ నుంచి 'ఏ' టైప్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ ప్రతిపాదనల్లో మేడిగడ్డ బరాజ్ పరిధిలోని పలిమెల, కన్నెపల్లి పంప్‌హౌస్ పరిధిలోని కాళేశ్వరం, అన్నారం బరాజ్ పరిధిలోని కొయ్యూరు, తుపాకులగూడెం బరాజ్ పరిధిలోని కన్నాయిపల్లి పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. 'ఎఫ్' టైప్‌లో ఉన్న ఈ పీఎస్‌లలో 29 మంది చొప్పున సిబ్బంది ఉన్నారు. ఏ టైప్‌గా అప్‌గ్రేడ్ అయితే ప్రతి పీఎస్‌లో సిబ్బంది సంఖ్య 120కి పెరుగుతుంది. స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారి వ్యవహరిస్తారు. ప్రతిసారి ఇతర విభాగాల పోలీసులను కేటాయించే అవసరం లేకుండా.. ప్రాజెక్టు పరిధిలోని పీఎస్‌లలో సిబ్బంది సంఖ్యను పెంచడం ద్వారా నిత్యం భద్రతను పర్యవేక్షించేందుకు వీలవుతుంది. కాటారం వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం కాటారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపినట్టు ఐజీ నాగిరెడ్డి తెలిపారు.

## అందుబాటులోకి ఓవర్‌హెడ్ రిజర్వాయర్లు

రూ.1,550 కోట్లతో పనులు • 10 పట్టణాల్లో 85 శాతం పూర్తి: అరవింద్‌కుమార్


మాసబ్‌ట్యాంకులోని సీడీఎంఏ కార్యాలయంలో మాట్లాడుతున్న పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణ స్థానిక సంస్థల్లో ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను మూడునెలల్లోపు అందుబాటులోకి తేవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఇకనుంచి పట్టణాల్లో స్వయంగా పర్యటించి పనులను పర్యవేక్షిస్తానని చెప్పారు. మంగళవారం మాసబ్‌ట్యాంకులోని సీడీఎంఏ కార్యాలయంలో అర్బన్ మిషన్ భగీరథ, అమృత్, టీఎండీపీ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ పథకాల కింద చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. పది మున్సిపాలిటీల్లో రూ.1,550 కోట్లతో చేపట్టిన మంచినీటి పనులు దాదాపు 85 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ సమీక్షలో ఈఎన్సీ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ పురోగతిపై కూడా అరవింద్‌కుమార్ సమీక్షించారు. ఇందులో జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్, అదనపు కమిషనర్లు అద్వైత్‌సింగ్, సిక్తాపట్నాయక్, చీఫ్ ఇంజినీర్లు శ్రీధర్, సురేశ్‌కుమార్, జియావుద్దీన్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నల్సార్‌లో రెండు పీజీ డిప్లొమా కోర్సులు

జూలై నుంచి ప్రారంభం

**శామీర్‌పేట:** నేరరహిత సమాజ నిర్మాణానికి నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, ట్రూత్ ల్యాబ్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని నల్సార్‌లో క్రిమినల్ లా, ఫోరెన్సిక్ సైన్స్ పీజీ డిప్లొమో కోర్సులను ప్రవేశపెట్టాయి. న్యాయవాదులు, చట్టాలు అమలు చేసే అధికారులతోపాటు పోలీస్ యంత్రాంగం, జాతీయ అంతర్గత సెక్యూరిటీ, క్రిమినల్ విచారణ పరిశోధనా సంస్థలకు, ప్రాసిక్యూటర్లకు, న్యాయమూర్తులు, జైలు అధికారులకు ఉపయోగపడేలా ఈ కోర్సులను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. లా ఉత్తీర్ణులతోపాటు ఆర్ట్స్, సైన్స్, కామర్స్, మెడిసిన్, ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ చదివినవారికి ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ జీ భవానీప్రసాద్, డాక్టర్ కేపీసీ గాంధీ, మహ్మద్, ఐపీఎస్ అధికారి డాక్టర్ ఎస్ ఉమపట్ని తదితరులు పీజీ డిప్లొమా తరగతులు బోధించనున్నారని నల్సార్ తెలిపింది. జూలై నెల నుంచి ప్రారంభం కానున్న ఈ కోర్సు పూర్తివివరాల కోసం www.nalsar.ac.inలో సంప్రదించవచ్చని సూచించింది.

# నేటినుంచి బడిగంట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. 2019-20 విద్యాసంవత్సరంలో వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు తరగతులు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వరకు వేసవి సెలవులు ప్రకటించింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ మంగళవారం కొత్త విద్యా క్యాలండర్ విడుదలచేశారు. దీని ప్రకారం మొత్తం 232 పనిదినాలున్నాయి. ఈ ఏడాది స్కూళ్లు జూన్1నుంచి పునఃప్రారంభం కావాల్సి ఉన్నా.. ఎండల నేపథ్యంలో వేసవి సెలవులను ప్రభుత్వం పొడిగించిన విషయం తెలిసిందే. దీనివల్ల కొత్త విద్యాసంవత్సరంలో 12 పనిదినాలు పెంచారు.

**దసరా సెలవులు 16 రోజులు**

ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 13 వరకు దసరా సెలవులు ఉంటాయి. మిషనరీ స్కూళ్లకు ప్రత్యేకంగా డిసెంబర్ 22 నుంచి 28 వరకు క్రిస్మస్ సెలవులు ప్రకటించారు. సంక్రాంతి సెలవులు వచ్చే ఏడాది జనవరి 11 నుంచి 16 వరకు ఉంటాయి. స్టేట్ సిలబస్ స్కూళ్లకు అక్టోబర్ 21 నుంచి 26 వరకు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7 నుంచి 16 వరకు సమ్మేటివ్-2 నిర్వహించనున్నారు. ఫార్మేటివ్-1 పరీక్షలను జూలై 31 నుంచి, ఫార్మేటివ్-2 సెప్టెంబర్ 27 నుంచి, ఫార్మేటివ్-3 30 నుంచి, ఫార్మేటివ్-4 పదోతరగతి వారికి జనవరి 31 నుంచి, 1-9 వారికి ఫిబ్రవరి 29 నుంచి నిర్వహించనున్నారు.

**స్కూల్ వేళల్లో మార్పులు లేవు**

కొత్త విద్యాక్యాలండర్‌లో పాఠశాలల వేళల్లో మార్పులు చేయలేదు. ఉన్నత పాఠశాలల్లో పనివేళలు.. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉదయం 9 సాయంత్రం 4.15 గంటలవరకు. జంటనగరాల్లో ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 వరకు. ప్రాథమిక పాఠశాలలు (1-5) ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు. జంటనగరాల్లో ఉదయం 8.45 నుంచి సాయంత్రం 3.45 వరకు. ఉన్నత పాఠశాలల్లో కొనసాగే ప్రాథమిక పాఠశాలల తరగతులు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.15 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కొనసాగుతాయి.



**ఏడాదిలో రెండుసార్లు హెల్త్ చెకప్**

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఏడాదిలో రెండుసార్లు వైద్యపరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. క్యుమిలేటివ్ రికార్డులను కూడా సరిగా నిర్వహించాలని, ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని విద్యాక్యాలండర్‌లో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం తరగతులవారీగా విద్యార్థులను గుర్తించి, వారిలో అభ్యాసన పురోగతిని అంచనావేయాలి. రోజువారీగా విద్యార్థుల హాజరు, పురోగతిపై దృష్టిసారించాలి. ప్రతి స్కూల్లో రోజూ 90% విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాల నిర్వహణ కమిటీలో ప్రధానోపాధ్యాయులు భాగస్వాములు కావాలి. తరుచుగా స్కూల్‌కు రాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులను సంప్రదించి, ఆ విద్యార్థి రోజూ స్కూల్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కమిషనర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

- స్కూళ్ల మొత్తం పనిదినాలు 232
- సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 13 వరకు దసరా సెలవులు
- డిసెంబర్ 22 నుంచి 28 వరకు మిషనరీ స్కూళ్లకు క్రిస్మస్ సెలవులు
- వచ్చే ఏడాది జనవరి 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 23 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- 2019-20 విద్యాక్యాలండర్ విడుదల

## యథావిధిగా కృష్ణా ట్రిబ్యునల్ విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా ట్రిబ్యునల్ విచారణ యథావిధిగా కొనసాగనున్నది. వచ్చేనెల జరుగనున్న తెలంగాణ సాక్షి క్రాస్ ఎగ్జామినేషన్‌ను వాయిదావేయాలని ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తిని కృష్ణా ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకోలేదు. ముందుగా నిర్ణయించిన మేరకు జూలై 1వ తేదీ నుంచి 3 వరకు, 29 నుంచి 31వ తేదీల్లో క్రాస్ ఎగ్జామినేషన్ యథావిధిగా జరుగుతుందని ట్రిబ్యునల్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు లిఖితపూర్వక సమాచారాన్ని ఇచ్చింది.

## ఆరెంజ్ ట్రావెల్స్‌లో ఐటీ దాడులు

**పేట్‌బషీరాబాద్:** హైదరాబాద్‌లోని ఆరెంజ్ ట్రావెల్స్ కార్యాలయాలపై ఆదాయపన్ను శాఖ అధికారులు మంగళవారం దాడులు చేశారు. సుచిత్ర ప్రాంతంలో ఉన్న ప్రధాన కార్యాలయంలో సాయంత్రం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు డాక్యుమెంట్లను పరిశీలించారు. బేగంపేటలోని కార్యాలయంలోనూ తనిఖీలు జరిపినట్టు తెలిసింది.

## ప్రశాంతంగా పది సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సోమవారం (ఈ నెల 10) నుంచి ప్రారంభమైన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఫస్ట్ లాంగ్వేజీ పేపర్-2 కోసం 9,309 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 6,382 మంది పరీక్షకు హాజరయ్యారు.

# జూలై చివర్లోగా పూర్తిస్థాయి బడ్జెట్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ

- తాత్కాలిక బడ్జెట్‌కు స్వల్ప మార్పులతో అసలు పద్దు
- హామీలు నెరవేర్చేలా రూపకల్పన
- విస్తృత కసరత్తు చేస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-2020) కోసం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జూలై నెలాఖరులోగా, వీలైతే మూడో వారంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం జూలై 5న పార్లమెంట్‌లో పూర్తిస్థాయి బడ్జెట్‌లో ప్రవేశపెట్టబోయే పథకాలు, రాష్ట్రాలకు కేటాయించే పన్నుల వాటా, గ్రాంట్-ఇన్-ఎయిడ్‌లను పరిగణనలోకి తీసుకుని ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కొన్ని మార్పులు, చేర్పులతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం విదితమే. ఇదేవిధంగా మార్చి 22న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పేరుకు ఇది తాత్కాలికమే అయినప్పటికీ పెద్దపద్దులతో పూర్తిస్థాయి వివరాలను బడ్జెట్‌లో పొందుపరిచారు. రూ.1,82,017 కోట్లతో ఆరునెలల కోసం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను శాసనసభ ఆమోదించింది. ఈ ఆరునెలల వ్యవధి సెప్టెంబర్‌తో ముగియనున్నది. దీంతో రాష్ట్ర సొంత రాబడులతోపాటు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా, గ్రాంట్లను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి బడ్జెట్‌కు రూపమిస్తున్నారు. గత నాలుగేండ్లుగా రాష్ట్ర రాబడులు, పన్నేతర ఆదాయం బాగా పెరుగుతుండటంతో బడ్జెట్ పరిమాణం కూడా భారీగా పెరుగుతున్నది. ఏటా సొంత రాబడి కనీసం 19 శాతం చొప్పున పెరుగుతుండటంతో దాని ప్రభావం బడ్జెట్‌పై ఉంటున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్ రూ.1.74 లక్షలకోట్లు దాటింది. ఈసారి రాబడి వృద్ధిరేటు 15% దాటడంతో అదేస్థాయిలో బడ్జెట్ కూడా రూ.2 లక్షలకోట్లకు పెరుగొచ్చని భావించారు. కానీ దీనిని రూ.1.82 లక్షలకోట్లకు పరిమితం చేశారు. బడ్జెట్ అంచనాలు వాస్తవ ఆర్థికపరిస్థితికి అనుగుణంగా ఉండాలన్న భావనతో ప్రభుత్వం భారీ లెక్కలకు పోలేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పూర్తిస్థాయి బడ్జెట్ ఉండబోతున్నది. తాత్కాలిక బడ్జెట్‌లో కూడా కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిస్థాయి బడ్జెట్‌లో స్వల్పమార్పులుంటాయని, కేంద్రం ప్రవేశపెట్టే కొత్త పథకాలు, రాష్ట్రాలకిచ్చే కేటాయింపులు, పన్నుల వాటాకు అనుగుణంగా మరికొన్ని మార్పులు జరుగుతాయని అధికారులంటున్నారు.

## మీడియా అకాడమీ కార్యదర్శిగా డీఎస్ జగన్ బాధ్యతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శిగా డీఎస్ జగన్ మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్ మీడియా అకాడమీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను జగన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడిగా పనిచేస్తున్న జగన్‌కు ప్రభుత్వం మీడియా అకాడమీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది.

# రవిప్రకాశ్ కస్టడీ అత్యవసరం

- తప్పించుకుని తిరిగేవారికి బెయిల్ ఇవ్వరాదు
- పోలీసుల తరపున వాదనలు కొనసాగించిన హరీన్‌రావల్
- బెయిల్ కోరిన రవిప్రకాశ్ లాయర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫోర్జరీ, నిధుల మళ్లింపు తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే మంగళవారానికి వాయిదావేస్తున్నట్టు హైకోర్టు ధర్మాసనం ప్రకటించింది. మంగళవారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ హరీన్ రావల్ పోలీసుల తరపున వాదనలు కొనసాగించారు. ఎలాంటి నేరాల్లో, ఎలాంటి వారికి బెయిల్ ఇవ్వరాదో తెలుపుతూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ధర్మాసనం ముందుంచారు. దర్యాప్తునకు సహకరించకుండా తప్పించుకుని తిరిగేవారు బెయిల్ ఇవ్వడానికి అనర్హులని పేర్కొన్నారు. విచారణకు హాజరుకాకుండా రవిప్రకాశ్ ఇబ్బందులకు గురిచేశారని.. ఆయన కోసం పోలీసులు పలు రాష్ట్రాల్లో గాలించాల్సి వచ్చిందన్నారు. రవిప్రకాశ్‌కు చెందిన రెండు సెల్‌ఫోన్లలో ఒకటి బెంగళూరులో ఉన్నట్టు.. మరొకటి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నట్టు చూపించాయని పేర్కొన్నారు. కంపెనీ సెక్రటరీ అగర్వాల్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని పేర్కొన్న హరీన్ రావల్.. అసలు సంతకాన్ని ధర్మాసనం ముందుంచారు. రవిప్రకాశ్ సంభాషణలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను కోర్టుకు సమర్పించారు. శివాజీ, రవిప్రకాశ్ కుమ్మక్కయ్యారనడానికి తమవద్ద ఆధారాలు ఉన్నాయని, షేర్ల మార్పిడికి సంబంధించి శివాజీ ఇచ్చిన లీగల్ నోటీసులకు రవిప్రకాశ్ ఇచ్చిన సమాధానం ఒకే న్యాయవాది ప్రిపేర్ చేశారని తెలిపారు. తప్పుడు తేదీతో షేర్ల విక్రయపత్రాలు సృష్టించారని, వీటికి సంబంధించి కంపెనీలో ఎటువంటి రికార్డులు లేవని పేర్కొన్నారు. రవిప్రకాశ్ పవర్‌ఫుల్ మీడియాపర్సన్ అని, దర్యాప్తు ముందుకు సాగాలంటే రవిప్రకాశ్ కస్టడీ అత్యవసరమని చెప్పారు.

**హవాలా ద్వారా నిధులు తరలించారు**

రవిప్రకాశ్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది దిల్జీత్‌సింగ్ అహ్లువాలియా వాదనలు వినిపిస్తూ టీవీ 9 యాజమాన్య మార్పిడిలో పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించారు. టీవీ 9 కొనుగోళ్లకు నిధులను హవాలా ద్వారా తరలించారని పేర్కొన్నారు. దీనిపై రవిప్రకాశ్ ఫిర్యాదు చేసినందునే పోలీసులు వెంటాడుతున్నారని తెలిపారు. టీవీ 9 లోగో సృష్టికర్త రవిప్రకాశ్‌యేనని, కాపీరైట్స్ చట్టం ప్రకారం ఆయనకే సర్వహక్కులు ఉంటాయని వాదించారు. 40 గంటలపాటు ప్రశ్నించిన తర్వాత ఇంకా వారికి ఎలాంటి సమాచారం కావాలని ప్రశ్నించిన అహ్లువాలియా.. అరెస్ట్ చేయడానికే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఇరుపక్షాల లాయర్ల మధ్య మూడు గంటలపాటు తీవ్రవాదోపవాదలు జరిగాయి. కేసు విచారణకు వచ్చే మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ గండికోట శ్రీదేవి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ప్రకటించింది.

**హైకోర్టులో శివాజీ క్వాష్ పిటిషన్**

ఏబీసీఎల్ కంపెనీ షేర్ల వివాదంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని నటుడు శివాజీ హైకోర్టును ఆశ్రయించారు. షేర్ల వివాదంలో సైబరాబాద్ పోలీసులు తనపై నమోదుచేశారని, దానికి సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. రూ.20 లక్షలు చెల్లించి ఏబీసీఎల్‌కు సంబంధించిన 40 వేల షేర్లను కొనుగోలు చేశానని తెలిపారు. ఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు కనీస విచారణ కూడా చేయకుండా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు.

## ప్రభుత్వ దవాఖానలను పరిశీలించిన మంత్రి ఈటల

నిలోఫర్, ఉస్మానియా, గాంధీలో అభివృద్ధి పనులపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ దవాఖానల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ నగరంలోని ప్రధాన దవాఖానలను మంగళవారం పరిశీలించారు. రోజంతా ఆయా దవాఖానలను పరిశీలించి, రోగులకు విస్తృత సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులతో చర్చించారు. మంత్రి ఈటల నిలోఫర్, ఉస్మానియా, గాంధీ దవాఖానలను సందర్శించి అన్ని విభాగాలను కలియతిరిగారు. ఆయా దవాఖానాల్లో విస్తరించాల్సిన వైద్య విభాగాలపై చర్చించారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా పడకల సామర్థ్యం పెంపు, ఆధునిక సౌకర్యాల కల్పన, భవనాల ఆధునీకరణ వంటి అంశాలపై వైద్యాధికారులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. ముందుగా నిలోఫర్ దవఖానలో చిన్నారులకు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలు, భోజన వసతి, దవఖానాలోని సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉస్మానియా దవాఖానలోని పాత భవనం, నర్సింగ్ స్కూల్, ఓపీ బ్లాక్‌ను, దోభీఘాట్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలను మంత్రి పరిశీలించారు. అనంతరం అక్కడి వైద్యాధికారులతో సమావేశమయ్యారు. మంత్రి వెంట డీఎంఈ రమేశ్‌రెడ్డి, ఉస్మానియా సూపరింటెండెంట్ నాగేందర్ ఉన్నారు. గాంధీ దవాఖానలోని వివిధ విభాగాలను మంత్రి పరిశీలించారు.


గాంధీ దవాఖానలో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

# రవిప్రకాశ్‌వి తప్పుడు ఆరోపణలు

- ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం
- టీవీ9 అమ్మకం పారదర్శకంగా పూర్తయినా అడ్డగోలు వాదనలు
- లావాదేవీల వివరాలను వెల్లడించిన టీవీ 9 కొత్త, పాత ప్రమోటర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫోర్జరీ, నిధుల మళ్లింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఈవో రవిప్రకాశ్ అరెస్టు కాకుండా ఎలాగైన ముందస్తు బెయిల్ పొందాలనే అసత్య, నిరాధారమైన ఆరోపణలను చేస్తున్నారని టీవీ 9 కొత్త, పాత యాజమాన్యాలు పేర్కొన్నాయి. విచారణ అధికారుల ఎదుట, కోర్టుల్లోనూ రవిప్రకాశ్ చేసిన ఆరోపణలకు ఆధారాల్లేవని, ఆయనపై న్యాయపరమైన చర్యలకు పూనుకుంటామని సంస్థ నూతన యాజమాన్యం అలంద మీడియా, పాత యాజమాన్యం శ్రీనిరాజు సంస్థలయిన చింతలపాటి హోల్డింగ్స్, ఐల్యాబ్స్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ ప్రకటించాయి. కోర్టులో రవిప్రకాశ్ తరపు న్యాయవాది చేసిన వాదనల ఆధారంగా మీడియాలో వచ్చిన వార్తలను ఖండించాయి. ఫోర్జరీ, చీటింగ్ కేసుల్లో విచారణను పక్కదారి పట్టించేందుకే తప్పులు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నాయి. అలంద మీడియా, శ్రీనిరాజు సంస్థల మధ్య చెల్లింపులు హవాలా మార్గంలో జరిగాయంటూ రవిప్రకాశ్ చేసిన వాదనలు అవాస్తవమని తెలపాయి. వాస్తవాలను అందరి ముందుంచేందుకు టీవీ 9 విక్రయ లావాదేవీలను ప్రకటిస్తున్నామని సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. ఆ ప్రకటన సారాంశం ఇలా ఉంది.

'2018 ఆగస్టు నాటికి చింతలపాటి హోల్డింగ్స్, ఐల్యాబ్స్, క్లిఫోర్డ్ ఫెరీరా, ఎంవీకేఎన్ మూర్తిలకు టీవీ 9 మాతృసంస్థ ఏబీసీఎల్‌లో 90.54 శాతం వాటా ఉన్నది ఈ వాటా మొత్తాన్ని 2018 ఆగస్టు 24న అలంద మీడియా కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ.414 కోట్లు. షేర్ పర్చేజ్ ఒప్పందాన్ని చట్టబద్ధంగా చేసుకుని, నిధుల బదిలీని బ్యాంకుల ద్వారానే జరిపింది. ఈ వ్యవహారంలో ఎక్కడా నగదు లావాదేవీలు జరుగలేదు. ఏబీసీఎల్‌కు అప్పటికే ఉన్న బకాయిలను చెల్లించడానికి అలంద మీడియా రూ.150 కోట్లను నేరుగా సంస్థ ఖాతాల్లోకి బదిలీ చేయగా, మిగతా రూ.264 కోట్లను పాత ప్రమోటర్లకు బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిగాయి. ఈ లావాదేవీలు పాత, కొత్త ప్రమోటర్ల రికార్డుల్లో స్పష్టంగా నమోదయ్యాయి. సంస్థ యాజమాన్య బదిలీపై కేంద్ర సమాచారం ప్రసార మంత్రిత్వశాఖకు కూడా సమాచారం ఇచ్చాం. ఈ వ్యవహారం అంతా చట్టపరిధిలోనే జరిగింది తప్ప, ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఈ బదిలీ వ్యవహారం అంతా ఆగస్టు 2018లోనే జరిగింది. ఆ సమయంలో టీవీ 9 సీఈవోగా ఉన్న రవిప్రకాశ్, షేర్ పర్చేజ్ అగ్రిమెంట్‌పై సంతకం కూడా చేశారు. 9 నెలల తర్వాత రవిప్రకాశ్ ఈ ఆరోపణల్ని చేయడం చూస్తుంటే, ఫోర్జరీ కేసుల విషయంలో తాను ఎదుర్కొంటున్న క్రిమినల్ విచారణను పక్కదారి పట్టించడానికే చేస్తున్న పని అని అర్థమవుతున్నది. సైఫ్ త్రీ మారిషస్‌తో కుదిరిన సెటిల్మెంట్ వ్యవహారంపై రవిప్రకాశ్ చేసిన ఆరోపణలు అవాస్తవం. టీవీ9 విక్రయం జరిగే సమయానికి హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సైఫ్ త్రీ కంపెనీ వేసిన ఓ కేసు పెండింగ్‌లో ఉన్నది. ఐ విజన్‌లో ఉన్న వాటాల విషయంలో సైఫ్ త్రీ ఈ కేసు వేసింది. అయితే, అది సెటిల్మెంట్ అగ్రిమెంట్ ద్వారా పరిష్కారమైంది. ఆర్బీఐ నియమ నిబంధనలకు లోబడి బ్యాంకుల ద్వారానే చెల్లింపు జరిగింది. నిధులను స్వీకరించిన తర్వాత సైఫ్ త్రీ కేసును ఉపసంహరించుకోవడానికి ఎన్‌సీఎల్‌టీ అనుమతి కూడా ఇచ్చింది. తమ పరువుకు భంగం కలిగించేలా అసత్యమైన, అవాస్తవమైన ఆరోపణలను రవిప్రకాశ్ చేసినందుకు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.'

## నైరుతి రాక మరింత ఆలస్యం

మొదటిపేజీ తరువాయి...

పయనిస్తున్నదని తెలిపింది. ఈ కారణంగా మిగతా ప్రాంతాల్లో ఉన్న తేమను తుఫాన్ మింగేయడంతో పొడివాతావరణం ఏర్పడుతుందని, తేమ తగ్గిపోవడంతో మేఘాలు మందగమనంలో కదులుతాయని అధికారులు వివరించారు. కాగా, ప్రతిఏటా జూన్ 15వ తేదీలోపే నైరుతి రుతుపవనాలు తెలంగాణలో విస్తరిస్తుండగా.. గతేడాది జూన్ 8వ తేదీనే రాష్ట్రాన్ని తాకాయి. 2014, 16లలో మాత్రం చాలా ఆలస్యంగా జూన్ 19, 20వ తేదీల్లో రాష్ట్రాన్ని తాకాయి.

**మళ్లీ తారెత్తిన ఎండలు**

రాష్ట్రంలో మంగళవారం మళ్లీ ఎండలు తారెత్తాయి. గాలిలో తేమలేక ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మంగళవారం వడదెబ్బతో రాష్ట్రంలో ఐదుగురు మృతిచెందారు. ఖమ్మం జిల్లాలో ఇద్దరు, పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణిచారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. భద్రాచలంలో 41.2, హన్మకొండలో 41.5, హైదరాబాద్‌లో 38.4, మహబూబ్‌నగర్‌లో 38.9 మెదక్ లో 42.2, నల్లగొండలో 40.4, నిజామాబాద్‌లో 41.9 రామగుండంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు. దీనిప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశముందన్నారు. రాగల మూడురోజులలో ఉత్తర తెలంగాణ, తూర్పు తెలంగాణ ప్రాంతాలలో వడగాల్పులు వీస్తాయని పేర్కొన్నారు.



## 21.22 లక్షల ఖాతాల్లోకి 2,233 కోట్లు జమ

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా జరిగిన జాప్యంతో రైతులు నష్టపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్బీఐ ఈ కుబేర్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతుబంధు డబ్బులు జమ అవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు విడుతలుగా మొత్తం 21.22 లక్షల మంది ఖాతాల్లో రూ.2,233.16 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. రైతుబంధు అకౌంట్ నంబర్ మార్చుకోవాలనుకునేవారు సమీప వ్యవసాయ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

**ధాన్యం కొనుగోలు బకాయిలు త్వరలో చెల్లింపు**

సహకార సంఘాలు, మహిళాసంఘాలు, వ్యవసాయ మార్కెట్ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 3,85, 217 మంది రైతులకు రూ.4,837 కోట్లు చెల్లించామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. రూ.1,080 కోట్లు బకాయిలు ఉన్నాయని.. వాటిలో మంగళవారం రూ.501 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. మిగిలిన బకాయిలను కూడాత్వరలో విడుదల చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి సూచించారు. మరికొద్దిరోజులలో రాష్ట్రానికి రుతుపవనాలు రానున్న నేపథ్యంలో రైతుబంధు డబ్బులు త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.



ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం జర్నలిస్టులను అరెస్టు చేయటం రాజ్యాంగ నిర్మాణాలను ధ్వంసం చేయటమే. అధికారంలో ఉన్నవారు పత్రికలు, మీడియా తమ గొంతునే వినిపించాలని ఒత్తిడి చేయటమే కాదు, ఇప్పుడు వారి స్వేచ్ఛను కూడా హరించి వేస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మేం ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన పత్రికాస్వేచ్ఛకు అండగా నిలుస్తాం.

**అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ ముఖ్యమంత్రి**

ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఉన్న మతోన్మాదమనే రోగాన్ని, బుజ్జగింపు రాజకీయాలను సమూలంగా నిర్మూలించటం కోసం కృషిచేస్తున్నారు. సమ్మిళిత సమగ్రాభివృద్ధికోసం ఆరోగ్యకర రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మోదీ ప్రభుత్వం దేశ సమగ్రత, అందరికీ సమన్యాయం కోసం పాలనాధికారాన్ని సద్వినియోగం చేస్తున్నది.

**ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ, కేంద్రమంత్రి**



**చరిత్రలో నేడు**





1714

ప్రష్యా-రష్యాల మధ్య రహస్య ఒప్పందం.

1776



హక్కుల ప్రకటనకు వర్జీనియా ఆమోదం.



1964

నెల్సన్‌మండేలాకు జీవిత ఖైదు విధించిన దక్షిణాఫ్రికా ప్రభుత్వం.

అమెరికా చైనా వాణిజ్య యుద్ధంలో ప్రతిష్టంభన నెలకొన్నది. పరిష్కారం కోసం రాజకీయ చొరవ కనిపించడం లేదు. చైనా అభివృద్ధి నమూనా తమకు ప్రమాదకరమని అమెరికా అంటున్నది. అమెరికా శ్రేష్ఠవర్గం తమ దేశ అభివృద్ధిని ఆమోదించలేకపోతున్నదని చైనా ప్రజలు భావిస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో సాగుతున్న ఆర్థిక సమీకృత పోకడ ప్రచ్ఛన్న యుద్ధానికి భిన్నమైనది. ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. పరిస్థితి దిగజారితే అమెరికా చైనాలకు రెండింటికీ నష్టదాయకమే. అమెరికా చైనాను అణిచివేయాలనుకుంటే, చైనా తదనుగుణంగా స్పందిస్తుంది.

**గ్లోబల్ టైమ్స్**

వీసా దరఖాస్తులను రహస్య అల్గోరిథమ్స్ ద్వారా వర్గీకరించడం థెరిసా మే హోం కార్యదర్శిగా అవలంబించిన విధానాల ఫలితం. ఇమిగ్రేషన్ విధానం నిష్పక్షపాతంగా ఉండాలని కోరుకోవచ్చు. కానీ మిషిన్ లర్నింగ్ అల్గోరిథమ్స్ వల్ల సమస్యలు కూడా ఉంటాయి. టెక్నాలజీ మంచిది కాదని, వాడుకోవద్దని కాదు. కానీ సాఫ్ట్‌వేర్ వ్యవస్థ చక్కగా ఉంటే మానవుల కన్నా చక్కగా పని సాగిస్తుంది. లేకపోతే చిన్న తప్పు అతివేగంగా పెద్దగా మారుతుంది. పక్షపాతం వైఖరి కూడా అమలవుతుంది, కానీ తప్పు ఎక్కడ జరిగిందో దొరుకదు.

**ది గార్డియన్**



# కరువా దోషులకు శిక్ష

దేశం యావత్తూ సిగ్గుతో తలదించుకునే రీతిలో జరిగిన అమానుషత్వానికి ఏడాదిన్నర కాలంలోనే తగిన శిక్షపడింది. జమ్ముకశ్మీర్‌లోని కరువాలో ఎనిమిదేండ్ల పసిబాలిక అసిఫాపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో ముద్దాయిలు ఏడుగురిలో ఆరుగురిని పంజాబ్‌లోని పాటియాలా ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా తేల్చింది. అందులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించగా మరో ముగ్గురికి సాక్ష్యాధారాలను నాశనం చేయటానికి ప్రయత్నించినందుకు ఐదేండ్ల శిక్షతో పాటు యాభై వేల రూపాయల జరిమానా విధించింది. ప్రధాన నిందితుడు సాంజిరాం కుమారుడిని సాక్ష్యాధారాలు లేనందున నిర్దోషిగా విడుదల చేసింది. గతేడాది జనవరిలో కరువాలో ముస్లిం మతవర్గం సంచార తెగకు చెందిన ఎనిమిదేండ్ల బాలిక అసిఫాపై జరిగిన దారుణం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. అడవిలో మేతకు వెళ్లిన గుర్రాలను చూపిస్తామంటూ నమ్మబలికి అమాయక బాలికను కిడ్నాప్ చేసి సమీపంలోని ఓ ప్రార్థనా మందిరంలో బంధించి సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారు. ఓ క్షణికావేశ దుర్ఘటనగా కాకుండా నిందితులు అత్యంత అమానవీయంగా ఆ పసిబాలికకు నాలుగురోజులు మత్తు మందు ఇచ్చి మరీ లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత విషయం బయటకు పొక్కకుండా ఉండటం కోసం సాక్ష్యాధారాలను నాశనం చేసేందుకు తలపై బండరాయితో కొట్టి హత్యచేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగికదాడుల్లో కరువా ఘటన అత్యంత అమానుషమైనదిగానే గాకుండా అనేక విధాలుగా దేశంలోనే అరుదైన దుర్ఘటనగా నిలువటం గమనార్హం.

కరువా ఘటన నేపథ్యంలో దేశంలో ముఖ్యంగా జమ్మూలో జరిగిన ఆందోళనలు, వాదవివాదాలు మరింత అందోళనకరమైనవి. ఓ నేరానికి మత రంగు పులిమి దోషులకు మద్దతుగా నిలువటం సమాజ విచ్ఛిన్నానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. కశ్మీర్‌లో ఎంతమంది మహిళలపై దాడులు జరుగటం లేదు, ఓ బాలికపై జరిగిన దాడికి ఇంత ప్రాధాన్యం ఎందుకనే వాదనలు వినిపించటం జుగుప్సాకరం. ఒకానొక దశలో పోలీసులు కేసు నమోదు చేసుకోవటానికి కూడా నిరాకరించారు. ఇక నిందితులను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ హిందూ ఏక్తా మంచ్, కరువా బార్ అసోసియేషన్ లాంటి సంస్థలు జాతీయ జెండాలు పట్టి ప్రదర్శనలు చేశాయి. నిందితులకు మద్దతుగా జరిగుతున్న ప్రదర్శనల్లో అప్పటి పీడీపీ–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలోని బీజేపీ మంత్రులు కూడా పాల్గొన్నారు. నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయటానికి వచ్చిన అధికారులను కరువా బార్ అసోసియేషన్ అడ్డుకున్నది. దీంతో బాధితులు తమకు అక్కడ న్యాయం జరుగదని కేసును మరోచోటుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లటంతో కేసు పంజాబ్‌లోని పాటియాలా కోర్టుకు బదిలీ అయ్యింది. మరోవైపు అసిఫా కేసులో బాధితులకు న్యాయం జరుగాలని, నిందితులు శిక్షింపబడాలని మహిళా న్యాయవాది దీపికాసింగ్ రజావత్ అలుపెరుగని పోరాటం చేశారు. ఆ క్రమంలో దీపికాసింగ్ ఎదుర్కొన్న సమస్యలు మరింత దిగ్భ్రాంతి కలిగించేవిగా ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌నుంచి మిలిటెంట్ల దురాగతాలతో ఢిల్లీకి వలస వచ్చిన కశ్మీరీ పండిట్ కుటుంబానికి చెందిన మహిళగా దిపికాసింగ్ ముస్లిం బాలిక పక్షాన నిలువటాన్ని ఇరుగుపొరుగు వారు తీవ్రంగా తప్పుబట్టారు. రక్త సంబంధీకులు, ఇరుగుపొరుగు సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. చివరికి కోర్టులోని సహ న్యాయవాదులు కూడా మాట్లాడటం మానేశారు. దేశద్రోహి ముద్ర కూడా వేసి సూటిపోటి మాటలతో, ఈసడింపులతో కాకుల్లా పొడుచుకుతిన్నారు.

> **కరువా ఘటన తీరు మాత్రమే కాదు, ఘటన వెనుక ఉన్న సామాజిక మూలాలు మరింత భీతిగొలిపేవిగా ఉన్నాయి. ముక్కుపచ్చలారని ఎనిమిదేండ్ల అమ్మాయిపై నడివయస్కులైన వారితో సహా లైంగికదాడికి ఒడిగట్టడం వెనుక లైంగికాంశం ఎంతమాత్రం కాదు. గుర్రాలు, గొర్రెలు మేపుకొని బతికే నిస్సహాయ సంచార జాతికి చెందిన ముస్లిం సమూహాలను భయభ్రాంతులకు గురిచేసి ఆ ప్రాంతం నుంచి వారిని పారదోలటానికి నిందితులు ఎంచుకున్న కపట మార్గం అది.**

కరువా ఘటన తీరు మాత్రమే కాదు, ఘటన వెనుక ఉన్న సామాజిక మూలాలు మరింత భీతిగొలిపేవిగా ఉన్నాయి. ముక్కుపచ్చలారని ఎనిమిదేండ్ల అమ్మాయిపై నడివయస్కులైన వారితో సహా లైంగికదాడికి ఒడిగట్టడం వెనుక లైంగికాంశం ఎంతమాత్రం కాదు. గుర్రాలు, గొర్రెలు మేపుకొని బతికే నిస్సహాయ సంచార జాతికి చెందిన ముస్లిం సమూహాలను భయభ్రాంతులకు గురిచేసి ఆ ప్రాంతం నుంచి వారిని పారదోలటానికి నిందితులు ఎంచుకున్న కపట మార్గం అది. తద్వారా వారు ఆ ప్రాంతంలోని పచ్చికబయళ్ళను, వారి నివాస ప్రాంతాలను ఆక్రమించుకోవచ్చున్నది వారి పన్నాగం. ఆ నేపథ్యంలోంచే హిందూ జాగరణ్ మంచ్ లాంటి సంస్థలు లేవదీసిన వాదనలు అంతటి అమానవీయంగా, వివాదాస్పదంగా ఉన్నాయి. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి తేజ్వీందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హమైనవి. నిందితులు ఇదొక అటవిక రాజ్యంగా తలచి ఇష్టానుసారంగా వ్యవహరించారని తీవ్రంగా గర్హించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పఠాన్‌కోట్ అమానవీయ ఘటన జమ్ముకశ్మీర్‌లోని సామాజిక సమూహాల విచ్ఛిన్నతకు పరాకాష్టగా భావించాలి. అంతేగాకుండా నేరాన్ని రాజకీయం చేయటమే కాకుండా, దానికి మతరంగు పులమటం గర్హనీయం. ఈ ఘటనను మానవీయంగా కాకుండా మత మాయతెరలతో చూడటం మరింత విషాదం. ఈ క్రమంలో న్యాయవాదులు కూడా బాధితుల పక్షాన నిలువకుండా నిందితుల పక్షాన నిలిచి ఊరేగింపులు తీయటం న్యాయవ్యవస్థ పని తీరును ప్రశ్నార్థకం చేసింది. ఏదేమైనా సామాజిక ఒత్తిళ్లు, పర్యవసానాల నేపథ్యంలో ఏడాదిన్న కాలంలోనే కోర్టు తీర్పు వెలువరించడం, దోషులకు కఠిన శిక్షలు విధించటం బాధిత కుటుంబానికి ఊరటనిచ్చేదిగా ఉన్నది.

**జనగళం**

## కైవసం చేసుకోవాలె

ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ఓపెనర్ శిఖర్ ధావన్ చేతికి గాయం కావడం బాధాకరం. దావన్ ఇప్పటికే సిరీస్‌లో ఒక సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అయితే దావన్‌కు విశ్రాంతి, ఆయన మూడు నాలుగు మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోవడం లోటే. అయినప్పటికీ భారత జట్టు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. వరుస విజయాలతో ఊపుమీదున్న భారత్‌కు ముందున్నది కఠిన పరీక్ష. న్యూజిలాండ్, పాక్, శ్రీలంక, వెస్టిండీస్ లాంటి పటిష్ట జట్లతో పోటీ పడనున్నది. కాబట్టి సరైన వ్యూహంతో ముందుకుపోవాలి. అయితే ధావన్ లోటును ఎవరు భర్తీ చేస్తారనే విషయం పక్కనపెడితే ప్రపంచకప్‌ను మరోసారి ఇండియా కైవసం చేసుకోవాలనేది ప్రతి భారతీయుని కోరిక.

**- పుల్కం సంపత్, రాములపల్లె, జగిత్యాల**

## సంక్షేమం కోసం కృషిచేయాలె

మధ్యంతర భృతి కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇన్నిరోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించడానికి ప్రభుత్వానికి ఇన్నిరోజులు ఎన్నికల కోడ్ అడ్డువచ్చింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ ముగిసింది. కాబట్టి ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషిచేయాలి.

**- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్**


## అప్రమత్తత అవసరం

రెండు మూడు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించింది. కాబట్టి కొన్నిరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వానలు కురిసే అవకాశం ఉన్నది. కాబట్టి నగరాల్లోని మ్యాన్‌హోల్స్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. గతానుభవాలను పరిశీలిస్తే మ్యాన్‌హోల్స్‌లో పడిన రెండు మూడు ఘటనలు చోటుచేసుకున్న దాఖలాలున్నాయి. కాబట్టి మ్యాన్‌హోల్స్‌ను మూసేయాలి.

**- కొత్వాల్ ప్రవీణ్, బేగంపేట్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

# హూవర్ డ్యాం తెచ్చిన మార్పు

**హూవర్ డ్యాం ఎత్తు 726 అడుగులు, పొడవు 1,2 44 అడుగులు, డ్యాం అడుగున వెడల్పు 660 అడుగులు, పైన వెడల్పు 45 అడుగులు. 1931లో డ్యాం నిర్మాణం ప్రారంభమయ్యే నాటికి కొలరాడో ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన హెర్బర్ట్ హూవర్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఆయన ప్రోత్సాహంతో డ్యాం నిర్మాణం 1935లో పూర్తయ్యింది. రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసి డ్యామును అనుకున్న సమయానికన్నా రెండేండ్ల ముందుగానే పూర్తిచేయగలిగారు.**

సాగునీటి శాఖలో ఇంజినీర్‌గా ప్రపంచంలో గొప్ప సివిల్ ఇంజినీరింగ్ నిర్మాణాలుగా పేరు గడించిన మూడు డ్యాములు చూడాలని కోరిక చాలాకాలంగా నాలో ఉన్నది. ఒకటి ఈజిప్టులో నైలు నదిపై నిర్మించిన అస్వాన్ డ్యాం, రెండోది అమెరికాలో కొలరాడో నదిపై నిర్మించిన హూవర్ డ్యాం, మూడోది చైనాలో యాంగ్జి నదిపై నిర్మించిన త్రీ గార్జెస్ డ్యాం. మొదటి రెండు డ్యాముల గురించి 1981–84 మధ్య హైదరాబాద్‌లో ముఫ్ఖంఝా ఇంజినీరింగ్ కాలేజీలో చదువుకునే కాలంలోనే విన్నాను. త్రీగార్జేస్ డ్యాం గురించి మాత్రం 1990వ దశకంలో సాగునీటి శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా చేరిన తర్వాత విన్నాను. అది దేశంలో పెద్ద డ్యాములకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్న కాలం. మధ్యప్రదేశ్‌లో నర్మదా నదిపై తలపెట్టిన ఇందిరాసాగర్, సర్దార్ సరోవర్ డ్యాం, ఉత్తరప్రదేశ్‌లో భాగీరథి నదిపై తలపెట్టిన తెహ్రీ జల విద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉధృతంగా ప్రచారం జరుగుతున్న కాలం. పెద్ద డ్యాముల వల్ల పర్యావరణానికి, అటవీ సంపదకు వాటిల్లే నష్టాల గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న కాలం. పర్యావరణవాదులు పెద్ద డ్యాములకు ప్రత్యామ్నాయంగా చిన్న వాటర్‌షెడ్స్, చెరువులు, కాంటూర్ బండ్స్, చెక్ డ్యాములను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తున్నారు. ఆ చర్చలలో ప్రముఖ ఇంజినీర్, ఐరాసకు సలహాదారుగా ఉన్న కీ.శే.టి.హనుమంతరావు కూడా పాల్గొన్నారు. పెద్ద డ్యాముల ఆవశ్యకతను నొక్కిచెపుతూ అనేక వ్యాసాలు రాశారు. చిన్న నీటి పథకాలు పెద్ద డ్యాములకు ప్రత్యామ్నాయం కాజాలవని వాదిస్తూ, 1986లో దేశంలో సంభవించిన కరువును ఎదుర్కొని దేశంలో ఆహార సంక్షోభాన్ని నివారించినవి భాక్రానంగల్, దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు లాంటి పెద్ద డ్యాములేనని గణాంకాలతో వివరించారు. ఈ చర్చ చేస్తున్న సందర్భంగా ఈజిప్టులో నైలు నదిపై నిర్మించిన అస్వాన్ డ్యాం ఈజిప్ట్ ఆర్థిక ప్రగతికి ఎట్లా దోహదం చేసింది, ఆఫ్రికా ఖండమంతా కరువు కోరల్లో చిక్కుకొని ప్రజలు ఆకలిచావులకు బలవుతుంటే ఈజిప్ట్ దేశాన్ని కరువు నుంచి, వరదల నుంచి కాపాడింది అస్వాం డ్యామేనని వివరించారు. ఆ కాలంలో చైనాలో నిర్మాణమవుతున్న త్రీగార్జేస్ డ్యాం కూడా చైనా ఆర్థిక ప్రగతికి దోహదం చేయనున్నదని జోస్యం చెప్పారు.

2018 ఏప్రిల్‌లో త్రీ గార్జెస్ డ్యామును సందర్శించే అవకాశం వచ్చింది. ఇప్పుడు వ్యక్తిగత సెలవుపై అమెరికా వచ్చిన తర్వాత హూవర్ డ్యామును జూన్ 8న సందర్శించాను. కొలరాడో నది ఉత్తర అమెరికా ఖండం నైరుతి ప్రాంతంలోప్రవహించే పెద్ద నదుల్లో ఒకటి. హూవర్ డ్యామును నిర్మించకముందు కొలరాడో బేసిన్‌లోని దిగువ రాష్ట్రాలైన కాలిఫోర్నియా, అరిజోనా, నెవెడా రాష్ట్రాలు వరదలతో అతలాకుతలమయ్యేవి. 1905లో కొలరాడో నదికి వచ్చిన వరదల్లో కాలిఫోర్నియా రాష్ట్రంలో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వరద నష్టాల నుంచి రైతులను కాపాడటానికి, పునరావాసానికి అమెరికా ప్రభుత్వం 10 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టవలసి వచ్చిందని రికార్డులు చెబుతున్నాయి.

ప్రభుత్వం కొలరాడో నది నుంచి వృథాగా సముద్రానికి తరలిపోతున్ననీటిని నిల్వ చేసుకొని వరదలను నియంత్రించడమే కాకుండా వ్యవసాయాభివృద్ధికి వినియోగించాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. మొదటగా కొలరాడో నదిపై కొన్ని చిన్న డ్యాముల నిర్మాణం జరిగింది. 1920 నాటికి నదిలో లభ్యమయ్యే జలరాశిని నిల్వ చేయగలిగే ఒక పెద్ద జలాశయాన్ని నిర్మిస్తే తప్ప ఆశించిన ప్రయోజనాలు నెరవేరయని కాలిఫోర్నియా, నెవెడా, అరిజోనా రాష్ట్రాల ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తాయి. దక్షిణ కాలిఫోర్నియా రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న లాస్ ఏంజిల్స్, నెవెడా రాష్ట్రంలో లాస్‌వేగస్, ఆరిజోన రాష్ట్రంలో ఫీనిక్స్ నగరాలు, ఇతర పట్టణాల్లో గృహ, పారిశ్రామిక విద్యుత్ అవసరాలను తీర్చడానికి కూడా పెద్ద డ్యాం అవసరమనే భావన బలపడింది. అయితే డ్యాం నిర్మాణం జరిగితే కాలిఫోర్నియా రాష్ట్రం అధికంగా ప్రయోజనాలను పొందనున్నదన్న అనుమానం బేసిన్‌లో ఉన్న ఇతర రాష్ట్రాలు వ్యక్తం చేశాయి. దీంతో అమెరికా ఫెడరల్ ప్రభుత్వం పురమాయింపుతో వాణిజ్య కార్యదర్శిగా ఉన్న హెర్బర్ట్ హూవర్ నేతృత్వంలో కొలరాడో రివర్ బేసిన్లో ఉన్న ఏడు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల చర్చలు మొదలయ్యాయి. 1922లో రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. డ్యాం నిర్మాణానికి నాలుగు లక్ష్యాలను చట్టంలో పేర్కొన్నారు. 1.వరద నియంత్రణ 2.వ్యవసాయానికి, గృహ, పారిశ్రామిక అవసరాలకు నీటి వినియోగం 3.విద్యుత్ ఉత్పత్తి 4.దేశీయ జల రవాణా అభివృద్ధి.

అమెరికా బ్యూరో ఆఫ్ రిక్లమేషన్ ఇంజినీర్లకు గతంలో డ్యాముల నిర్మాణంలో అనుభవం ఉన్నప్పటికీ ఈ స్థాయిలో డ్యాం నిర్మాణానికి పూనుకోవడం ఇదే మొదటిసారి. ఆ నాటికి బౌల్డర్ కాన్యాన్ డ్యాం ప్రపంచలోనే అతి ఎత్తయిన డ్యాం. ఈ డ్యాం వల్ల ఏర్పడే జలాశయం ప్రపంచంలో అతిపెద్దది. పెద్ద డ్యాముల నిర్మాణం సందర్భంగా వచ్చే ప్రశ్నలు, సవాళ్లు బౌల్డర్ డ్యాం మీద కూడా వచ్చాయి. అన్ని సవాళ్లను అధిగమించి బ్యూరో ఇంజినీర్లు తమ మేధస్సును ధారపోసి డ్యాం డిజైన్లను రూపొందించారు. హూవర్ డ్యాం ఎత్తు 726 అడుగులు, పొడవు 1,2 44 అడుగులు, డ్యాం అడుగున వెడల్పు 660 అడుగులు, పైన వెడల్పు 45 అడుగులు. 1931లో డ్యాం నిర్మాణం ప్రారంభమయ్యే నాటికి కొలరాడో ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన హెర్బర్ట్ హూవర్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఆయన ప్రోత్సాహంతో డ్యాం నిర్మాణం 1935లో పూర్తయ్యింది. రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసి డ్యామును అనుకున్న సమయానికన్నా రెండేండ్ల ముందుగానే పూర్తిచేయగలిగారు.

డ్యాంలో ఏర్పాటుచేసిన ఒక్కొక్క స్పిల్ వే నుంచి నీటిని వదిలితే నయాగారా జలపాతం నుంచి పారే నీటి పరిమాణంతో సమానం. డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత అది తన లక్ష్యాలను నెరవేర్చడంలో సఫలమైందని పరిశోధకులు విశ్లేషించారు. అరిజోన, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో తరచుగా సంభవించే వరదల పీడ పోయింది. ఎడారి ప్రాంతాలైన ఆరిజోనా, నెవెడా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నది. ఆరిజొనా రాష్ట్రంలో ఫీనిక్స్, నెవెడా రాష్ట్రంలో లాస్ వేగాస్, కాలిఫోర్నియా రాష్ట్రంలో ఏంజిల్స్ వంటి నగరాలు, అనేక పట్టణాల తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందిస్తున్నది. విద్యుత్‌ను అందిస్తున్నది. హూవర్ డ్యాం నిర్మాణం తర్వాతనే ఎడారి ప్రాంతంలో ఉన్న లాస్‌వేగస్ నగరం ఇవ్వాళ ప్రపంచ పర్యాటక స్థలంగా అభివృద్ధి చెందింది.

ఈ డ్యాం నిర్మాణం ద్వారా వచ్చిన అనుభవంతో అమెరికాలో అన్ని ప్రధాన నదులపై అనేక డ్యాముల నిర్మాణం చేపట్టారు. 1942లో కొలంబియా నదిపై గ్రాండ్ కూలీ డ్యాం నిర్మాణం పూర్తయింది. 1940–80 మధ్యకాలంలో కొనసాగిన వందలాది డ్యాముల నిర్మాణంతో 1940 తర్వాత అమెరికాలో వ్యవసాయ విస్తరణ వేగంగా కొనసాగింది. అమెరికాలో వ్యవసాభివృద్ధిని అంచనా వేయడానికి హూవర్ డ్యాముకు ముందు, తర్వాత అన్న అంశం విశ్లేషకులకు ప్రామాణికంగా మారింది. 1940కి ముందు అమెరికాలో డ్యాముల మొత్తం నీటి నిల్వ సామర్థ్యం చాలా తక్కువ. అది 1978 నాటికి 1742 టీఎంసీలకు పెరిగింది. 1940 తర్వాత దేశవ్యాప్తంగా బ్యూరో నిర్మించిన డ్యాముల వల్ల సాగునీరు అందుబాటులోకి వచ్చింది. దీనిఫలితంగా సాగునీరు అందే ఆయకట్టు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 1940 తర్వాత అమెరికా ఫెడరల్ ప్రభుత్వం కల్పించిన వసతుల కారణంగా సాగు విస్తీర్ణం, వ్యవసాయోత్పత్తుల విలువ గణనీయంగా పెరిగిందని పరిశోధకులు విశ్లేషించారు. ఇవికాకుండా హూవర్ డ్యాం రూపకర్తలు ఊహించని విధంగా పర్యాటకం ద్వారా ఏటా మిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుతున్నది.

> **ఈజిప్ట్‌లో అస్వాన్ డ్యాం (అబ్దుల్ నాజర్) అయినా, చైనాలో త్రీ గార్జెస్ డ్యాం (లీపెంగ్) అయినా, అమెరికాలో హూవర్ డ్యాం (హెర్బర్ట్ హూవర్) అయినా ఆయా దేశాల పాలకుల రాజకీయ సంకల్ప బలంతోనే సాధ్యమైనాయి. అన్ని అడ్డంకులను, సవాళ్లను ఎదుర్కొని, నిధులు సమకూర్చి ప్రాజెక్టులను పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ సంకల్ప బలంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ మూడేండ్లలోనే నీటిని ఎత్తిపోయడానికి సిద్ధవుతున్నది. నిస్సందేహంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ కూడా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి అదేరకంగా దోహదం చేయనున్నది. 80,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చబోతున్నది.**

ఈజిప్ట్‌లో అస్వాన్ డ్యాం (అబ్దుల్ నాజర్) అయినా, చైనాలో త్రీ గార్జెస్ డ్యాం (లీపెంగ్) అయినా, అమెరికాలో హూవర్ డ్యాం (హెర్బర్ట్ హూవర్) అయినా ఆయా దేశాల పాలకుల రాజకీయ సంకల్ప బలంతోనే సాధ్యమైనాయి. అన్ని అడ్డంకులను, సవాళ్లను ఎదుర్కొని, నిధులు సమకూర్చి ప్రాజెక్టులను పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ సంకల్ప బలంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ మూడేండ్లలోనే నీటిని ఎత్తిపోయడానికి సిద్ధవుతున్నది. నిస్సందేహంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ కూడా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి అదేరకంగా దోహదం చేయనున్నది. 80,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చబోతున్నది. 40 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు, హైదరాబాద్ నగరానికి తాగు నీరు, పరిశ్రమలకు నీరందుతుంది. జలాశయాల్లో, చెరువుల్లో సుమారు 500 టీఎంసీల నీటి నిల్వ సాధ్యమవుతుంది. 150 కి.మీ. పొడవున గోదావరి నది సజీవం కాబోతున్నది. మంచినీటి చేపలు, రొయ్యల ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నది. దేశీయ జల రవాణా అభివృద్ధి కానున్నది. ప్రాజెక్ట్ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, టెంపుల్ టూరిజం ద్వారా రాష్ట్రానికి అదనపు ఆదాయం సమకూరనున్నది. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగనున్నవి. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రగతిరథంగా మారనున్నది.

**(వ్యాసకర్త: ఓఎస్డీ టు సీఎం, అమెరికా నుంచి..)**

# సంస్కరిస్తేనే కాంగ్రెస్‌కు మనుగడ

జాతీయం

**సుధా పాయి**

కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా విఫలం కావడం, రాహుల్‌గాంధీ స్వయంగా అమేథీలో ఓడిపోవడం వల్ల సంక్షోభంలో పడిపోయింది. పార్టీ నాయకత్వం నుంచి వైదొలుగుతానని రాహుల్ ప్రకటించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఇతర పెద్దలు ఆయన వైదొలుగడానికి అంగీకరించడం లేదు. దీంతో స్తంభన ఏర్పడి మరింత అయోమయం నెలకొన్నది. బీజేపీతో సహా అన్ని పార్టీలలోనూ కుటుంబ రాజకీయాలున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీది మాత్రం కుటుంబ వ్యాపార సంస్థ మాదిరిగా గుర్తింపు పొందింది. ఐదవతరం నాయకత్వం పార్టీని నియంత్రిస్తున్నది. ఈ అంశాన్ని బీజేపీ ప్రభావవంతంగా ఉపయోగించుకున్నది. దేశ చరిత్ర, నెహ్రూ కుటుంబ పాత్ర గురించి తెలువని యువతరం బీజేపీ ప్రచారంతో ప్రభావితమైంది. నెహ్రూ కుటుంబసభ్యులు నాయకులుగా లేకుండా కాంగ్రెస్ పార్టీ మనగలదా అనేదే ఇప్పుడు వేధిస్తున్న సమస్య. పార్టీనంతా కలిసికట్టుగా నిలిపే శక్తి నెహ్రూ కుటుంబానికి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఒక స్పష్టమైన సిద్ధాంతం, కార్యాచరణతో ప్రజల ముందుకు వెళ్ళలేక పోయిందనేది ఇప్పటికే చాలా చెప్పడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవాలంటే, సంస్థాగతంగా సంస్కరించుకొని తనకుతాను కొత్తరూపు సంతరించుకోవలసి ఉన్నది. కుటుంబ సంస్థగా కాకుండా, నెహ్రూ కుటుంబంతో నిమిత్తం లేని ప్రజాస్వామిక పార్టీగా రూపాంతరం చెందవలసి ఉన్నది. ఈ మార్పు ఎప్పుడో జరుగవలసింది. ఇందిరా గాంధీ హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులు రావలిసింది. పార్టీలో కింది అంచెల వరకు అధికార వికేంద్రీకరణ జరుగవలసింది. కానీ నెహ్రూ కుటుంబ సభ్యుడి ఆధిపత్యంలో ఉండే ఏర్పాటుజరిగింది. రాజీవ్‌గాంధీ మార్పులు చేయడానికి ఎప్పుడూ సిద్ధపడలేదు. 1990 దశకంలో నెహ్రూ కుటుంబానికి చెందని ఇద్దరు నాయకులు– పీవీ, సీతారాం కేసరి– పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు. 1998 లో సోనియాగాంధీ ఆసక్తి చూపడంతో మళ్ళా కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబం నాయకత్వంలోకి వెళ్ళింది. కనీసం ఈ దశలోనైనా ఆ ఒక్క కుటుంబంపై ఆధారపడకుండా, సమిష్టి నాయకత్వాన్ని నెలకొల్పి, దేశావ్యాప్తంగా రాష్ట్రాలలో పార్టీ యంత్రాంగాన్ని పటిష్టపరుచాల్సింది. అదే జరిగితే, ఇవాళ హిందు మెజారిటీవాదం దాడికి విలవిలలాడేది కాదు.

ఇప్పటికైనా కాంగ్రెస్ కుటుంబ సంస్థగా కాకుండా ప్రజాస్వామిక పార్టీగా మారవచ్చు. కార్యనిర్వాహక సంస్థ అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కుటుంబసభ్యులతో పాటు సీనియర్ నాయకులు అధికారాలు కలిగి ఉండాలె. దీంతో నెహ్రూ కుటుంబం పార్టీని ఆడించడం అనేది ఉండదు. ఒకవైపు కుటుంబ ప్రభావం ఉన్నప్పటికీ మరోవైపు సమిష్టి నాయకత్వం కూడా ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం పటిష్టమవుతుంది. కుటుంబ పెత్తనం, భజన రాజకీయాలు నశిస్తాయి. ఎన్నికలలో గెలువలేని, పార్టీలో గౌరవం లేని పాత నాయకులను సీడబ్ల్యూసీ నుంచి తొలగించాలె. సీడబ్ల్యూసీకి ఒక్కో దశలో అధికారం మారుతూ వచ్చింది. నెహ్రూ హయాంలో బలమైన నాయకులు ఉండి, ప్రజాస్వామిక సంస్కృతి కలిగి ఉన్నది. సీడబ్ల్యూసీ సభ్యులు నెహ్రూ సూచనలతో విభేదించే వారు కూడా. 1967 తర్వాత కాంగ్రెస్ పార్టీలో చీలిక వచ్చింది. 1971లో ఇందిరా గాంధీ ఘన విజయంతో పార్టీలో కేంద్రీకరణ పెరిగిపోయింది. పీసీసీలు, ఏఐసీసీలు బలహీనపడ్డాయి. అధిష్ఠానం చెప్పిందే శాసనమైపోయింది. ఈ పరిస్థితి మారాలె.

> **బీజేపీ చేతిలో వరుస పరాజయాల నుంచి బయటపడాలంటే, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా సంస్కరించుకోవలసిన అవసరం ఉన్నది. రాహుల్‌గాంధీ నిష్క్రమించవచ్చు, లేదా పార్టీని ప్రజాస్వామిక సంస్థగా తీర్చిదిద్దనూ వచ్చు. పార్టీకి శస్త్ర చికిత్స చేయడం బాధతో కూడుకున్నదే. కానీ కాంగ్రెస్ పార్టీని సంస్కరించకపోతే, మనుగడ సాగించలేదు. అది దేశానికి ఎంతో నష్టదాయకం.**

కాంగ్రెస్ పార్టీలో సమాఖ్య విధానం నెలకొల్పడం అవసరం. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో పార్టీకి కింది నుంచి పైవరకు చక్కని అనుసంధానం ఉండేది. పీసీసీ స్థాయిలో ఇంకా కింది స్థాయిలో ఎన్నికలు జరిగేవి. అందు వల్ల ఎన్నికల్లో గెలిచే శక్తి పార్టీకి ఉండేది. ఇందిరాగాంధీ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు. అధికార కేంద్రీకరణ జరిపారు. పార్టీ , ప్రభుత్వం వ్యక్తి కేంద్రంగా మారిపోయింది. పార్టీ పార్లమెంటరీ బోర్డు, సీడబ్ల్యూసీ, కేంద్ర క్యాబినెట్ మొదలైనవన్నీ నిర్వీర్యమైనాయి. ఆ ప్రభావం కాంగ్రెస్ పార్టీపై ఇంకా కనబడుతూనే ఉన్నది. ప్రజా ప్రాతినిధ్యం అనే సూత్రం ఆచరణలో లేదు. 1972 తర్వాత కాంగ్రెస్ పార్టీ కమిటీలు, పదవులు అన్నీ నియామకాల ద్వారా జరుగుతున్నాయి. కీలకమైన యూపీలో కాంగ్రెస్ పార్టీకి ప్రాణాధారం వంటి ఎనిమిది వేల సహకార సంస్థలకు 1977 తర్వాత ఎన్నికలే లేవు. 1977లో పార్టీ ఓటమి తర్వాత స్థానిక విభాగాలు నామరూపాల్లేకుండా పోయాయి. క్రమంగా పార్టీ శిథిలావస్థకు చేరుకున్నది. సంజయ్ గాంధీ యువజన కాం గ్రెస్ నాయకుడు కావడంతో ఆయన భజన బృందానిదే పెత్తనమైపోయిం ది. మాతృ సంస్థ యువజన కాంగ్రెస్ కిందికి చేరింది. 1970, 80 దశకాలలో అధికారానికి తన చేతుల్లోకి తెచ్చుకున్న ఇందిరా గాంధీ క్రమంగా– తన తర్వాత స్థానాన్ని ఆక్రమించగల బలమై న నాయకులను పార్టీ నుంచి తొలిగిస్తూ పోయారు. ఈ విధంగా కుమారులు పార్టీ పగ్గాలు చేపట్టడానికి అనుకూల పరిస్థితిని సృష్టించారు.

2000 సంవత్సరం నుంచి సంస్థాగత ఎన్నికలు జరుపడానికి రాహుల్ ప్రయత్నించారు. అందువల్లనే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో అనుకూల ఫలితాలు కనిపించాయి. కానీ ఈ మార్పు మెల్లగా సాగడం వల్ల ముఠా రాజకీయాలు పెరిగిపోయాయి. పార్టీని గెలిపించగల రాష్ట్రస్థాయి నాయకులు లేకుండాపోయారు. ఇటీవలికాలంలో రాష్ట్రస్థాయి నాయకులను ఎదుగనిచ్చిన రాష్ట్రాలలో పార్టీ బలపడింది. ఢిల్లీలో షీలాదీక్షిత్, మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్ సిం గ్, పంజాబ్‌లో అమరీందర్‌సింగ్ వంటి నాయకులు ఎదిగివచ్చారు. జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలట్ వంటి యువ నాయకులను, రాహుల్‌కు పోటీ అవుతారనే భావనతో ప్రోత్సహించడం లేదు.

బీజేపీ చేతిలో వరుస పరాజయాల నుంచి బయటపడాలంటే, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా సంస్కరించుకోవలసిన అవసరం ఉన్నది. రాహుల్ గాంధీ నిష్క్రమించవచ్చు, లేదా పార్టీని ప్రజాస్వామిక సంస్థగా తీర్చిదిద్దనూ వచ్చు. పార్టీకి శస్త్ర చికిత్స చేయడం బాధతో కూడుకున్నదే. కానీ కాంగ్రెస్ పార్టీని సంస్కరించకపోతే, మనుగడ సాగించలేదు. అది దేశానికి ఎంతో నష్టదాయకం. పటిష్టమైన ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరం. హిందూ మెజారిటీవాదం, ఆధిపత్యవాదం ముంచుకొస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టపరుచడం అవసరం.

**(రచయిత్రి: జేఎన్‌యూలో మాజీ ప్రొఫెసర్. ప్రొ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేశారు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని అమరవీరుల స్తూపం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో కమ్ముకున్న సిల్వర్ క్లౌడ్స్



మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన ఫైన్‌ఆర్ట్స్ కళాకారుడు, సిరిసిల్ల జిల్లా అగ్రహారం డిగ్రీ కళాశాల అచార్యుడు నీలం శ్రీనివాసులు తయారుచేసిన 'నోవార్...నీడ్ పీస్' అనే సైకత చిత్రాన్ని మంగళ వారం కురవి ఉన్నతపాఠశాలలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ పార్టీ కళాకారులకు పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలని కోరుకుంటూ ఈ సైకత చిత్రంలో పది మంది శాంతి కాముకుల చిత్రపటాలను ఓ గొలుసుకు అనుసంధానం చేస్తూ ప్రపంచపటాన్ని చుట్టేలా చిత్రీకరించామని నీలం శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేధన్‌సింగ్, ఈవోఆర్డీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. - కురవి

## ముళ్లపొదల్లో మగశిశువు మృతదేహం

**మనోహరాబాద్:** మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళ్లకల్‌లో ముళ్లపొదల్లో ఓ గుర్తుతెలియని మగశిశువు మృతదేహం కనిపించింది. ఎస్సై వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లకల్ గ్రామంలోని పోచమ్మ దేవాలయ సమీపంలో గల ముళ్లపొదల్లో అప్పుడే పుట్టి మరణించిన ఓ మగశిశువు మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కవర్లలో పెట్టి పారవేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఎస్సై వరప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, సీడీపీవో హేమలత భార్గవి అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని తూప్రాన్ మార్చురీకి తరలించారు. అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న భక్తులు దాదాపుగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి చేరుకొని సోమవారం రాత్రి బస చేయడంతోపాటు మంగళవారం వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. - మల్యాల





మంగళవారం హైదరాబాద్‌లో చెన్నూర్, కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ సమస్యలపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చెన్నూర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కేపీ వివేకానందగౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు.

# ఉద్యోగులకు న్యాయం చేస్తాం

- సీఎం కేసీఆర్‌తో సమావేశమవుదాం
- తెలంగాణ అధికారులు అంటే గర్వపడేలా పనిచేయాలి
- తప్పుదోవ పట్టించేవారిని నమ్మవద్దు
- టీజీవో కార్యవర్గ సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో టీజీవో అధ్యక్షురాలు వీ మమత, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విష్ణువర్ధన్‌రావు, కృష్ణాయాదవ్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉద్యోగుల సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కారం దొరుకుతుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, పురావస్తుశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యక్తంచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమై అన్ని సమస్యలపై కూలంకషంగా చర్చించి పరిష్కరించుకొందామని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యోగవర్గాలకు ఎలాంటి అన్యాయం జరుగదని స్పష్టంచేశారు. మంగళవారం టీజీవో భవన్‌లో జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టీజీవో) కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కోటి ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం కేసీఆర్ భుజస్కంధాలపై ఎత్తుకొన్నారని, ఆ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇంతటి బృహత్తర కలల ప్రాజెక్టును పూర్తిచేసేందుకు దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించిన తర్వాతనే మిగతా పాలనాపరమైన వ్యవహారాలు చూసేలా ఉన్నట్టు కనిపిస్తున్నారని అన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్‌తో సమావేశమవుదామని మంత్రి హామీఇచ్చారు. స్వరాష్ట్రంలో అడగకముందే పీఆర్సీ, ఐఆర్‌తోపాటు ఇతర అవసరాలు గుర్తించి, తీర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమైక్య పాలనలో ఉద్యోగులు తలవంచుకొని బతికేవారు కాగా, ఇప్పుడు సగౌరవంగా తలెత్తుకొని బతుకుతున్నారని చెప్పారు. ఉద్యోగులతో ప్రభుత్వం స్నేహపూర్వకంగా ఉన్నదని, అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవపట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటివారిని దగ్గరకు రానీయవద్దని, వారి మాటలను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీవో సెంట్రల్ యూనియన్ ప్రతినిధులు విష్ణువర్ధన్‌రావు, సహదేవ్, రవీందర్‌కుమార్, రవీందర్‌రావు, అరుణ్‌కుమార్, సుజాత, వెంకటయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, లక్ష్మణ్‌గౌడ్, జగన్మోహన్‌రావు, పీఎస్ ఫణికుమార్, నవీనజ్యోతి, సావిత్రి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

**మళ్లీ మమత, సత్యనారాయణకే పగ్గాలు**

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలిగా వీ మమత, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ మరో మూడేండ్లపాటు కొనసాగేలా ఏకగ్రీవంగా ఎన్నుకొంటూ చేసిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే శ్రీనివాస్‌గౌడ్‌కు క్యాబినెట్ మంత్రిగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం చేశారు. అనంతరం మమత, సత్యనారాయణకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియామకపత్రాలు అందజేశారు.

## ఖమ్మం దవాఖాన ఘటనపై విచారణ

**మయూరిసెంటర్:** ఖమ్మం ప్రభుత్వదవాఖానలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఈ నెల 9న ఓ బాలింతకు సెక్యూరిటీ గార్డు సెలైన్ పెట్టిన ఘటనపై మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ హన్మంత్ కొడింబా విచారించారు. 48 గంటల్లో సమగ్ర నివేదిక అందించాలని ఆర్‌ఎంవో కృపాఉషశ్రీని ఆదేశించారు. ఇదే ఘటనపై సోమవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారి డాక్టర్ రాజశేఖర్‌బాబు విచారణ చేసిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ హన్మంత్ కొడింబా రెండు గంటలపాటు ప్రసూతి విభాగానికి చెందిన ఫైళ్లను, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వవైద్యులు, ఆర్‌ఎంవో, నర్సింగ్ సిబ్బందిని ఆ రోజు జరిగిన అంశాలపై ఆరా తీశారు. నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్టు వెల్లడించారు.

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

**గట్టు:** జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం మాచర్లలో పోలీసులు, వ్యవసాయాధికారుల తనిఖీల్లో మంగళవారం 12 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టుబడ్డాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సోలీసులు మాచర్ల గ్రామంలోని రాయాపురం వెంకటేశ్ ఇంట్లో సోదాలు జరుపగా.. 20 గోనె సంచుల్లో నిల్వ ఉంచిన నాసిరకం పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో, ఎస్సై శ్రీనివాస్ ట్రైనీఎస్సై రవి, వ్యవసాయాధికారి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది రామాంజనేయులు, చిన్నతిమ్మప్ప పాల్గొన్నట్లు తెలిపారు.

# ఏండ్లనాటి కల సాకారం..

కోనాపూర్‌లో 24 ఏండ్లుగా 53మంది భూపోరాటం
టీడీపీ హయాంలో పట్టాలిచ్చినా స్థలాలు చూపని వైనం
ఎమ్మెల్యే రవిశంకర్ చొరవతో సమస్య పరిష్కారం
నేడు ఇండ్ల స్థలాల వద్ద భూమి పూజ.. ఆనందంలో లబ్ధిదారులు

**కొడిమ్యాల:** ఇండ్ల స్థలాల కోసం 24 ఏండ్లుగా పోరాడుతున్న నిరుపేదల కల బుధవారం సాకారం కానున్నది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్‌లో కొడిమ్యాల-సూరంపేట రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 138లో 1995లో టీడీపీ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు జారీ చేసింది. కోనాపూర్‌లో ఇండ్లులేని నిరుపేదలను గుర్తించి పట్టాలు ఇచ్చిన అప్పటి అధికారులు, వారికి స్థలాలు మాత్రం కేటాయించలేదు. 24 ఏండ్లుగా 53మంది లబ్ధిదారులు స్థలాల కోసం కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా వారి సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. తమ సమస్యను పరిష్కరించాలని ఇటీవల బాధితులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిశారు. వెంటనే ఆయన జగిత్యాల కలెక్టర్ శరత్‌తో ఫోన్లో మాట్లాడగా ఆయన స్పందించి సమస్యను పరిష్కరించారు. ఇటీవలే 53 మందికి 200 గజాల చొప్పున ఇండ్ల స్థలాలకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేయగా, ఎమ్మెల్యే రవిశంకర్ సదరు ఇండ్ల స్థలాల వద్ద బుధవారం భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టనున్నారు. దీంతో ఇన్నేండ్లుగా పరిష్కారం కాని సమస్య టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రవిశంకర్ చొరవతో తమ కల సాకారమవుతుందంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ అరెస్ట్

ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లు



**మంథని, నమస్తేతెలంగాణ:** నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి పరారీలో ఉన్న కాంగ్రెస్‌నేత, ఉమ్మడి కరీంనగర్ మాజీ గ్రంథాలయ చైర్మన్, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బంధువైన పనకంటి చంద్రశేఖర్‌ను సోమవారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. మంథని సీఐ మహేందర్ కథనం ప్రకారం.. చంద్రశేఖర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగాలిప్పిస్తానని ఓ ముగ్గురి వద్ద కలిపి మొత్తం రూ.14 లక్షలు వసూలు చేసినట్టు గతంలో అతడిపై ఫిర్యాదులు అందాయి. ఆ కేసులో చంద్రశేఖర్ పరారీలో ఉన్నాడు. చంద్రశేఖర్‌పై మంథని కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా.. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఈ మేరకు పోలీస్ ప్రత్యేక బృందం చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని.. కోర్టులో హాజరు పర్చగా.. జడ్జి అతనికి 15 రోజుల కస్టడీ విధించారు.

# కన్నకొడుకులు కాదంటున్నారు

ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

**బోథ్, నమస్తే తెలంగాణ:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కన్న కొడుకులు ఇంట్లో నుంచి గెంటేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కన్గుట్టలో మంగళవారం చోటుచేసుకున్నది. ఈ మేరకు ఆ వృద్ధదంపతులు ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. కన్గుట్టకు చెందిన మునిగెల చిన్నారెడ్డి, లింగవ్వ దంపతులకు నర్సయ్య, శ్రీనివాస్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరు తల్లిదండ్రులకు చెందిన ఆరెకరాల భూమి, ఇండ్లు తమ పేర చేసుకొని ఇంటి నుంచి గెంటేశారు. వృద్ధాప్యంలో ఉన్న తమను గెంటేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ వృద్ధ దంపతులు ఆర్డీవో సూర్యనారాయణతో వాపోయారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరారు. తాసిల్దార్‌తో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు.



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న వృద్ధ దంపతులు

## తల్లి చేతిలో తనయుడు హతం


- మద్యం తాగి వేధిస్తుండగా రోకలి బండతో మోదిన తల్లి
- సూర్యాపేట జిల్లాలో ఘటన

**గరిడేపల్లి:** మద్యం తాగొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్న కొడుకును తల్లి రోకలిబండతో దాడిచేయడంతో అతడు మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సుభాష్‌నగర్‌లో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన బెజ్జం సతీశ్ అలియాస్ చంటి (27) మద్యానికి బానిసై తల్లి మరియమ్మను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. సోమవారం రాత్రి కూడా మద్యం తాగొచ్చి డబ్బుల కోసం వేధిస్తుండగా తల్లి రోకలిబండతో దాడి చేసింది. దీంతో అతడికి గాయాలయ్యాయి. గాయాలతోనే సతీశ్ ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున చూసే సరికి తీవ్రరక్తస్రావంతో మృతి చెందాడు. సతీశ్ భార్య శిల్ప ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌గా మహిళ

- రాష్ట్రంలో తొలి మహిళా ఆపరేటర్‌గా రికార్డు

**వరంగల్, నమస్తేతెలంగాణ:** సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌గా మహిళకు అవకాశం కల్పించింది వరంగల్ మహా నగరపాలక సంస్థ. ఇప్పటికే 14 మంది పురుషులకు సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్ల లైసెన్స్‌లు జారీ చేసిన బల్దియా 15వ లైసెన్స్‌ను హసన్‌పర్తికి చెందిన దాసరి శ్రావణికి మంజూరు చేసింది. రాష్ట్రంలో తొలి మహిళా సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌గా ఆమె ఈ ఘనత సాధించింది. ఏపీలోని నర్సాపూర్ మున్సిపాలిటీలో ఓ మహిళ సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌గా ఉండగా, తాజాగా నియమితులైన శ్రావణి దేశంలోనే రెండో మహిళగా రికార్డులోకి ఎక్కారు.



సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌గా దాసరి శ్రావణికి లైసెన్స్ అందచేస్తున్న ఎంహెచ్‌వో రాజారెడ్డి

# ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

కంప్రెస్‌డ్ ఎయిర్ వెహికిల్ ప్రదర్శన


**వరంగల్ క్రైం:** వరంగల్‌లోని చైతన్య డిగ్రీ, పీజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు తెరలేపారు. నాలుగో ఏడాది చదువుతున్న మెకానికల్ విభాగం విద్యార్థులు సోలార్‌తో నడిచే యంత్రాలతోపాటు అధిక పీడనంతో నడిచే వాహనాన్ని రూపొందించి మంగళవారం ప్రదర్శించారు. వీటిని కళాశాల కరెస్పాండెంట్ పురుషోత్తంరెడ్డి పరిశీలించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. కాలుష్య రహిత వాహనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు విద్యార్థులు క్రాంతికుమార్, పవన్, శరత్, దివ్య, స్వాతి, రాకేశ్ కలిసి అధిక పీడనంతో నడిచే (కంప్రెస్‌డ్ ఎయిర్ వెహికల్)ను అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజు ఆధ్వర్యంలో రూపొందించారు. ఇందులో సిలిండర్, పైప్స్, 4 చక్రాలను వినియోగించారు.

**సోలార్ ట్రైసైకిల్**

వికలాంగులకు అనుగుణంగా సోలార్ ఆధారిత ట్రైసైకిల్‌ను ప్రాజెక్టు పర్యవేక్షకుడు సాగర్ ఆధ్వర్యంలో మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు ఆశిష్ ప్రసాద్, అమీర్ ఫాహద్, పున్నం రాజు, లవ్‌చంద్ర, బబన్ కుమార్ రూపొందించారు. సోలార్ ఆధారిత శక్తితో ఎక్కువ దూరం ప్రయాణించడానికి వీలుగా వాహనాన్ని రూ పొందించినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శంకరలింగం పేర్కొన్నారు. ఇందులో సోలార్ ప్యాన ల్స్, బ్యాటరీలు, ట్రైసైకిల్‌ను విద్యార్థులు వినియోగించినట్లు తెలిపారు.

**సోలార్ పవర్‌హాక్స్..**


వివిధ లోహాలను సోలార్‌శక్తితో సులువుగా కట్ చేసేందుకు పవర్‌హాక్స్ యంత్రాన్ని తయారు చేశారు. అక్విల్ రఫీ, రాజ్‌కుమార్, జహిత్‌అలీ, సాహెబ్‌ఖాన్, అనూష, ఫయాజ్ సైఫ్,వాజిద్ ప్రాజెక్టు పర్యవేక్షకుడు హరీశ్ ఆధ్వర్యంలో రూపొందించారు. దీని తయారీకి సోలార్ ప్యానల్, వైపర్‌మోటర్, బ్యాటరీ బ్లేడ్స్‌ను వినియోగించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ పురుషోత్తంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ శంకరలింగం, మెకానికల్ విభాగాధిపతి బీ రాజ్‌కుమార్, సీఆర్వో డాక్టర్ విద్యనాథ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.



ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన కంప్రెస్‌డ్ వెహికిల్.. సోలార్ ట్రైసైకిల్

# విషపూరిత మందు తాగి..

- ముగ్గురు చిన్నారులకు అస్వస్థత
- ఒకరి పరిస్థితి విషమం




కోదాడ దవాఖానలో చికిత్స పొందుతున్న పర్వాన్, అస్మ, అక్షిత

**కోదాడ రూరల్:** సబ్జాగింజలుగా భావించి విషపూరిత మందును నీటిలో కలుపుకొని తాగడంతో ముగ్గురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్బుల్ పనిచేసే రఫీ.. కృష్ణప్రియ థియేటర్ సమీపంలో ఉంటున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు పర్వాన్(9), అస్మ(7) ఉన్నారు. మంగళవారం సాయంత్రం తమ ఇంటి సమీపంలోని ఆటోడ్రైవర్ బాబు కూతురు అక్షిత(6)తో కలిసి ఆడుకుంటుండగా.. విషపూరిత మందు పొట్లం లభించింది. ఆ మందు నీలి రంగుగా ఉండటంతో సబ్జా గింజలుగా భావించి నీటిలో కలుపుకొని తాగారు. కొద్దిసేపటి తర్వాత ఇంటి ముందు కూతురుతోపాటు ఇద్దరు చిన్నారులు పడిపోవడం చూసిన బాబు వారిని ఆటోలో ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నదని బాధితులు తెలిపారు.

# బడిలో అడుగు పెట్టకుండానే..

- పసిమొగ్గను చిదిమిన ట్రాక్టర్
- కరీంనగర్ జిల్లాలో విషాదం



రితిక (ఫైల్)

**కరీంనగర్ క్రైం:** తెల్లారితే బడిలో చేరాల్సిన చిన్నారి అంతలోనే కన్నుమూసింది. తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కింద ప్రమాదవశాత్తు పడటంతో ప్రాణాలు వదిలిన ఘటన కరీంనగర్ జిల్లా చెర్లబూత్కూర్‌లో జరిగింది. సీఐ శశిధర్‌రెడ్డి కథనం ప్రకారం. చెర్లబూత్కూర్‌కు చెందిన జక్కు ప్రసాద్-లావణ్య దంపతులకు కూతురు రితిక(3), ఏడాది బాబు ఉన్నారు. ఈ మధ్యే కూతురికి అక్షరాభ్యాసం చేయించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పాఠశాలలకు పంపించేందుకు షాపింగ్ కూడా చేశారు. కాగా మంగళవారం రితిక ఇంటిముందున్న ఖాళీ స్థలంలో ఆడుకుంటుండగా.. అదే సమయంలో పొలం పనుల కోసం తండ్రి ప్రసాద్ ట్రాక్టర్ తీశాడు. కూతురిని గమనించకుండా ట్రాక్టర్‌ను వెనక్కి తీయడంతో అక్కడే ఆడుకుంటున్న రితికపైకి చక్రాలు వెళ్లాయి. తీవ్ర గాయాలైన చిన్నారిని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


## బ్రేక్‌డౌన్స్ అంతరాయాలను తగ్గించాలి

**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ:** 33కేవీ, 11కేవీ ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్స్ అంతరాయాలను 50 శాతం వరకు నివారించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. మంగళవారం వరంగల్‌లోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో 16 జిల్లాల ఎస్‌ఈలు, ఆపరేషన్ డీఈలు, కన్‌స్ట్రక్షన్ డీఈలు, ఎంఆర్‌టీ, టెక్నికల్ డీఈలు, ఎస్‌ఏఓలతో నిర్వహించిన సమీక్షలో గోపాల్‌రావు మాట్లాడారు. భీంఘన్‌పూర్, అమ్మవారిపేట, బచ్చన్నపేట, చంద్రుగొండ, పమ్మి, పర్వతగిరిలో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డీపీఆర్ డ్రైవ్‌లో భాగం గా మిడిల్‌పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలను తగ్గించాలన్నారు.

# హైదరాబాద్‌లో బౌద్ధుల ఆనవాళ్లు


చైతన్యపురిలో మూసీ ఒడ్డున వెలుగులోకి..

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బౌద్ధుల ఆనవాళ్లు తొలిసారిగా హైదరాబాద్ మహానగరంలోనూ వెలుగుచూశాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, సూర్యాపేట జిల్లా ఫణిగిరి, నాగారం తదితర ప్రాంతాల్లో మాదిరిగానే హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ పరిధి చైతన్యపురిలోని మూసీనది ఒడ్డున ఆనవాళ్లు లభించాయి. చైతన్యపురిలోని కోసగుండ్ల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉన్న గుట్టపై రాళ్లతో నిర్మించిన స్తూపం అవశేషాలతోపాటు కొత్త రాతియుగం నాటి ఆనవాళ్లను బుద్ధవనం ప్రాజెక్టు అధికారు లు గుర్తించారు. 1982లో కోసగుండ్ల గుట్టపై ఆలయం నిర్మించినప్పుడే ఇక్కడ విష్ణు కుండినుల కాలంనాటి శాసనం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో లభ్యమైన తొలి ప్రాకృత శాసనం ఇదేనని తెలుస్తున్నది. ఇక్కడి బౌద్ధుల ఆనవాళ్లపై పురావస్తుశాఖ ఎలాంటి తవ్వకాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో బుద్ధవనం ప్రాజెక్టు నిపుణుడు, చరిత్ర పరిశోధకుడు ఎంఏ శ్రీనివాసన్, ప్రాజెక్టు డిజైన్ ఇంచార్జి శ్యామ్‌సుందర్‌రావు ఇటీవల ఈ గుట్టపై పరిశోధనలు జరిపారు. రాళ్లతో నిర్మించిన తోవలను, నాలుగు రాతి స్తూపాల అవశేషాలను గుర్తించారు. గుట్టపై కొత్తరాతి యుగపు ఆనవాళ్లూ లభించాయి. మూసీనది ఒడ్డున ఓ రాయిపై అప్పటి పెయింటింగ్‌ను కనుగొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని చైతన్యపురి మూసీనది ఒడ్డున బయటపడ్డ బౌద్ధుల ఆనవాళ్లు

### తవ్వకాలు చేపట్టాలని లేఖ రాశాం



చైతన్యపురిలోని మూసీనది ఒడ్డున బుద్ధవనం ప్రాజెక్టు సిబ్బంది బౌద్ధ ఆరామాలకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించారు. ఇక్కడ ఒక శాసనం మాత్రమే గతంలో లభించగా ప్రస్తుతం స్తూపాల అవశేషాలను గుర్తించాం. చైతన్యపురిలో బౌద్ధానికి సంబంధించిన ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ తవ్వకాలు చేపట్టాలని తెలంగాణ పురావస్తు శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశాం.

– మల్లెపల్లి లక్ష్మయ్య, బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్

## బాలిక గృహనిర్బంధం.. లైంగిక దాడి

- మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం

**మిర్యాలగూడ టౌన్:** పదహారేండ్ల బాలికను మూడ్రోజులపాటు ఇంట్లో నిర్బంధించి లైంగికదాడికి పాల్పడిన ఘటన మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ఓ బాలిక(16) ఆదివారం సమీపంలోని కిరాణ దుకాణం వద్దకు వెళ్లింది. అదే కాలనీకి చెందిన 17 ఏండ్ల వయస్సుగల ఇద్దరు బాలురు బాలికను అపహరించారు. అందులోని ఓ బాలుడు తన ఇంట్లో నిర్బంధించి మూడ్రోజులపాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. మరోవైపు బాలిక తల్లిదండ్రులు కూతురి ఆచూకీ కోసం గాలించి సోమవారం పోలీ సులను ఆశ్రయించారు. పోలీసులు సదరు బాలుడిని ప్రశ్నించగా బుకాయించి తప్పించుకొన్నాడు. మంగళవారం తెల్లవారుజామున బాలికను వదిలివేయడంతో ఇంటికి చేరింది. రక్తపుమరకలతో ఉన్న బాలికను తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. నిందితుడిపై మిస్సింగ్, అత్యాచారం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ, పోస్కో కేసులు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్సై రజినీకర్ తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన మోత్కూరు ట్రాన్స్‌కో ఏఈ

**మోత్కూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్‌ప్రతాప్ మంగళవారం రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు మురళీమోహన్, కమలకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గుండాల మండలం గంగాపురం గ్రామానికి చెందిన రైతు శ్యామల లక్ష్మారెడ్డి గోశాల నిర్వహణకు విద్యుత్ మోటర్ కనెక్షన్ కోసం రూ.5,790 డీడీ తీసి గత నెల 29న మోత్కూరు ట్రాన్స్‌కో ఏఈ, గుండాల మండల ఇంచార్జి ఏఈ లక్ష్మణ్‌ప్రతాప్‌కు అందజేశారు. అదే రోజు ఏఈ ఆన్‌లైన్‌లో నమోదు చేశాడు. కాగా కనెక్షన్ మంజూరు కోసం ఏఈ లక్ష్మణ్ ప్రతాప్ లంచం డిమాండ్ చేశాడు. మంగళవారం బీబీనగర్ ఎస్‌బీఐ సమీపంలో రైతు లక్ష్మారెడ్డి నుంచి ఏఈ రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ప ట్టుకున్నారు. ఏఈ లక్ష్మణ్‌ప్రతాప్‌ను అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకొన్నారు.



ఏఈ లక్ష్మణ్‌ప్రతాప్

# కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, జూన్ 11:** జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున షోపియాన్ జిల్లాలోని అవ్‌నీరా ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. వీరి రాకను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అధికారులు మాట్లాడుతూ హతమైన ఉగ్రవాదులను సయార్ అహ్మద్ భట్, షాకిర్ అహ్మద్ వాగేగా గుర్తించామని చెప్పారు. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలతో ప్రేరేపితమైన వీరు ఉగ్రవాదం వైపు మళ్లారని తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రదేశంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

# కర్తార్‌పూర్ కారిడార్ కోసం 100 కోట్లు కేటాయించిన పాక్

**ఇస్లామాబాద్, జూన్ 11:** పాకిస్థాన్, భారత్ మధ్య నిర్మిస్తున్న కర్తార్‌పూర్ కారిడార్ కోసం పొరుగుదేశం రూ.100 కోట్లు కేటాయించింది. ఈ మేరకు 2019–20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఈ నిధులను కేటాయిస్తున్నట్లు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం తెలిపింది. మంగళవారం ఈ బడ్జెట్‌ను పాక్ రెవెన్యూ సహాయమంత్రి హమ్మద్ అజార్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కర్తార్‌పూర్ కారిడార్ అభివృద్ధికి ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. సరిహద్దు నుంచి పాక్‌లోని కర్తార్‌పూర్‌లో ఉన్న దర్బార్ సాహిబ్ గురుద్వారా వరకు పాకిస్థాన్ రోడ్డు మార్గాన్ని నిర్మించడమే కాకుండా అభివృద్ధి పనులు చేపడుతుంది. అలాగే భారత్ కూడా సరిహద్దు నుంచి పంజాబ్‌లోని డేరా బాబా నానక్ గురుద్వారా వరకు అభివృద్ధి పనులు చేపట్టాలి. తద్వారా వీసా అవసరం లేకుండా భారత సిక్కులు దర్బార్ సాహిబ్ గురుద్వారాను దర్శించే వీలు కలుగనుంది.

# ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వండి

### ప్రధాని మోదీని కోరిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



**న్యూఢిల్లీ, జూన్ 11:** ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర సీఎం, బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ కోరారు. మంగళవారం ఆయన ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఒడిశాకు ప్రత్యేక హోదా విషయాన్ని ప్రధాని ముందు ప్రస్తావించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మోదీకి శుభాకాంక్షలు చెప్పానని తెలిపారు. కొద్ది కాలం కిందట ఒడిశాలో సంభవించిన తుఫాన్ ధాటికి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ఈ విషయంపై కూడా ప్రధానితో చర్చించానని పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూ.సే.) విభాగం
కలెక్టర్ / సంయుక్త కలెక్టర్ / ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.)
ఫారం-7 (డిక్లరేషన్ ఆఫ్ డిక్లరేషన్)
(సెక్షన్ సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 25 మరియు సెక్షన్ 19(1) చట్టం 30/2013)
[illegible]
DIPR No. : 260/LA/PP/Agency/2019-20

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
1. NIT No.1/CE(R&B) RR/SE (D&P-1)/EE (D&P)/ DEE-1 (RR)/AEE-2(RR)/STSDF/2019-20, తేది: 7-6-2019 ప్రకారం వరంగల్ సర్కిల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు సంబంధించి STSDF క్రింద ఒక రోడ్డు పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 2. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/ నుండి 12-6-2019న సా.4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరితేది, సమయం: 26-6-2019న లేదా ఆలోగా. సా.4.00 గం. వరకు తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/ వద్ద చూడవచ్చును.
DIPR RO No.269-DP/CL/Advt/1/2019-20, Dt: 11/6/2019 సం/- చీఫ్ ఇంజినీర్ (R&B) రూరల్ రోడ్స్, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ
టెండరు ప్రకటన
భారత ప్రభుత్వ గ్రాంట్‌తో FY 2019-20 కాలంలో ST విద్యార్థులకు దిగువ కోచింగ్‌లు ఇచ్చుట కొరకు నమోదిత, ప్రముఖ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నుండి సీల్డు టెండర్లు కోరుబడుచున్నవి. 1) గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇంజినీరింగ్ (GATE), 2) ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (IES) ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ 3) ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ (IFS) ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్. నియమ నిబంధనలతో టెండరు డాక్యుమెంట్లను, టెండర్లు తెరుచు తేదీ, సమయం మరియు టెండరు ఎవాల్యుయేషన్ ఫారాలను www.studycircle.cgg.gov.in/tstw నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. వివరాలు మరియు స్పష్టీకరణల కొరకు సెల్ నం. 9398495847/ 040-23317177పై సంప్రదించగలరు.
సం/- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్
DIPR RO. No. 275-DP/CL/Advt/1/2019-20, Dt: 11/06/2019

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT COOPERATIVE FEDERATION LTD., LALAPET:: HYDERABAD - 500017
Website: tsdairy.telangana.gov.in
Tender Notice No.13/EE©/TSDDCFL/2019 Date:11-06-2019
Name of work: "Civil works for cold storage at Khammam Dairy" for tender value Rs.399834.00 schedule closed on 26-06-2019 by 05.00PM. For further detail visit https://tender.telangana.gov.in and further enquiry contact EE© in HO Ph: 9391841211 during the office hours.
EXECUTIVE ENGINEER (CIVIL)



# 'వాయు' గండం

## అరేబియాలో ఏర్పడిన తుఫాన్ ■ గుజరాత్ దిశగా పయనం

## రేపు తీరాన్ని తాకే అవకాశం ■ అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## సురక్షిత ప్రాంతాలకు తీర ప్రాంత ప్రజల తరలింపు

## రంగంలోకి దిగిన సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, తీర ప్రాంత రక్షణ దళాలు



**న్యూఢిల్లీ, జూన్ 11:**

అరేబియా సముద్రంలో రెండు రోజుల క్రితం ఏర్పడిన అల్ప పీడనం క్రమంగా బలపడుతూ తుఫాన్ రూపాన్ని సంతరించుకున్నది. ఈ తుఫాన్‌కు 'వాయు' అని నామకరణం చేశారు. గుజరాత్‌లోని వెరావాల్ తీరానికి 650 కి.మీ. దూరంలో ఉన్న వాయు తుఫాన్ గురువారం ఉదయం తీరాన్ని తాకవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తున్నది. ఈ తుఫాను బుధవారం ఉదయానికి పెను తుఫాన్‌గా మారే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర దిశగా కదులుతున్న 'వాయు' గుజరాత్‌లోని పోర్‌బందర్, మహువా మధ్య వెరావల్ వద్ద తీరాన్ని తాకవచ్చని పేర్కొంది. ఈ తుఫాన్ కారణంగా 110 నుంచి 120 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తుఫాన్ తీరాన్ని తాకే సమయంలో గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడవచ్చని హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికే సౌరాష్ట్ర, కచ్‌లోని తీర ప్రాంతాల్లో జాతీయ విపత్తు సహాయ సిబ్బంది(ఎన్డీఆర్ఎఫ్)ను మోహరించింది. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించిన అధికారులు నౌకాశ్రయాల్లో రెండో ప్రమాద సంకేతాన్ని ఎగురవేశారు. రాజ్‌కోట్‌లో ఈ నెల 13న స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. సముద్రంలో అలలు మీటరున్నర ఎత్తువరకు ఎగిసిపడవచ్చని అధికారులు తెలిపారు. దీంతో గుజరాత్‌లోని తీర ప్రాంతాలైన కచ్, దేవభూమి ద్వారక, పోర్‌బందర్, జునాగఢ్, డయ్యూ, గిర్ సోమ్‌నాథ్, అమ్రేలీ, భావ్‌నగర్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునగవచ్చని భావిస్తున్నారు. లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, దక్షిణ మహారాష్ట్రలో వాయు ప్రభావం స్వల్పంగా ఉండవచ్చని తెలిపారు. గత నెలలో సంభవించిన 'ఫొని' తుఫాన్ 60 మందిని బలితీసుకొని ఒడిశా రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే.




అహ్మదాబాద్ సమీపంలోని చిలోడా ఎన్డీఆర్ఎఫ్ క్యాంప్‌లో సామగ్రిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

### అప్రమత్తమైన ప్రభుత్వం

వాయు తుఫాన్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తీర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం విజయ్ రూపాణి అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు తమ ప్రభుత్వ అధికారులు.. ఈ విషయంలో నైపుణ్యం ఉన్న ఒడిశా ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని చెప్పారు. సంబంధిత ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగుల సెలవులను రద్దు చేశామని తెలిపారు. బుధవారం క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులు ఆయా జిల్లాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యలను పర్యవేక్షిస్తారని చెప్పారు. మరోవైపు కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ పీకే సిన్హా, గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఎన్ సింగ్ వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు.

### అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్ష



వాయు తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు గుజరాత్ ప్రభుత్వ సంసిద్ధతపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 45 మంది సభ్యుల చొప్పున ఉన్న 25 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఇప్పటికే తీరప్రాంతాల్లో మోహరించామని అధికారులు తెలిపారు. వారికి పడవలను, చెట్టు కొమ్మలను కత్తిరించే పరికరాలను, టెలికాం వ్యవస్థను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా మోహరిస్తామని చెప్పారు. విద్యుత్, టెలికం, వైద్యం, తాగునీరు వంటి అత్యవసర సదుపాయాలను నిత్యం అందుబాటులో ఉంచాలని అమిత్‌షా అధికారులకు సూచించారు. వాయు తుఫాన్‌తో ప్రభావితమవుతాయని భావిస్తున్న గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, డామన్ డయ్యూ ప్రభుత్వాలతో నిత్యం మాట్లాడుతున్నామని చెప్పారు.

### ఐదు భయానకమైన తుఫాన్లు

ఒడిశాను ఫొని తుఫాను కుదిపివేసి నెల రోజులు కూడా గడువకముందే వాయు తుఫాన్ గుజరాత్‌వైపు దూసుకొస్తున్నది. ఫొని కారణంగా ఒడిశాలో 60మందికి పైగా మరణించగా, వాయు ఎటువంటి విధ్వంసం సృష్టిస్తుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన ప్రపంచంలోనే ఐదు అత్యంత భయానకమైన తుఫాన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**హుగ్లీ నది తఫాన్**

ఇప్పటివరకూ సంభవించిన అత్యంత భయానకమైన ప్రకృతి విపత్తుగా పేర్కొనే బెంగాల్‌లోని హుగ్లీ నది తుఫాన్ 1737వ సంవత్సరంలో వచ్చింది. ఆ ఏడాది అక్టోబర్ 11న తీరాన్ని తాకిన తుఫాన్ కారణంగా మూడు లక్షల నుంచి మూడున్నర లక్షల మంది మరణించినట్టు రికార్డులు తెలుపుతున్నాయి.

**ఫిలిప్పీన్స్ హైఫాంగ్ టైఫూన్**

1881లో వచ్చిన ఈ తుఫాన్ వియత్నాంలోని హైఫాంగ్‌లో విధ్వంసం సృష్టించింది. తుఫాన్ కారణంగా మూడు లక్షల మంది మరణించగా, అంటువ్యాధులు ప్రబలి, ఆకలిదప్పులతో మరికొన్ని వేల మంది మృత్యువాత పడ్డారు.

**బార్బడోస్ గ్రేట్ హరికేన్**

కేప్ వర్డీ దీవుల్లో 1780లో ఏర్పడిన తుఫాను సెయింట్ లూసియాలోని మార్టినిక్‌లో 1780 అక్టోబర్ 9న తీరాన్ని దాటింది. ఈ తుఫాన్ కారణంగా 22– 27 వేల మంది మరణించారు.

**ది గ్రేట్ భోలా సైక్లోన్**

బంగ్లాదేశ్‌లో 1970లో వచ్చిన భోలా తుఫాన్ సుమారు 3 లక్షల మందిని బలితీసుకుంది. ఆ సమయంలో గంటకు 220 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచాయి. మృతుల సంఖ్యను కొందరు 5లక్షల మందిగా కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు సంభవించిన అత్యంత ప్రాణాంతకమైన ప్రకృతి విపత్తుగాను, భయానకమైన ఉష్ణమండల తుఫాన్‌గాను ఇది రికార్డులకెక్కింది.

**నర్గీస్ తుఫాన్:** నర్గీస్ తుఫాన్ కారణంగా ఆసియాలోని భారత్, థాయ్‌లాండ్, మయన్మార్, శ్రీలంక, లావోస్, బంగ్లాదేశ్ దేశాలు ప్రభావితమయ్యాయి. 2008, ఏప్రిల్ నెలాఖరులో ఈ తుఫాన్ వచ్చింది. నర్గీస్‌ను నాలుగో క్యాటగిరీలో చేర్చారు. ఈ తుఫాన్ కారణంగా ఆయా దేశాల్లో మొత్తం కలిపి 1.4 లక్షల మంది మరణించారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. కాగా మృతుల సంఖ్య అంతకంటే భారీగా ఉంటుందని అనధికార వర్గాలు పేర్కొన్నాయి.

# కాంగ్రెస్‌కు తాత్కాలిక అధ్యక్షుడు!

## పార్టీ అధిష్ఠానం పరిశీలనలో ప్రతిపాదన.. రాజీనామాపై బెట్టు వీడని రాహుల్‌గాంధీ

## ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న నాయకులు

**న్యూఢిల్లీ, జూన్ 11:**

కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షునిగా రాహుల్‌గాంధీ కొనసాగుతారా లేదా అన్న అంశంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నది. రాజీనామా ఆలోచన విరమించుకోవాలని, పార్టీ అధ్యక్షునిగా కొనసాగాలని పలు రాష్ట్రాలలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శాఖలు తీర్మానాలు చేసినప్పటికీ రాహుల్‌గాంధీ మాత్రం బెట్టువీడటం లేదు. తనకు నచ్చజెప్పేందుకు పక్షం రోజులుగా ప్రయత్నిస్తున్న పలువురు సీనియర్ నాయకులకు ఆయన కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. దీంతో పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి మళ్లించినట్టు తెలుస్తున్నది. గాంధీ కుటుంబానికి చెందని వ్యక్తిని, పార్టీలో సీనియర్ నాయకుడిని కొంతకాలంపాటు 'తాత్కాలిక అధ్యక్షుని'గా నియమించాలని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నట్టు సమాచారం. పార్టీ విషయంలో సమిష్టి నిర్ణయం తీసుకోవడం కోసం కొందరు నాయకులతో ఒక కొలీజియంను ఏర్పాటు చేయాలని, తాత్కాలిక అధ్యక్షుడు దానికి నేతృత్వం వహించాలని పలువురి నుంచి సూచనలు అందుతున్నట్టు తెలిసింది. ప్రతిష్టంభనను తొలగించడంపై చర్చలు జరిపేందుకు సీనియర్ నాయకుడు ఏకే ఆంటోనీ త్వరలోనే పార్టీ అధ్యక్షునితో సమావేశమవుతారని తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో రాహుల్‌గాంధీ తన రాజీనామాను ప్రకటించిన సంగతి తెలిసిందే. గాంధీ కుటుంబానికి చెందని వారిని పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకోవాలని ఆయన ఆ రోజున సూచించారు. అయితే రాజీనామాను విరమించుకునే విషయమై రాహుల్‌కు నచ్చజెప్పేందుకు చేస్తున్న ప్రయత్నాలలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదని ఓ సీనియర్ నాయకుడు చెప్పారు. రాహుల్ తన మనస్సు మార్చుకుంటే పరిస్థితిలో మార్పు వస్తుందని, ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూడాల్సిన అవసరం ఉండదని కొందరు నేతలు భావిస్తున్నారు. రానున్న కొద్దిరోజులలోనే దీనిపై ఒక స్పష్టత రావచ్చని అంటున్నారు. దీని కన్నా ముందు.. ఈ నెల 17 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు లోక్‌సభలో ఎవరు నేతృత్వం వహించాలన్న విషయాన్ని వచ్చే వారంలోగా నిర్ణయించనున్నారు. లోక్‌సభలో కూడా పార్టీ నేతగా ఉండాలని కొందరు నేతలు రాహుల్‌ను కోరుతున్నారు.

# చిన్నారిని మింగిన బోరుబావి

## పంజాబ్‌లో రెండేండ్ల ఫతేవీర్ మృతి

## 110 గంటలపాటు సాగిన సహాయ చర్యలు విఫలం

**సంగ్రూర్, జూన్ 11:** పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా, భగవాన్‌పురా గ్రామంలో బోరుబావిలో పడిన రెండేండ్ల చిన్నారి మృతి చెందాడు. ఆ బాలుడిని సజీవంగా వెలికి తీయడంలో సహాయ సిబ్బంది విఫలమయ్యారు. దాదాపు 110 గంటలపాటు తీవ్రంగా శ్రమించినప్పటికీ వారి ప్రయత్నాలన్నీ నిష్ఫలమయ్యాయి. చిమ్మచీకటిలో నరక యాతన అనుభవించిన బాలుడు ఫతేవీర్‌సింగ్ మరణించి చాలా గంటలైందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. ఎలాంటి ఆహారం లేకుండా కేవలం ఆక్సిజన్ మాత్రమే అందడంతో చిన్నారి ఆరోగ్యం క్షీణించిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాద ఛాయలు మిగిల్చింది. బాలుడి మృతదేహానికి మంగళవారమే అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం నాడే రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన తమ ఒక్కగానొక్క కొడుకుకు అప్పుడే నూరేండ్లు నిండాయంటూ తల్లిదండ్రులు చేసిన రోదన పలువురిని కంటతడిపెట్టించింది. చెక్కపెట్టెలో ఉంచిన బాలుడి మృతదేహాన్ని చితిపై పేర్చి నిప్పు పెట్టినప్పుడు గ్రామం అంతా భోరున విలపించింది. గత గురువారం బోరుబావిలో పడిన బాలుడిని సహాయ సిబ్బంది మంగళవారం ఉదయం 4.45 గంటలకు వెలికితీశారు. వెంటనే ఆ బాలుడిని అంబులెన్స్‌లో 130 కి.మీ. దూరంలో ఉన్న చండీగఢ్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే ఆ బాలుడు అప్పటికే మరణించాడని వైద్యులు పేర్కొన్నారు. పంజాబ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెలికాప్టర్‌లో బాలుడి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు సహా స్థానికులు సైతం తీవ్రంగా మండిపడ్డారు. ఇంటికి సమీపంలోని పొలాల్లో ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు ఆ బోరుబావిలో పడ్డాడు. బోరుబావిపై కేవలం ఒక వస్త్రాన్ని మాత్రమే కప్పి ఉంచడంతో ఈ ప్రమాదం జరిగింది. బాలుడి తల్లి వెంటనే అక్కడికి వెళ్లి తన కొడుకును రక్షించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో రంగంలోకి దిగిన సహాయ సిబ్బంది బోరుబావికి సమాంతరంగా మరో గొయ్యి తవ్వారు. 150 అడుగుల లోతున్న బోరుబావిలో బాలుడు 125 అడుగుల లోతుకు పడిపోయాడు. బాలుడిని రక్షించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారని, సరైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించలేదని కుటుంబసభ్యులు, స్థానికులు విమర్శించారు. బాలుడిని వెలికితీసినప్పుడు.. అప్పటికే మరణించాడని, దుర్వాసన కూడా వచ్చిందని, అయినప్పటికీ అధికారులు 150 కి.మీ. దూరాన ఉన్న దవాఖానకు తరలించారని, తద్వారా కుటుంబ సభ్యులను మరింత వేదనకు గురిచేశారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పాడుబడిన బోరుబావులను మూసివేయాలని సీఎం అమరీందర్ సింగ్ ఆదేశించారు.





బోరుబావిలో నుంచి చిన్నారిని బయటకు తీస్తున్న దృశ్యం, పక్కన చిన్నారి ఫతేవీర్‌సింగ్ (ఫైల్)

# జర్నలిస్టుకు విముక్తి

- యూపీ సీఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రశాంత్ కనోజాకు సుప్రీంకోర్టు బెయిల్
- 'సోషల్‌మీడియా పోస్ట్'కు 11 రోజుల కస్టడీ సరికాదన్న ధర్మాసనం
- ఇది స్వేచ్ఛ హక్కును హరించడమేనని వ్యాఖ్య
- ప్రశాంత్‌పై విచారణ కొనసాగుతుందని వెల్లడి






**న్యూఢిల్లీ, జూన్ 11:** ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై అరెస్టయిన జర్నలిస్ట్ ప్రశాంత్ కనోజాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసింది. ఆయనను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. అయితే బెయిల్ ఇచ్చినంత మాత్రాన ప్రశాంత్ చేసిన పనిని సమర్థించినట్టు కాదని, కేసు దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టంచేసింది. వ్యక్తి స్వేచ్ఛ హక్కును కాపాడేందుకే బెయిల్ మంజూరు చేస్తున్నామని వెల్లడించింది. యూపీ సీఎం యోగిపై సోషల్‌మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై యూపీ పోలీసులు ప్రశాంత్ కనోజాతోపాటు ఐదుగురిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ మహిళ యూపీ సీఎం ఆఫీస్ ముందు నిలబడి మీడియాతో మాట్లాడుతూ.. తాను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు పెండ్లి ప్రతిపాదన పంపానని చెప్పింది. ఈ వీడియోను జర్నలిస్ట్ ప్రశాంత్ తన ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాల్లో షేర్ చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి ప్రశాంత్‌ను అరెస్ట్ చేశారు. కోర్టు ఆయనకు 11 రోజుల రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ అరెస్టును సవాల్ చేస్తూ ఆయన భార్య జగిశా అరోరా సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అజయ్ రస్తోగితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సోషల్ మీడియా పోస్ట్‌ల కారణంగా ఒక వ్యక్తి 11 రోజులపాటు జైలులో ఉండటం సరికాదని అభిప్రాయపడింది. 'వ్యక్తి స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అది ఎంతో పవిత్రమైనది. ఈ విషయంలో మరోమాటకు తావులేదు' అని ధర్మాసనం పేర్కొన్నది. అందుకే ప్రశాంత్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు వెల్లడించింది. వెంటనే ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. బెయిల్ ఇచ్చినంత మాత్రాన ప్రశాంత్ వ్యాఖ్యలను తాము సమర్థించినట్టు కాదని చెప్పింది. ఆయనపై వచ్చిన అభియోగాలపై చట్ట ప్రకారం విచారణ కొనసాగుతుందని స్పష్టంచేసింది.

### అక్రమంగా నిర్బంధించారు

సుప్రీంకోర్టు తీర్పుపై జర్నలిస్ట్ ప్రశాంత్ భార్య జగిశా అరోరా మీడియాతో మాట్లాడారు. తన భర్తను అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు కనీస నిబంధనలు పాటించలేదని, కనీసం యూనిఫాం కూడా ధరించలేదని పేర్కొన్నారు. ఆయనను అక్రమంగా అరెస్ట్ చేశారని సుప్రీంకోర్టు సైతం తేల్చిందని గుర్తుచేశారు. తన భర్త చేసిన ట్వీట్‌లో పెద్ద తప్పేమీ లేదన్నారు. అదో కామెడీ వీడియో మాదిరిగా ఉండటం వల్లే షేర్ చేశారని, ఇందులో వేరే ఉద్దేశం లేదని పేర్కొన్నారు.

### యోగి మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు: రాహుల్ గాంధీ



జర్నలిస్టుల అరెస్ట్ వ్యవహారంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ట్వీట్ చేశారు. 'ఆరెస్సెస్ లేదా బీజేపీ వర్గీయులు చెప్పే మాటలు వింటూ.. తప్పుడు వార్తలు రాశారని, నకిలీ కథనాలు పోస్ట్ చేశారంటూ జర్నలిస్టులను అరెస్ట్ చేసుకుంటూ పోతే కొన్నాళ్లకు పత్రికలు, న్యూస్ చానళ్లు భారీగా సిబ్బంది కొరతను ఎదుర్కొంటాయి' అని విమర్శించారు. ఈ అంశంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ సైతం ట్విట్టర్ వేదికగా స్పందించారు. యూపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను పట్టించుకోవడం మానేసి జర్నలిస్టులు, రైతులు, ఇతర వర్గాల ప్రతినిధులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.


# డీడీఎస్‌కు ఐరాస అవార్డు

## పర్యావరణ పరిరక్షణకు పాల్పడుతున్నందుకు గుర్తింపు

Deccan Development Society

**ఐక్యరాజ్యసమితి, జూన్ 11:** తెలంగాణకు చెందిన ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)కు ప్రతిష్టాత్మక ఐక్యరాజ్యసమితి అవార్డు లభించింది. ప్రతికూల పర్యావరణ మార్పులను అరికట్టే పరిష్కారాలను సూచించే పలు సంస్థలకు గుర్తింపునిచ్చేందుకు ఐరాసలోని ఈక్వేటర్ ఇనిషియేటివ్ ద్వైవార్షికంగా ఈ అవార్డును అందజేస్తుంది. ఈ ఏడాది అవార్డు కోసం ఈక్వేటర్ ఇనిషియేటివ్ 22 సంస్థలను ఎంపిక చేయగా, వాటిలో జహీరాబాద్‌కు చెందిన డీడీఎస్ కూడా ఉంది. ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) పరిధిలో పనిచేసే ఈక్వేటర్ ఇనిషియేటివ్ డీడీఎస్‌ను 'ఈక్వేటర్ ప్రైజ్ 2019'కు ఎంపిక చేసింది. జహీరాబాద్ ప్రాంతంలో దళిత, గిరిజన మహిళలకు సాధికారత కల్పించేందుకు, పర్యావరణ అనుకూల భూ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, ఆహార భద్రతను సాధించేందుకుగాను పునరుత్పత్తి వ్యవసాయ విధానాలు, సామాజిక విత్తన బ్యాంకులను డీడీఎస్ ప్రోత్సహిస్తున్నది. డీడీఎస్‌కు పూర్తిగా మహిళలే నేతృత్వం వహిస్తున్నారు. గత 25 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని సుమారు 75 గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వివిధ మహిళా స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్నది. ఈ సంస్థలో సమాజంలోని అట్టడుగువర్గాలు, పేద దళితులు సుమారు 5000 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని ఐరాస పేర్కొంది. ఈక్వేటర్ అవార్డుకు కెన్యా, ఇండొనేషియా, హవాయి, బ్రెజిల్ తదితర దేశాలకు చెందిన సంస్థలు కూడా ఎంపికయ్యాయి. ఈ అవార్డు కోసం 127 దేశాల నుంచి 847 నామినేషన్లు వచ్చాయి.

# యూపీలో మరో జర్నలిస్టు అరెస్ట్



అన్షుల్ కౌశిక్

**నోయిడా (యూపీ), జూన్ 11:** ఉత్తర్‌ప్రదేశ్‌లో జర్నలిస్టులపై నిర్బంధం కొనసాగుతున్నది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించారంటూ నేషన్ లైవ్ ఎడిటర్ అన్షుల్ కౌశిక్‌ను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను కోర్టు ముందు హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించింది. ఈనెల 6న ఇదే టీవీ చానెల్‌లో నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంలో ఓ మహిళ సీఎం ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ చానెల్ అధిపతి ఇషికా సింగ్, ఎడిటర్ అనూజ్ శుక్లాను 8వ తేదీన పోలీసులు అరెస్టు చేశారు. వారికి కూడా న్యాయస్థానం 14 రోజుల కస్టడీని విధించింది.





**మనుషుల** మాదిరిగానే జంతువులకూ స్పందనలు ఉంటాయని తెలిసిందే. అయితే గుంపులోని ఒక జంతువు చనిపోతే మనుషుల మాదిరిగానే భావోద్వేగానికి గురవుతాయని, శోకిస్తాయని, సంతాపం తెలుపుతాయని ఈ గజరాజులు నిరూపించాయి. ఓ గున్న ఏనుగు చనిపోగా, తల్లి ఏనుగు దానిని రోడ్డు మీదికి తీసుకొచ్చింది. గుంపులోని మిగతా ఏనుగులు వెనుకే వచ్చి మృతదేహం చుట్టూ చేరి ఓ నిమిషంపాటు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత అన్నీ కలిసి మృతదేహాన్ని తిరిగి అడవిలోకి తీసుకెళ్లాయి. ఏనుగులు స్పందించిన తీరును ప్రవీణ్ కాస్వాన్ అనే అటవీశాఖ అధికారి వీడియో తీశారు. గతవారం తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు.

విమానం హైజాక్ బెదిరింపునకు పాల్పడిన వ్యక్తికి..

# జీవిత ఖైదు.. 5 కోట్ల జరిమానా

ఎన్ఐఏ కోర్టు సంచలన తీర్పు




**అహ్మదాబాద్:** విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు బెదిరించిన వ్యక్తికి అహ్మదాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ.5 కోట్ల జరిమానా విధించింది. ఆ డబ్బును విమాన ప్రయాణికులతోపాటు జెట్ ఎయిర్‌వేస్ సిబ్బందికి పంపిణీ చేయాలని మంగళవారం తీర్పునిచ్చింది. 2017 అక్టోబర్ 30న ముంబయి-ఢిల్లీ జెట్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణిస్తున్న ముంబయికి చెందిన వ్యాపారవేత్త బిర్జూ సల్లా, ఆ విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు టిష్యూ పేపర్‌పై ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో రాశాడు. విమానాన్ని పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు మళ్లించాలని పేర్కొన్నాడు. అలాగే చివరగా అల్లా గొప్పవాడు అని రాశాడు. విమానం టాయిలెట్‌లోని టిష్యూ పేపర్ బాక్స్‌లో దీన్ని ఉంచాడు. సిబ్బంది దీన్ని గమనించడంతో ఆ విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం జరిగిన దర్యాప్తులో ఈ పని బిర్జూ సల్లా చేశాడని గుర్తించారు. హైజాక్ బెదిరింపుతో జెట్ ఎయిర్‌వేస్ ఢిల్లీ సర్వీసులను తాత్కాలికంగా నిలిపేస్తుందని, దీంతో ఢిల్లీలోని ఆ సంస్థలో పనిచేస్తున్న తన స్నేహితురాలు ముంబయికి తిరిగి వస్తుందని భావించి హైజాక్ నాటకం ఆడినట్లు అతడు పేర్కొన్నాడు.

# ఏఎన్-32 విమానం శకలాలు లభ్యం

అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ జిల్లాలో గుర్తించిన వాయుసేన సిబ్బంది

గల్లంతైన 13 మంది కోసం కొనసాగుతున్న గాలింపు



సియాంగ్ జిల్లా పాయుమ్ సర్కిల్‌లోని పర్వతశ్రేణుల్లో గుర్తించిన విమాన శకలాలు

**న్యూఢిల్లీ:** ఈ నెల 3న అదృశ్యమైన భారత వాయుసేనకు చెందిన విమానం 'ఏఎన్-32' ప్రమాదం బారినపడినట్లు వెల్లడైంది. ఆ మేరకు విమాన శకలాలను మంగళవారం అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ జిల్లాకు చెందిన పాయుమ్ సర్కిల్ ప్రాంతంలో వాయుసేన సిబ్బంది గుర్తించారు. సముద్రమట్టానికి దాదాపు 12వేల అడుగుల ఎత్తులో ఈ శకలాలు కనిపించాయి. అయితే ఇందులో ప్రయాణించిన 13 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వారి కోసం గాలింపు కొనసాగుతున్నది. ఈ నెల 3న అసోంలోని జోర్హాట్ నుంచి బయలుదేరిన ఈ విమానం గాలిలోకి ఎగిరిన కొద్ది సేపటికే గల్లంతయ్యింది. దీని ఆచూకీని కనుగొనడానికి వాయుసేనకు చెందిన సుఖోయ్-30, ఎంఐ-17 యుద్ధ విమానాలతోపాటు సైనికులు, వాయుసేన సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఇస్రో సాయాన్ని కూడా తీసుకున్నారు. మంగళవారం గాలింపు సందర్భంగా ఎంఐ-17 విమానంలోని సిబ్బంది ఏఎన్-32 శకలాలను గుర్తించారు. అయితే ప్రమాదానికి గురైన విమానం జోర్హాట్ నుంచి బయలుదేరినప్పుడు అందులో 13 మంది ఉన్నారు. ప్రస్తుతం వారి ఆచూకీ లభించకపోవడంతో చనిపోయినట్లు భావిస్తున్నప్పటికీ గాలింపును ముమ్మరం చేశారు. కాగా విమానం శకలాలు దొరికిన విషయం తెలిసిన వెంటనే అందులో ప్రయాణించిన సిబ్బంది బంధువులు జోర్హాట్‌కు చేరుకున్నారు. తమ వారి ఆచూకీ కోసం వాకబు చేశారు. మరోవైపు ప్రమాదాల వల్ల ఈ ఏడాది భారత వాయుసేన ఇప్పటి వరకు 10 విమానాలను కోల్పోయింది. ఈ విమాన ప్రమాదాలు కూడా ఎక్కువగా ఫిబ్రవరి నెలలో జరుగగా గమనార్హం. వాయుసేన కోల్పోయిన విమానాల్లో మిరేజ్ 2000, మిగ్-27, జాగ్వార్, ఏఎన్-32 తదితరాలు ఉన్నాయి.



# వడదెబ్బకు రైల్లోనే ముగ్గురు మృతి

దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలిన మరొకరు

ఉత్తరాది తీర్థయాత్రకు వెళ్లి వస్తుండగా ఉత్తరప్రదేశ్‌లో దుర్ఘటన

మృతులంతా తమిళనాడుకు చెందిన వాళ్లు



**ఝాన్సీ (యూపీ)/న్యూఢిల్లీ:** ఆగ్రా నుంచి కోయంబత్తూరుకు రైలులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు వడదెబ్బ తగిలి సోమవారం మరణించారు. తమిళనాడుకు చెందిన వీరు ఐదేండ్ల ఉత్తరాదికి తీర్థయాత్రకు వెళ్లారు. పలు ప్రాంతాలను సందర్శించిన వీరు కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆగ్రా నుంచి కోయంబత్తూరుకు వస్తుండగా ఎండ వేడిని తట్టుకోలేక ముగ్గురు రైలులోనే ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనపై రైల్వే అధికారి మనోజ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ఉత్తరాది ప్రాంతానికి తీర్థయాత్రకు వచ్చిన ఓ బృందంలోని నలుగురు ఉన్నారని చెప్పారు. వీరంతా వారణాసిని సందర్శించిన అనంతరం ఆగ్రాకు వచ్చారని తెలిపారు. అనంతరం ఆగ్రా నుంచి కోయంబత్తూరుకు కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారని, వీరి రైలు సోమవారం సాయంత్రం ఝాన్సీ ప్రాంతానికి చేరుకోగానే అస్వస్థతకు గురయ్యారని ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వెంటనే వైద్యులు ప్రయాణికుల వద్దకు చేరుకునే సరికి ముగ్గురు మరణించారని, తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఒకరిని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారని తెలిపారు. నాన్ ఏసీ బోగీలో ప్రయాణిస్తున్న వీరు అధిక ఉష్ణోగ్రతల వల్లే చనిపోయినట్లు వార్తలు వస్తున్నప్పటికీ పోస్ట్‌మార్టం నివేదిక వస్తే కానీ అసలు కారణం తెలియదని చెప్పారు. కాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీలో మంగళవారం 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**ఉత్తరాదిలో భగ్గుమంటున్న ఎండలు**

ఉత్తరభారతంలో ఎండలు భగ్గుమంటున్నాయి. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో మంగళవారం దాదాపు 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజస్థాన్‌లోని చురూలో 47.3 డిగ్రీలు, శ్రీగంగానగర్‌లో 46.2 డిగ్రీలు నమోదైంది.

# బెంగాల్ ఆటబొమ్మ కాదు

## రాష్ట్రంతో బీజేపీ ఆడుకోలేదు

ఘర్షణల్లో చనిపోయినవారిలో 8 మంది తృణమూల్‌వారే

బెంగాల్‌ను గుజరాత్‌లా మార్చేందుకు కుట్రలు

బీజేపీపై ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

ధ్వంసమైన చోటే విద్యాసాగర్ నూతన విగ్రహం ఆవిష్కరణ



నూతనంగా ఏర్పాటుచేసిన విద్యాసాగర్ విగ్రహానికి నమస్కరిస్తున్న సీఎం మమతా బెనర్జీ


**కోల్‌కతా, జూన్ 11:** పశ్చిమ బెంగాల్ ఆటబొమ్మ కాదని, రాష్ట్రంతో బీజేపీ ఆడుకోలేదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా గత నెల లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోల్‌కతాలో నిర్వహించిన రోడ్ షో సందర్భంగా ప్రముఖ సాంఘిక సంస్కర్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ విగ్రహం ధ్వంసమైన నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ మంగళవారం అదే స్థానంలో నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. హేర్ స్కూల్ వద్ద విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం దాన్ని ఓపెన్ టాప్ జీపులో విద్యాసాగర్ కళాశాలకు తీసుకెళ్లి, పాత విగ్రహం ధ్వంసమైన చోటునే తిరిగి ఏర్పాటుచేశారు. అలాగే 8.5 అడుగుల విద్యాసాగర్ ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని కూడా కళాశాల ప్రాంగణంలో నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవులు, రచయితలు, మంత్రులు హాజరయ్యారు. అనంతరం మమత మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసలో 10 మంది చనిపోగా, అందులో 8 మంది తృణమూల్ కాంగ్రెస్‌కు చెందినవారేనని తెలిపారు. మిగిలిన ఇద్దరు బీజేపీకి చెందినవారని చెప్పారు. 'ప్రతి మరణం కూడా దురదృష్టకరం. విపత్తు సహాయ నిధి నుంచి 10 మంది బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందించాలని ప్రధాన కార్యదర్శిని కోరుతా' అని ఆమె పేర్కొన్నారు. అన్ని హత్యలపై విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. బెంగాల్‌ను గుజరాత్‌లా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, తాను జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం కానీ, ఆ ప్రయత్నాలను సఫలం కానివ్వబోనని స్పష్టంచేశారు. శనివారం సందేశ్‌ఖలి జిల్లాలో చోటుచేసుకున్న హింస నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠి సోమవారం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించిన విషయం తెలిసిందే. దీనిపై మమత అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను గవర్నర్ పదవిని గౌరవిస్తానని, అయితే ప్రతి పదవికీ రాజ్యాంగ పరిమితులు ఉంటాయని స్పష్టం చేశారు. బెంగాల్‌ను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రాన్ని, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకోవాలంటే అందరూ ఏకమవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ, కేంద్ర కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

**మమత ప్రసంగాలే ఆజ్యం పోశాయి**

సందేశ్ ఖలీ జిల్లాలో చోటుచేసుకున్న హింసకు మమతా బెనర్జీనే కారణమని బీజేపీ నేత ముకుల్ రాయ్ ఆరోపించారు. కాషాయ పార్టీ మద్దతుదారులపై దాడులకు ఆమె ప్రసంగాలు ఆజ్యం పోశాయని ధ్వజమెత్తారు. శనివారం నాటి ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన పార్టీ కార్యకర్తలు ప్రదీప్ మండల్, సుకంత మండల్ కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాను కోరుతామన్నారు. ఘర్షణలకు సంబంధించి ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు.

**కొనసాగుతున్న హింస**

బెంగాల్‌లో హింస కొనసాగుతూనే ఉంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న బాంబు పేలుళ్లలో ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో అధికార తృణమూల్‌పార్టీకి వారు ఓటు వేయడంతో బీజేపీ వారిని లక్ష్యంగా చేసుకున్నదని తృణమూల్ జిల్లా అధ్యక్షుడు జోతిప్రియ మాలిక్ ఆరోపించారు. అయితే కుటుంబ కక్షలతోనే ఈ ఘటన చేసుకుందని, రాజకీయాలకు సంబంధం లేదని బీజేపీ కొట్టివేసింది. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, తూర్పు బుర్ద్వాన్ జిల్లాలో దుండగులు జరిపిన దాడిలో తృణమూల్ కార్యకర్త మృతిచెందారు. మరోవైపు బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తల మృతదేహాలను చెట్లకు వేలాడదీయడం కలకలం రేపుతున్నది. హౌరా జిల్లాలోని సర్పోటా, అట్చత గ్రామాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వీరు జైశ్రీరాం సభల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, వీరి హత్యల వెనుక తృణమూల్ హస్తం ఉన్నదని బీజేపీ నేత అనుపమ్ మాలిక్ ఆరోపించారు.



## ప్రొటెం స్పీకర్‌గా వీరేంద్ర కుమార్

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ వీరేంద్ర కుమార్(65) లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్‌లోని తికమ్‌గఢ్ స్థానం నుంచి ఏడుసార్లు ఎంపీగా గెలిచిన ఈ దళిత నేతకు స్పీకర్ పదవి కేటాయించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తున్నది. కాగా 17వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 17 నుంచి 26 వరకు జరుగనున్నాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలుత ప్రొటెం స్పీకర్‌తో ప్రమాణం చేయిస్తారు. అనంతరం కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రొటెం స్పీకర్ నిర్వహిస్తారు. జూన్ 19న స్పీకర్ ఎన్నిక జరుగనున్నది. మేనకాగాంధీ, రాధామోహన్ సింగ్, అహ్లువాలియా, జువార్ ఓరామ్ కూడా స్పీకర్ పదవి పోటీలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ కాని బిజూ జనతాదళ్ లేదా శివసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి కేటాయించే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# రెండువేల కోట్ల స్కామ్

ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఐఎంఏ సంస్థ

ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సంస్థ యజమాని ఆడియో క్లిప్

కాంగ్రెస్ ఎమ్మెల్యే 400 కోట్లు తీసుకుని తిరిగి చెల్లించలేదని ఆరోపణ

సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన బాధితులు



మహమ్మద్ మన్సూర్ ఖాన్




బెంగళూరులోని ఐఎంఏ షోరూం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

**బెంగళూరు, జూన్ 11:** అధిక వడ్డీ ఆశజూపి ప్రజల నుంచి (ముఖ్యంగా ముస్లింల నుంచి) సుమారు రూ.2,000 కోట్లు సేకరించి బోర్డు తిప్పేసిన బెంగళూరుకు చెందిన 'ఐ మానెటరీ అడ్వైజరీ' (ఐఎంఏ) అనే ఇస్లామిక్ బ్యాంకింగ్, నగల సంస్థ యజమాని మహమ్మద్ మన్సూర్ ఖాన్ తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ఆడియో క్లిప్ ద్వారా పేర్కొనడం కలకలం రేపుతున్నది. దీంతో శివాజీనగర్ ప్రాంతంలోని ఐఎంఏ కార్యాలయం వద్దకు బాధితులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. సంస్థ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు మన్సూర్ ఆడియో క్లిప్‌లో పేర్కొన్నాడు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రోషన్ బేగ్ రూ.400 కోట్లు అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదని, పైగా తన మీదకు రౌడీలను పంపుతున్నాడని అందులో ఆరోపించారు. '12-13 ఏండ్లు శ్రమించి ఈ సంస్థను నిర్మించాను. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో అవినీతి నెలకొని ఉంది. అధికారులు, రాజకీయ నాయకులకు లంచాలు ఇవ్వాల్సి వస్తున్నది. రోషన్ బేగ్ డబ్బు తిరిగి చెల్లించలేదు. పైగా నా ఆఫీసుకు, ఇంటికి రౌడీలను పంపుతున్నాడు. చంపేస్తానని బెదిరిస్తున్నాడు. ఓ గ్రామంలో నా కుటుంబంతో కలిసి దాక్కోవాల్సి వచ్చింది' అని నగర కమిషనర్‌ను ఉద్దేశించి ఆడియోలో మన్సూర్ పేర్కొన్నాడు. ఈ ఆడియో ప్రజలకు చేరే సరికి తాను బతికి ఉండనని, రూ.500 కోట్ల విలువైన తన ఆస్తిని విక్రయించి, బాధితులకు తిరిగి చెల్లించాలని కోరాడు. సోమవారం సామాజిక మాధ్యమాల్లో ఈ ఆడియో వైరల్ కావడంతో గంటల వ్యవధిలోనే సుమారు 3700 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. మంగళవారం తుమకూరు, మాండ్య, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బెంగళూరుకు చేరుకుని ఆందోళనలకు దిగారు. అయితే ఆ ఆడియో క్లిప్‌లో ఉన్న వాయిస్ మన్సూర్‌దేనా కాదా అన్నది నిర్ధారణ కాలేదు. కంపెనీ కూడా దీనిపై స్పందించకపోవడంతో బాధితుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అతడు బతికే ఉన్నాడా అనేదానిపైనా స్పష్టత లేదు.

**మన్సూర్‌పై లుక్ ఔట్ నోటీసులు**

మన్సూర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో లుక్ ఔట్ నోటీసులు జారీచేసినట్లు చెప్పారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను రోషన్ బేగ్ ఖండించారు. ఐఎంఏతో తనకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు తన ప్రత్యర్థులు ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. మన్సూర్ ఖాన్‌తో కలిసి సీఎం కుమారస్వామి భోజనం చేస్తున్న ఫొటోను బీజేపీ రాష్ట్ర శాఖ ట్విట్టర్‌లో పోస్టు చేయడంతో ఈ వ్యవహారం రాజకీయ మలుపు తిరిగింది. మరోవైపు ఈ కేసుపై సీఎం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేశారు.

## నేడు కేంద్ర మంత్రి మండలి తొలి సమావేశం

**న్యూఢిల్లీ, జూన్ 11:** కేంద్రంలో కొలువుదీరిన కొత్త మంత్రి మండలి తొలి సమావేశం బుధవారం జరుగనున్నది. దేశ అభివృద్ధికి సంబంధించిన లక్ష్యాలపై ప్రధాని మోదీ ఈసందర్భంగా దిశానిర్దేశం చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 17 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సహాయ మంత్రులు లిఖితపూర్వకంగా సమాధానాలు ఇవ్వవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంత్రి మండలి భేటీలో ముఖ్యంగా సహాయ మంత్రులను క్రియాశీలకం చేసేందుకు వారికి పలు కీలక బాధ్యతలను అప్పగించాలని క్యాబినెట్ మంత్రులకు మోదీ సూచించనున్నారు. ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికపైనా చర్చించనున్నారు.

## 2024 నాటికి అందరికీ స్వచ్ఛమైన తాగునీరు

లక్ష్యంగా నిర్దేశించుకున్న కేంద్ర ప్రభుత్వం: గజేంద్ర సింగ్



**న్యూఢిల్లీ:** దేశ ప్రజలందరికీ 2024 నాటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మంగళవారం వెల్లడించారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఇప్పటికీ సుమారు 14 కోట్ల కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం లేదని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం నిర్దేశిత లక్ష్యానికి 5 శాతం కంటే తక్కువగా ఉందని చెప్పారు. దేశవ్యాప్తంగా 81 శాతం ఆవాసాలకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నదన్నారు. అయితే ఈ పథకాన్ని అధికారికంగా ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. నీరు అనేది రాష్ట్ర జాబితాలోని అంశమైనందున.. ఈ మిషన్ విజయవంతం కావాలంటే ఆయా రాష్ట్రాల భాగస్వామ్యం కీలకం కానున్నది. జల సంబంధిత అంశాలపై ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులతో మంత్రి షెకావత్ చర్చలు జరిపారు.

# విశాల్ విడుదల నిరాశ పరిచింది

కరువా కేసులో తీర్పుపై దర్యాప్తు బృందం అధిపతి ఆర్కే జల్లా అసంతృప్తి

జమ్ముకశ్మీర్ పోలీసులు హైకోర్టులో అప్పీల్ చేయాలని సూచన



**జమ్ము:** కథువా కేసులో సోమవారం వెలువడిన తీర్పు సంతృప్తికరంగా ఉన్నా.. ప్రధాన నిందితుడు సాంజీరామ్ కొడుకు విశాల్‌ను సంశయ లాభం కింద నిర్దోషిగా విడుదల చేయడం నిరాశ కలిగించిందని మాజీ ఐపీఎస్ అధికారి ఆర్కే జల్లా పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ పోలీసులు ఈ విషయంలో హైకోర్టులో అప్పీల్ చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన జమ్ముకశ్మీర్‌లోని కథువాలో ఎనిమిదేండ్ల బాలికపై లైంగిక దాడి, హత్య కేసు దర్యాప్తు ఆయన నేతృత్వంలోనే జరిగింది. జల్లా ఈ ఏడాది మార్చి 31న పదవీ విరమణ చేశారు. ఈ కేసులో ముగ్గురికి జీవితకాల ఖైదు, మరోముగ్గురికి ఐదేండ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం పఠాన్‌కోట్ కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. మరో నిందితుడు విశాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆర్కే జల్లా మీడియాతో మాట్లాడారు. తమ దర్యాప్తు జరిగిన తీరును వివరించారు. 'ఈ కేసును మాకు 2018 జనవరి 27న అప్పగించారు. ముందుగా నేను నా బృందంతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించాం. ఆ తర్వాత ప్రధాన నిందితుడు సాంజీరామ్ ఇంటికి వెళ్లాం. కొడుకు విశాల్ గురించి అడుగగానే సాంజీరామ్ నుదుటిపై చెమట పట్టింది. సాంజీరామ్ గంభీరంగా మాట్లాడుతూ.. నా కొడుకు మీరట్‌లో చదువుకుంటున్నాడు. కావాలంటే కాల్ రికార్డ్స్ చెక్‌చేసుకోండి అని చెప్పాడు' అని జల్లా గుర్తుచేసుకున్నారు. సాంజీరామ్ మాటలు విన్నవెంటనే తనకు రెండు అనుమానాలు వచ్చాయన్నారు. 1. జనవరిలో అంత చలిలోనూ సాంజీరామ్‌కు ఎందుకు చెమట పట్టింది? 2.కొడుకు గురించి అడుగగానే మామూలుగా సమాధానం ఇవ్వకుండా కాల్ రికార్డ్స్ చెక్ చేసుకోండి అని ఆందోళనగా ఎందుకు అన్నారు?. ఈ రెండు ప్రశ్నల ఆధారంగా కూపీ లాగానని జల్లా పేర్కొన్నారు.

## మానస సరోవర్ యాత్ర ప్రారంభం

ఈ యాత్ర భారత్, చైనా స్నేహాన్ని బలోపేతం చేస్తుందన్న జైశంకర్



మానస సరోవర్ యాత్రికులతో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, జూన్ 11:** హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కైలాస మానస సరోవర్ యాత్ర మంగళవారం ఆరంభమైంది. ఉత్తరాఖండ్‌లోని లిపులేక్ మార్గంలో సాగే ఈ యాత్ర తొలి బృందానికి కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ ఢిల్లీలో లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ తీర్థయాత్ర భారత్, చైనా మధ్య స్నేహాన్ని బలోపేతం చేయడంతోపాటు ఇరు దేశాల ప్రజలు ఒకరికొకరు అర్థం చేసుకునేందుకు దోహపడుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. చైనా రాయబారిగా ఉన్నప్పుడు ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించినట్లు జైశంకర్ తెలిపారు. ఈ యాత్రను నిర్వహించే చైనాతోపాటు ఢిల్లీ, సిక్కిం, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు, పలువురు మంత్రులు, ఏజెన్సీలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఈ ఏడాది కైలాస్ మానస సరోవర్ యాత్రకు 2996 దరఖాస్తులు అందాయని ఆయన వెల్లడించారు. 2256 మంది పురుషులు, 740 మంది మహిళలు ఈ పవిత్ర యాత్రకు దరఖాస్తు చేసినట్లు వివరించారు. వీరిలో 624 మంది వృద్ధులు ఉన్నట్లు తెలిపారు. కైలాస్ మానస సరోవర్ యాత్ర రెండు మార్గాల్లో సాగనుంది. ఉత్తరాఖండ్‌లోని లిపులేక్ మార్గంలో 60 మంది చొప్పున 18 సమూహాలు, సిక్కింలోని నాథులా మార్గంలో 50 మంది చొప్పున 10 బృందాలు వెళ్తాయని ఆయన తెలిపారు.



## మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిత్య ఠాక్రే పోటీ!

**ముంబై, జూన్ 11:** శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, ఆ పార్టీ యువజన విభాగం అధిపతి ఆదిత్య ఠాక్రే ఎన్నికల రాజకీయాల్లోకి రంగప్రవేశం చేయనున్నారు. త్వరలో జరుగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వర్లి లేదా మాహీం నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం. అయితే ఆదిత్య పోటీని శివసేన ధ్రువీకరించనప్పటికీ ఏ నిర్ణయమైనా ఉద్ధవ్ ఠాక్రే తీసుకుంటారని తెలిపింది. మరోవైపు ఆదిత్య అరంగేట్రంపై యువసేన నాయకుడు వరుణ్ సర్దేశాయ్ ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేస్తూ 'ఆదిత్య ఠాక్రే కోసం మహారాష్ట్ర వేచిచూస్తున్నది. ఇది ఒక మంచి అవకాశం. దీన్ని ఆయన ఉపయోగించుకోవాలి' అని పేర్కొన్నారు.

# అంతరిక్ష రక్షణ సంస్థ

ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ, జూన్ 11:** అంతరిక్షంలో భారత ప్రయోజనాల పరిరక్షణకు, అంతరిక్ష యుద్ధాల ముప్పును ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన నూతన అంతరిక్ష రక్షణ సంస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతరిక్షంలో భారత సంపదను కాపాడే విస్తృత వేదికలను, గ్రహపథ ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది. రక్షణరంగ కోణంలో అంతరిక్షాన్ని ఉపయోగించుకోవడానికి సంబంధించిన పరిశోధనను చేపట్టేందుకు ఓ అంతరిక్ష పరిశోధన సంస్థను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అధికార వర్గాలు తెలిపాయి. ఉపగ్రహ విధ్వంసక క్షిపణి ఏశాట్‌ను విజయవంతంగా ప్రయోగించిన రెండు నెలల అనంతరం ప్రభుత్వం అంతరిక్ష రక్షణ సంస్థ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నది. అంతరిక్షంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరంపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ నేతృత్వంలో గత ఏప్రిల్‌లో జరిగిన డిఫెన్స్ ప్లానింగ్ కమిటీలో కూలంకషంగా చర్చించామని ఆ అధికారి తెలిపారు.

**త్వరలో కొత్త కార్మిక చట్టం**

ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు, పెట్టుబడిదారులకు సహకారంగా ఉండేందుకు గాను మోదీ ప్రభుత్వం ఓ నూతన కార్మికచట్టాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. కొత్త చట్టంలో ప్రస్తుతమున్న 44 కార్మిక చట్టాలను నాలుగు క్యాటగిరీలుగా విభజించి విలీనం చేయనున్నారు. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత- సంక్షేమం, పారిశ్రామిక సంబంధాల వారీగా చట్టాన్ని విభజించనున్నారు. మరోవైపు, మైనారిటీలకు చెందిన ఐదు కోట్ల మంది విద్యార్థులకు పలురకాల స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నామని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వెల్లడించారు. ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్‌తోపాటు యోగ్యత ఆధారంగా ఇచ్చే స్కాలర్‌షిప్‌లలో బాలికలకు 50 శాతం అందజేస్తామని పేర్కొన్నారు.

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 3 | 3 | 0 | 0 | +2.16 | 6 |
| 2. | ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | +1.30 | 4 |
| 3. | భారత్ | 2 | 2 | 0 | 0 | +0.53 | 4 |
| 4. | ఆస్ట్రేలియా | 3 | 2 | 1 | 0 | +0.48 | 4 |
| 5. | శ్రీలంక | 4 | 1 | 1 | 2 | -1.51 | 4 |
| 6. | వెస్టిండీస్ | 3 | 1 | 1 | 1 | +2.05 | 3 |
| 7. | బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.71 | 3 |
| 8. | పాకిస్థాన్ | 3 | 1 | 1 | 1 | -2.41 | 3 |
| 9. | దక్షిణాఫ్రికా | 4 | 0 | 3 | 1 | -0.95 | 1 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 3 | 0 | 3 | 0 | -1.49 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

వరల్డ్ కప్‌లో నేడు | ఆస్ట్రేలియా X పాకిస్థాన్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **260** షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు **8** ఫెర్గూసన్ (న్యూజిలాండ్)

# కళ తప్పుతున్నదా..!

రెండు దశాబ్దాల తర్వాత ప్రపంచకప్ నిర్వహించే చాన్స్ దక్కించుకున్న ఇంగ్లండ్.. అద్వితీయ ఆతిథ్యంతో ఆకట్టుకోవాలని టోర్నీని వేసవికాలంలో ప్లాన్ చేసింది. గత నాలుగు ప్రపంచకప్‌లు ఏప్రిల్ నెలాఖరులోగానే ముగిస్తే.. ఇంగ్లండ్ మాత్రం అందుకు భిన్నంగా స్థానిక వాతావరణం ప్రకారం ఎండాకాలం ప్రారంభమయ్యాక మే నెలాఖరున మెగాటోర్నీ మొదలెట్టింది. వాస్తవానికి ఇంగ్లండ్‌లో ఇది మాంచి ఎండాకాలం. భానుడి భగభగలతో ప్రజలు అల్లాడాల్సిన సమయం. కానీ అందుకు విరుద్ధంగా భారీ వర్షాలు దంచి కొడుతుండటంతో నిర్వాహకులు సైతం నిశ్చేష్టులవుతున్నారు. ఆరంభంలోనే ఏకపక్ష మ్యాచ్‌లతో మెగాటోర్నీ పెద్దగా ఆసక్తి పుట్టించలేకపోగా.. హాట్ ఫేవరెట్ టీమ్ఇండియా వారం తర్వాత బరిలో దిగి రెండు మంచి మ్యాచ్‌లు ఆడి కాస్త వేడి పుట్టించిందో లేదో ఇప్పుడు వాతావరణం రూపంలో ఎదురుదెబ్బ పడింది.


బ్రిస్టల్ స్టేడియం

### ఏ ప్రపంచకప్ ఎప్పుడు

**2015** ఆస్ట్రేలియా వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫిబ్రవరి 14 నుంచి మార్చి 29 వరకు జరిగింది.

**2011** భారత్ వేదికగా జరిగిన టోర్నీ ఫిబ్రవరి 19న ప్రారంభమై.. ఏప్రిల్ 2న ముగిసింది.

**2007** వెస్టిండీస్‌లో జరిగిన ఈ టోర్నీ మార్చి 13 నుంచి ఏప్రిల్ 28 వరకు సాగింది.

**2003** దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన మెగాటోర్నీ ఫిబ్రవరి 9న మొదలై.. మార్చి 23న ముగిసింది.

## రెండు వారాల్లో మూడు రద్దు

బ్రిస్టల్ వేదికగా జరిగిన పాకిస్థాన్, శ్రీలంక మ్యాచ్‌కు అడ్డుపడ్డ వరణుడు ఆట రద్దయ్యేంతవరకు శాంతించలేదు. మెగాటోర్నీలో ఓ మ్యాచ్ రద్దుకావడం పెద్ద విషయం కాదని వదిలేసేలోపే.. ఐసీసీ టోర్నమెంట్లలో దురదృష్టం జేబులో పెట్టుకొని తిరిగే దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు ఆటంకం కలిగించాడు. సౌతాంప్టన్ వేదికగా వెస్టిండీస్‌తో సోమవారం జరగాల్సిన మ్యాచ్ కూడా వాన కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. ఫలితంగా దక్షిణాఫ్రికా పాయింట్ల పట్టికలో ఖాతా తెరవనైతే తెరిచింది కానీ.. సెమీస్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు పూర్తిచేసుకున్న సఫారీలు కేవలం ఒక్క పాయింటే సాధించారు. ఇక్కడి నుంచి ముందుకెళ్లాలంటే మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లోనూ తప్పక గెలిచి తీరాల్సిందే. తాజాగా మంగళవారం శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మధ్య మ్యాచ్‌కు ఈ ఇబ్బందే ఎదురైంది. కనీసం టాస్ కూడా వేయకుండానే మ్యాచ్ రద్దైంది. వరణుడు లంక మ్యాచ్‌ను అడ్డుకోవడం టోర్నీలో ఇది రెండోసారి కాగా.. రెండు సార్లు వేదిక బ్రిస్టలే.

**కోహ్లీసేనకూ వర్షం ముప్పే**
టాంటన్ వేదికగా బుధవారం జరగాల్సిన ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మ్యాచ్‌కు కూడా వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు మెండుగా ఉంటే.. గురువారం భారత్, న్యూజిలాండ్ తలపడనున్న నాటింగ్‌హమ్ (ట్రెంట్‌బ్రిడ్జ్)లో కుండపోతకు ఆస్కారమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే నాటింగ్‌హమ్‌లో పసుపు రంగు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మరో వారం పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టంచేసింది. వర్షం తెరిపినిచ్చినా 10 డిగ్రీల ఉష్ణోగ్రతే నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో మరో రెండు మ్యాచ్‌లు వర్షార్పణమయ్యే సూచనలున్నాయి.

**ఏమైందీ విశ్వసమరానికి..**
**ఓ వైపు వర్షాలు..**
**మరో వైపు గాయాలు.**
**అసలే వన్డేలపై ఆసక్తి తగ్గుతున్న తరుణంలో ఏమిటీ విధి వైపరిత్యం.**

**టోర్నీ ఆరంభంలోనే దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ డెల్ స్టెయిన్ గాయంతో దూరమైతే.. అతని బాటలోనే పేసర్ లుంగి ఎంగ్డీ కూడా అందుబాటులో లేకుండా పోయాడు. అంతకుముందే మరో బౌలర్ నోర్ట్జే సేవలు కోల్పోయిన సఫారీలను వరుణుడు కూడా కరుణించలేదు. మొదటి మూడు మ్యాచ్‌లు ఓడిన సఫారీలకు వెస్టిండీస్‌తో నాలుగో మ్యాచ్‌లో వర్షం రూపంలో బలమైన ఎదురుదెబ్బ తగిలింది. ఈ తంతు కేవలం సఫారీలకే పరిమితం కాలేదు. శ్రీలంక పేసర్ నువాన్ ప్రదీప్.. ఆఫ్ఘనిస్థాన్ కీపర్ అహ్మద్ షహజాద్.. ఆస్ట్రేలియా పేసర్ జే రిచర్డ్‌సన్, ఆల్‌రౌండర్ స్టొయినిస్.. ఇంగ్లండ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్.. విండీస్ డేంజర్ మ్యాన్ ఆండ్రీ రస్సెల్.. ఇలా గాయపడ్డవారి జాబితా చాంతాడంత ఉంది. తాజాగా ఓపెనర్ శిఖర్ ధవన్ వేలి గాయం టీమ్ ఇండియాను కలవరపాటుకు గురిచేస్తున్నది. పొట్టి క్రికెట్ మాయలో పోటీ క్రికెట్ వెనుకబడిపోతున్న సమయాన ప్రపంచకప్‌తోనైనా వన్డేలకు జవసత్వాలు నింపుదామంటే వాతావరణం కారణంగా అదీ సాధ్యపడేలాలేదు.**


ధవన్


కార్డిఫ్ స్టేడియం

## వరుణుడే విజేత

**బ్రిస్టల్:** ప్రపంచకప్‌లో వరుణుడి జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మెగాటోర్నీలో వరుసగా రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య మంగళవారం మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే ముగిసింది. మూడు మ్యాచ్‌ల్లో చెరో విజయంతో బరిలోకి దిగాలనుకున్న లంక, బంగ్లా ఆశలపై వరుణుడు నీళ్లు గుమ్మరించాడు. ఎడతెరిపి లేని వర్షంతో ఆటకు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్ దక్కింది.

## విశ్వసమరానికి ధవన్ దూరం!

**నాటింగ్‌హమ్:** భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఐసీసీ టోర్నీల్లో విజృంభించి ఆడే ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ శిఖర్ ధవన్ గాయం కారణంగా రానున్న మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో అద్వితీయ శతకంతో విజృంభించిన ఈ లెఫ్ట్‌హ్యాండర్.. అదే మ్యాచ్‌లో ప్యాట్ కమ్మిన్స్ వేసిన బౌన్సర్‌ను అడ్డుకునే క్రమంలో గాయపడ్డాడు. ఎడమ చేతి బొటనవేలుకు బంతి బలంగా తాకడంతో ఫీల్డింగ్‌కు రాకుండా డ్రెస్సింగ్‌రూమ్‌కే పరిమితమయ్యాడు. తాజా వైద్యపరీక్షల్లో అతడి బొటనవేలి ఎముకలో సన్నటి చీలిక వచ్చినట్లు తేలింది. ప్రస్తుతానికైతే మూడు మ్యాచ్‌లకే దూరమవుతాడు అని అంటున్నా.. అతడికి కనీసం మూడు వారాల విశ్రాంతి అవసరమనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో వరల్డ్‌కప్‌లో ధవన్ ధనాధన్ ఇన్నింగ్స్‌లు చూసే అవకాశం లేనట్లే కనిపిస్తున్నది.

### ఆఫ్ఘన్‌తో పోరు వరకు రెడీ!

పది రోజుల తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు వరకు అతడు కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నది. ఒకవేళ ఆ మ్యాచ్‌కు అందుబాటులోకి రాకున్నా మరో ఆరు రోజుల తర్వాత వెస్టిండీస్ మ్యాచ్ వరకైనా అతడు కోలుకుంటే చాలని భావిస్తున్నది. తొందరపడి ప్రత్యామ్నాయ ఆటగాడిని పిలిపిస్తే.. కోహ్లీసేన సెమీస్ చేరితే అప్పటికి గాయం తీవ్రత తగ్గిన ధవన్ అందుబాటులో లేకుండా పోతాడు. అందుకే ఆచితూచి నిర్ణయం తీసుకోనుంది. వైద్యులు అధికారికంగా నెల రోజుల విశ్రాంతి అవసరం అని తేల్చితే తప్ప ధవన్‌కు ప్రత్యామ్నాయంపై బోర్డు దృష్టిపెట్టేలాలేదు. ప్రస్తుతానికి జట్టులో లోకేశ్ రాహుల్ రూపంలో స్పెషలిస్ట్ ఓపెనర్ ఉండటం టీమ్ఇండియాకు ఊరటనిచ్చే అంశం. న్యూజిలాండ్, పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో రోహిత్ శర్మతో కలిసి రాహుల్ ఓపెనర్‌గా రావడం ఖాయమే. నాలుగో స్థానంలో దినేశ్ కార్తీక్, విజయ్ శంకర్‌ల్లో ఎవరికి అవకాశం ఇస్తారో చూడాలి. వరల్డ్‌కప్ జట్టు ప్రకటించిన సమయంలో సెలెక్షన్ కమిటీ అంబటి రాయుడు, రిషభ్ పంత్‌ను స్టాండ్‌బైగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే.




## స్టొయినిస్ స్థానంలో మిచెల్ మార్ష్


స్టొయినిస్

ఆస్ట్రేలియా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ పక్కటెముకల గాయంతో పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. భారత్‌తో మ్యాచ్‌లో గాయపడ్డ స్టొయినిస్‌కు బ్యాకప్‌గా మరో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌ను రప్పిస్తున్నట్లు ఆసీస్ కెప్టెన్ ఫించ్ తెలిపాడు. 'అతడు ఎప్పటివరకు అందుబాటులో ఉండడనే విషయంపై స్పష్టత లేదు. అందుకే ముందు జాగ్రత్తగా మిచెల్ మార్ష్‌ను రప్పిస్తున్నాం. ఇప్పుడే అతడిని జట్టులోకి తీసుకోబోము. వైద్యుల నివేదిక అందిన తర్వాతే నిర్ణయం తీసుకుంటాం'అని ఫించ్ అన్నాడు. గాయపడ్డ ఆటగాళ్ల స్థానంలో కొత్తవారిని ఎంచుకునే అవకాశం ఐసీసీ అన్ని జట్లకు కల్పించింది. కానీ ఆ ఆటగాడు తర్వాత పూర్తి ఫిట్‌నెస్ సాధించి తిరిగి జట్టులోకి వచ్చే చాన్స్ లేకపోవడంతో తమ మేటి ఆటగాళ్ల పట్ల టీమ్‌లు ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. మరోవైపు ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా ఆసీస్ ఓపెనర్ వార్నర్ కొట్టిన బంతి తలకు తాకి గాయపడ్డ భారత సంతతి బౌలర్ జై కిషన్ కోలుకున్నాడు

## బెయిల్స్ మార్చం: ఐసీసీ



**లండన్:** ప్రపంచకప్‌లో తీవ్ర చర్చకు తావిస్తున్న 'జింగ్' బెయిల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) స్పష్టతనిచ్చింది. మెగాటోర్నీ మధ్యలో ఎలాంటి మార్పులు చేయబోమని.. ఏదేమైనా అందరూ అవి వాడాల్సిందేనని తేల్చి చెప్పింది. 'గత వరల్డ్‌కప్ నుంచి అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఇవే బెయిల్స్ వినియోగిస్తున్నాం. అప్పుడు లేని సమస్య ఇప్పుడే ఎందుకు తలెత్తుతున్నది. అదంతా ఆటలో భాగమే. టోర్నమెంట్ మధ్యలో మార్పులు చేయం. అన్ని జట్లు అదే సరంజామతో ఆడుతున్నాయి' అని ఐసీసీ మంగళవారం తెలిపింది. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే పలుమార్లు బంతి వికెట్లను తాకినా బెయిల్స్ పడకపోవడంపై సర్వత్రా చర్చ జరగుతున్నది. లైట్లు వెలిగేందుకు వీలుగా బెయిల్స్ మధ్యలో వైర్లు అమర్చడం వల్ల బరువు పెరిగి బెయిల్స్ పడటం లేదనే అభిప్రాయాలు ఎక్కువవుతున్నాయి. ఆసీస్‌తో మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, కంగారూ సారథి అరోన్ ఫించ్ ఈ అంశంపై ఫిర్యాదు చేశారు.

## పైచేయి ఎవరిది?

నేడు
ఆస్ట్రేలియా, పాకిస్థాన్ ఢీ

**టాంటన్ :** ప్రపంచకప్‌లో అతిథ్య ఇంగ్లండ్‌ను ఖంగు తినిపించి మంచి ఊపుమీద ఉన్న పాకిస్థాన్... డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా తో బుధవారం తలపడనుంది. తొలి మ్యాచ్‌లో విండీస్‌పై తడబడ్డా.. ఆ తర్వాత ఇంగ్లిష్ జట్టుపై గెలిచి పాక్ ఆత్మ విశ్వాసంతో ఉంది. శ్రీలంకతో మ్యాచ్ రద్దు కారణంగా పాక్ ఖాతాలో మూడు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టోర్నీని ఘనంగా ఆరంభించినా.. భారత్ చేతిలో పరాజయంతో కాస్త నిరాశలో ఉంది. మరి టాంటన్ వేదికగా జరుగనున్న మ్యాచ్‌లో పాక్‌ను ఓడించి ఆసీస్ మళ్లీ గెలుపుబాట పడుతుందేమో చూడాలి.

**బ్యాటింగే బలం:** ఆస్ట్రేలియా, పాకిస్థాన్ రెండు జట్లకు ప్రధాన బలం బ్యాటింగే. ఆసీస్ బ్యాట్స్‌మెన్ వార్నర్, స్మిత్.. ఆఫ్ఘనిస్థాన్ మ్యాచ్‌లో మినహా రెండింటిలోనూ అర్ధశతకాలు చేసి జోరు మీదున్నారు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో 92 పరుగులతో గెలుపులో కౌల్టర్‌నైల్ కీలకపాత్ర పోషించాడు. అయితే, గాయ పడ్డ స్టొయినిస్ స్థానంలో ఈ మ్యాచ్‌కు షాన్ మార్ష్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది.


ఫించ్ | సర్ఫరాజ్

**వర్షం ముప్పు...**
టోర్నీలో ఇప్పటికే మూడు మ్యాచ్‌లు వర్షార్పణం కాగా... ఈ మ్యాచ్‌కు కూడా వరుణుడి ప్రమాదం పొంచి ఉంది. ఆకాశం మేఘావృతమై.. వాన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. టాంటన్ పిచ్, వాతావరణ పరిస్థితులు పేసర్లకు ఎక్కువగా అనుకూలించే అవకాశం ఉంది.

**ముఖాముఖి**

| | |
|---|---|
| ఆడిన మ్యాచ్‌లు | 9 |
| ఆస్ట్రేలియా గెలిచినవి | 5 |
| పాకిస్థాన్ గెలిచినవి | 4 |


హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మంగళ వారం అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర క్రీడా మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు

### అంతర్జాతీయ తైక్వాండో పోటీలు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో రెండో అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్య ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే అవసరమని గుర్తు చేశారు. టోర్నీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి ప్రభాత్‌కుమార్ శర్మ, రాష్ట్ర తైక్వాండో సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభినందన్‌ను కించపరిచేలా..

వీడియో రూపొందించిన పాక్ చానల్



**న్యూఢిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటేనే ఎన్నో భావోద్వేగాలతో ముడిపడిన అంశం. ఇరు దేశాల ఆటగాళ్లు, ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. ఇక ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో అయితే చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మ్యాచ్ సందర్భంగా టీవీల్లో అనేక ప్రత్యేక ప్రకటనలు కనిపిస్తాయి. ఈనెల 16న భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన వీడియో దాయాది నైజాన్ని బయటపెట్టింది. పాక్ ఎయిర్‌ఫోర్స్ దాడులను తిప్పికొట్టే క్రమంలో భారత వింగ్‌కమాండర్ అభినందన్ వర్ధమాన్ కనబరిచిన పరాక్రమాన్ని తక్కువ చేసి చూపించింది. పాక్ సైన్యానికి పట్టుబడిన తర్వాత అక్కడి అధికారులు అడిగిన ప్రశ్నలకు ఏ మాత్రం వెరవకుండా గుండె నిబ్బరంతో అభినందన్ సమాధానమిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇదే వీడియోను అనుసరిస్తూ పాక్‌కు చెందిన జాజ్ అనే చానల్ ఒక ప్రకటన రూపొందించింది. ఇందులో వర్ధమాన్‌ను పోలి ఉండే వ్యక్తి అదే రకమైన మీసకట్టుతో టీమ్ఇండియా జెర్సీ వేసుకుని చాయ్ తాగుతూ ఉంటాడు. టాస్ గెలిస్తే టీమ్ఇండియా అనుసరించే వ్యూహాలేంటి అన్న ప్రశ్నకు స్పందిస్తూ 'క్షమించండి..నేను ఆ విషయాలు చెప్పకూడదు' అని సమాధానమిస్తాడు. ఈ ప్రకటన అభినందన్‌ను గుర్తు చేసేలా ఉన్నా..సదరు వ్యక్తిని నలుపు రంగులో చూపించిన జాజ్ చానెల్ జాత్యాంహకర ధోరణిని ప్రదర్శించింది.

## సొగసైన బ్యాటింగ్ యువీదే: అక్తర్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టీమ్ఇండియా ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌పై పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ప్రశంసలు కురిపించాడు. 'యువీ... ఓ రాక్‌స్టార్, ఓ మ్యాచ్ విన్నర్, నాకు మంచి మిత్రుడు. యువరాజ్ కంటే సొగసైన, తెలివైన లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌మన్ భారత్‌కు మరొకరు దొరుకుతారని నేను అనుకోవడం లేదు. అతడు చాలా సులువుగా, ధాటిగా ఆడగలడు. 2003 ప్రపంచకప్‌లో భాగంగా సెంచూరియన్‌లో జరిగిన మ్యాచ్‌లో అతడిని మొదటిసారి చూశా. క్రికెట్‌పై అతడికి ఉన్న జ్ఞానానికి ఫిదా అయ్యా. ఆరు బంతులను యువీ ఆరు సిక్సర్లుగా మలిచిన వైనం నమ్మశక్యం కానిది.' అని అక్తర్ అన్నాడు.

## ఫోర్బ్స్‌జాబితాలో కోహ్లీ

**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఎక్కువ మొత్తంలో ఆదాయాన్ని ఆర్జిస్తున్న క్రీడాకారుల జాబితా ఫోర్బ్స్-2019లో భారత్ నుంచి కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక్కడే మరోసారి స్థానం దక్కించుకున్నాడు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ జాబితాలో అగ్రస్థానాన్ని సంపాదించగా, కోహ్లీ 100వ స్థానంలో ఉన్నాడు. ప్రకటనల ద్వారా 21 మిలియన్ డాలర్లు... వేతనం, ప్రోత్సాహకాల ద్వారా 4 మిలియన్ డాలర్లు... మొత్తం 25 మిలియన్ డాలర్ల(రూ.173 కోట్లు)ను కోహ్లీ గత 12 నెలల్లో సంపాదించాడని ఫోర్బ్స్ వెల్లడించింది. గతేడాది 83వ ర్యాంకులో ఉన్న విరాట్ ఈసారి 100కు పడిపోయాడు.


జాతీయ యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ కాంస్య విజేత నైనా జైస్వాల్‌కు మంగళవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,950 | 11,966 |
| ↗166 | ↗43 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 62.59 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 33,370 |
| 22 క్యారెట్లు | 33,200 |
| వెండి (కిలో) | 37,560 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.40 | 71.90 |
| యూరో | 75.10 | 83.10 |
| బహ్రెయిన్ దినార్ | 174.70 | 188.70 |
| కువైట్ దినార్ | 219.00 | 234.00 |
| సౌదీ రియాల్ | 17.30 | 19.10 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.40 |

**చికెన్ ధరలు**

(రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 130.00 |
| రిటైల్ లైవ్ | 152.00 |
| డ్రెస్డ్ | 220.00 |
| స్కిన్‌లెస్ | 251.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

(రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 365-00 |
| రంగారెడ్డి | 365-00 |
| మెదక్ | 365-00 |
| కరీంనగర్ | 368-00 |
| వరంగల్ | 368-00 |
| రిటైల్ ప్రైస్ | 4-25 |

# నీరవ్ సెల్ సిద్ధం

## ముంబై జైలులో బ్యారక్ నెం.12ను రెడీ చేసిన అధికారులు



**ముంబై/లండన్, జూన్ 11:** నీరవ్ మోదీని భారత్‌కు అప్పగిస్తే ఉంచేందుకు జైలు గది సిద్ధమైంది. ముంబైలోని ఆర్థర్ రోడ్డు జైలులో కట్టుదిట్టమైన భద్రత ఉన్న 'బ్యారక్ నెం.12'ను అధికారులు రెడీ చేశారని మంగళవారం మహారాష్ట్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. గత వారం జైళ్ల శాఖ.. ఆర్థర్ రోడ్డు కారాగారం స్థితిగతులను, అందులోని సదుపాయాలను రాష్ట్ర హోం శాఖకు తెలియపరిచింది. ఈ క్రమంలోనే నీరవ్‌ను అప్పగిస్తే అత్యంత భద్రత కలిగిన బ్యారక్ నెంబర్ 12లో పెట్టవచ్చని సదరు అధికారి పేర్కొన్నారు. ఇటీవలే ఈ విషయాన్ని కేంద్రానికి కూడా వివరించినట్లు ఆయన చెప్పారు. ఈ ఏడాది మార్చి 19న లండన్‌లో నీరవ్ మోదీని స్కాట్లాండ్ యార్డ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అక్కడి వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు నీరవ్‌ను భారత్‌కు అప్పగింత కేసును విచారిస్తున్న సంగతీ విదితమే. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.14,000 కోట్లు మోసం చేసిన కేసులో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. నీరవ్ మేనమామ, రత్నాల వర్తకుడు మెహుల్ చోక్సీ సైతం ఈ కుంభకోణంలో కీలక నిందితుడే. బ్యాంక్ అధికారుల పాత్ర కూడా ఉండగా, మోసపూరితంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూలు) జారీతో వేల కోట్లను కొల్లగొట్టారు.


### ఒకే గదిలో మాల్యా, నీరవ్?

బ్యారక్ నెంబర్ 12లో రెండు గదులున్నాయని, ఒక గదిలో ముగ్గురిని ఇప్పటికే ఉంచినందున, మరో గదిలో నీరవ్‌ను పెడుతామని అధికారులు తెలిపారు. అయితే విజయ్ మాల్యా అప్పగింత కేసు విచారణ సందర్భంగా కూడా అధికారులు ఇదే బ్యారక్‌లో గదిని సిద్ధం చేశామని కోర్టుకు చెప్పడంతో మాల్యా, నీరవ్‌లను ఒకే గదిలో ఉంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### నాలుగోసారి బెయిల్ కోసం..

బెయిల్ కోసం నీరవ్ మోదీ మరోసారి దరఖాస్తు చేసుకున్నాడు. మంగళవారం దీనిపై బ్రిటన్ హైకోర్టు విచారణ ప్రారంభించింది. వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు మూడు సార్లు నీరవ్ బెయిల్ పిటీషన్‌ను తిరస్కరించిన నేపథ్యంలో నాలుగోసారి హైకోర్టులో బెయిల్ పిటీషన్ వేశాడు.

# జీడీపీ గోల్‌మాల్



## దేశ వృద్ధిని ఎక్కువగా అంచనా వేశారు

### 2011-17 మధ్య 2.5 శాతం అధికంగా చూపారు ● మాజీ సీఈఏ అర్వింద్ సుబ్రమణియన్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 11:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తి.. ప్రపంచంలోనే అత్యంత వృద్ధిదాయక దేశం.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వెలుగు రేఖ.. ఇప్పటిదాకా భారత్‌పై అంతర్జాతీయ సమాజం అంచనాలు ఇవన్నీ. అయితే దేశ జీడీపీ గణన అంతా తప్పుల తడక, వాస్తవ గణాంకాల కంటే ఎక్కువ చూపించారని ఇప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తూ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) నుంచే ఈ ఆరోపణలు రావడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. 2011-12 నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరం వరకు దేశ వృద్ధిరేటును ఉన్నదానికంటే దాదాపు 2.5 శాతం అధికంగా అంచనా వేశారని మోదీ సర్కారు మాజీ సీఈఏ అర్వింద్ సుబ్రమణియన్ అంటున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రచురించిన రిసెర్చ్ పేపర్‌లో 2011-17 మధ్య భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు దాదాపు 4.5 శాతంగానే ఉన్నా.. అధికారిక గణాంకాలు మాత్రం సుమారు 7 శాతంగా ఉన్నాయని సుబ్రమణియన్ వ్యాఖ్యానించారు. జీడీపీ లెక్కింపు పద్ధతిలో మార్పే ఇందుకు కారణమని పేర్కొన్నారు. '2011-12 నుంచి 2016-17 వరకు వాస్తవ జీడీపీ అంచనా కోసం భారత్ తమ డేటా వనరుల పద్ధతిని మార్చింది. దీని వల్లే దేశ వృద్ధిరేటు ఉండాల్సిన దానికంటే ఎక్కువ కనిపించింది' అన్నారు. 2011-17 వ్యవధిలో వార్షిక జీడీపీ సగటు సుమారు 7 శాతంగా ఉందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయని, అయితే నిజానికిది దాదాపు 4.5 శాతాన్ని మించబోదని అన్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2018-19) చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకడం.. సుబ్రమణియన్ తాజా వ్యాఖ్యలకు బలం చేకూరుస్తుండటం గమనార్హం.

### అర్థ రహితం: ప్రభుత్వం

జీడీపీ లెక్కలు సరిగా లేవంటూ అర్వింద్ సుబ్రమణియన్ చేసిన వ్యాఖ్యలు అర్థ రహితమని, ఆమోదయోగ్యమైన విధానాలు, పద్ధతుల ద్వారానే జీడీపీ గణన జరిగిందని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసిం ది. తమ గణాంకాలు.. వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయని గుర్తుచేసింది. బహుశా విద్యుత్ వినియోగం, ద్విచక్ర, వాణిజ్య వాహనాల అమ్మకాలు ఆధారంగా సుబ్రమణియన్ ప్రాథమికంగా లెక్కలు వేసి ఉండొచ్చని ఓ ప్రకటనలో ఎద్దేవా చేసింది. ఐక్యరాజ్యసమితి అనుసరిస్తున్న వ్యవస్థ ఎస్ఎన్ఏ 2008 నే తామూ పాటిస్తున్నట్లు ప్రకటించింది. జీడీపీ సిరీస్ బేస్ ఇయర్‌ను 2004-05 నుంచి 2011-12కు మార్చా మ న్నది. కాగా, ఈ ఏడాది మే వరకు పదవీ కాలం ఉన్నప్పటికీ గతేడాది ఆగస్టులోనే తన సీఈఏ హోదాకి అర్వింద్ సుబ్రమణియన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

**యూపీఏ-2లో మొదలు**

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-2 హయాంలోనే జీడీపీ అంచనాలు వాస్తవికతకు దూరంగా ఉండటం మొదలైందని సుబ్రమణియన్ తెలిపారు. 2012లో జీడీపీ గణనకు అనుసరిస్తున్న పద్ధతులను అప్పటి మన్మోహన్ సర్కారు మార్చిందన్నారు. దీంతో అప్పటిదాకా ఉన్న విలువ ఆధారిత డేటా స్థానంలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమకూర్చిన ఆర్థిక పద్దుల ఆధారిత డేటా వచ్చిందని వివరించారు. ఫలితంగా జీడీపీ అంచనాలు చాలా సున్నితంగా తయారయ్యాయని చెప్పారు. ఇక మోదీ సర్కారు వచ్చాక కొత్త జీడీపీ సిరీస్ తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. దీని కింద ఇప్పటికే దేశ వృద్ధిరేటు అంచనాలపై వివాదాలు నెలకొన్న సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో సుబ్రమణియన్ వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి.

# సొంతింటికి ఎస్‌బీఐ 'డెస్టినేషన్'



ఎస్‌బీఐ ఉన్నతాధికారులు

**హైదరాబాద్, జూన్ 11:** ఇండ్ల కొనుగోలుదారుల కోసం 'డెస్టినేషన్: దీ హోం షాపీ' పేరుతో ఎస్‌బీఐ ఓ సరికొత్త నిర్మాణ రంగ ఆధారిత మార్కెటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. హైటెక్ సిటీలోని ఐకియా దగ్గర్లో ఏర్పాటైన ఈ హోం షాపీలో ఎస్‌బీఐ ఆమోదం పొందిన, ప్రముఖ డెవలపర్లు చేపట్టిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులపై డిజిటల్ ప్రదర్శన ఇవ్వనున్నారు. ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ జే స్వామినాథన్ దీన్ని ప్రారంభించగా, హైదరాబాద్ సర్కిల్ సీజీఎం ఓం ప్రకాశ్ మిశ్రా, ఇతర సీనియర్ అధికారులతోపాటు క్రెడాయ్, ట్రెడా, టీబీజీ తదితర పరిశ్రమ సంఘాలు కార్యక్రమానికి హాజరైనట్లు మంగళవారం ఓ ప్రకటనలో ఎస్‌బీఐ తెలిపింది.

# మౌలికాన్ని మరువద్దు

## పెట్టుబడులకు ఊతమివ్వండి

### బడ్జెట్‌పై సీతారామన్‌కు పరిశ్రమ వర్గాల సూచన



ముందస్తు బడ్జెట్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆర్థిక కార్యదర్శి ఎస్‌సీ గార్గ్

**న్యూఢిల్లీ, జూన్ 11:** రాబోయే బడ్జెట్‌లో మౌలిక రంగానికి పెద్దపీట వేయాలని, పెట్టుబడులు పెరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు పరిశ్రమ సూచించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను వచ్చే నెల 5న లోక్‌సభలో సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పరిశ్రమ వర్గాలతో మంగళవారం ఇక్కడ మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐఐ, అసోచామ్, ఫిక్కీల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. కార్పొరేట్ పన్నును తగ్గించాలని, కనీస ప్రత్యామ్నాయ పన్నును రద్దు చేయాలని, డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్‌ను ప్రస్తుతమున్న 20 శాతం నుంచి 10 శాతానికి కుదించాలని సీఐఐ అధ్యక్షుడు విక్రమ్ కిర్లోస్కర్ సూచించారు. దీంతో 2014లో తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి పన్ను విధానాలను సరళీకృతం చేస్తూనే ఉన్నామని, నిబంధనలను హేతుబద్ధీకరిస్తున్నామని మంత్రి వివరించారు. సులభతర వ్యాపార నిర్వహణ ర్యాంకుల్లోనూ చాలా మెరుగయ్యామన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇదిలావుంటే అసోచామ్ అధ్యక్షుడు బీకే గోయెంకా.. అన్ని కొత్త పెట్టుబడులకు తొలి ఏడాది 100 శాతం ప్రోత్సాహకాలను ఇవ్వాలని సూచించారు. అలాగే వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను మరింత సరళతరం చేయాలని, 8, 16 శాతం శ్లాబులకే పరిమితం చేయాలని సలహా ఇచ్చారు. ఇక ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమని మౌలిక రంగానికి పెద్ద ఎత్తున కేటాయింపులు జరుపాలన్నారు. రోడ్లు, రహదారులు, సబ్-అర్బన్ మెట్రోలు, విమానాశ్రయాల రంగాల్లో కొన్ని భారీ ప్రాజెక్టులనైనా ప్రకటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను పెంచేలా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.

### వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని, రైతుల ఆదాయాన్ని పెంచాలని ఆ రంగ నిపుణులు డిమాండ్ చేశారు. ఈ రంగం పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని ఆర్థిక మంత్రి సీతారామన్‌కు వారు సూచించారు. రైతులకు మార్కెట్ అనుమతులను కల్పించాలని కోరారు. వ్యవసాయ రంగ సమస్యలు, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలనలే ప్రధాన ఎజెండాగా వచ్చే బడ్జెట్‌ను మంత్రి తీర్చిదిద్దుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో రైతుల కష్టాలు తీరేలా బడ్జెట్ ప్రకటనలుంటాయన్న విశ్వాసాన్ని వ్యవసాయ రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఆహార శుద్ధి పరిశ్రమను ప్రోత్సహించాలని, పశు సంపద, చేపల పెంపకం, పౌల్ట్రీ పరిశ్రమల అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని భారత్ కర్షక్ సమాజ్ వంటి రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

## రూ.999కే విమాన టిక్కెట్లు

### ఇండిగో సమ్మర్ సేల్ ఆఫర్

**న్యూఢిల్లీ, జూన్ 11:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. సమ్మర్ సేల్ పేరుతో నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 14 వరకు అమలులో ఉండనున్న ఈ ప్రత్యేక ఆఫర్ కింద దేశీయ ప్రారంభ విమాన టిక్కెట్టు ధరను రూ.999గాను, అంతర్జాతీయ టిక్కెట్టు ధరను రూ.3,499గా నిర్ణయించింది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 16 నుంచి సెప్టెంబర్ 28 లోపు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చునని కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి విలియమ్ బౌల్టర్ తెలిపారు. ఇందుకోసం సంస్థ 10 లక్షల టిక్కెట్లను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. వీటితోపాటు ఇండస్ఇండ్ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు 20 శాతం క్యాష్ బ్యాక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డు కలిగిన వారికి 5 శాతం నగదు రాయితీ, మొబిక్విక్ వ్యాలెట్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికి 15 శాతం రాయితీ లభించనున్నది.

## ఓబీసీ వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, జూన్ 11:** ప్రభుత్వరంగ సంస్థ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) కూడా మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 0.10 శాతం వరకు తగ్గించింది. ఈ కొత్త రేట్లు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయని బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో నెల, ఆరు నెలల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో వరుసగా 8.35 శాతానికి, 8.60 శాతానికి తగ్గాయి. అంతకుముందు ఈ వడ్డీరేట్లు 8.45 శాతంగాను, 8.70 శాతంగా ఉండేవి. ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటును 0.05 శాతం తగ్గించడంతో 8.75 శాతంనుంచి 8.70 శాతానికి దిగొచ్చింది. కానీ, రోజు, మూడు నెలల రుణాలపై వడ్డీని యథాతథంగా ఉంచింది.

# అప్పులన్నీ చెల్లిస్తా..

## 14 నెలల్లో రూ.35 వేల కోట్లు చెల్లించాం: అనిల్ అంబానీ



**న్యూఢిల్లీ/ముంబై, జూన్ 11:** అప్పులన్నీ చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు అడాగ్ చైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ప్రకటించారు. గడిచిన 14 నెలల్లోనే ఏకంగా రూ.35 వేల కోట్ల రుణాలను చెల్లించినట్లు, మిగతా రుణాలను సరైన సమయంలో చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రుణాలు ఇచ్చే సంస్థల నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లేకపోయినప్పటికీ ఏప్రిల్ 1, 2018 నుంచి మే 31, 2019 మధ్యకాలంలో రూ.24,800 కోట్ల రుణాలు తీర్చగా, రూ.10,600 కోట్ల మేర వడ్డీల రూపంలో చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం ఎరిక్సన్‌కు రూ.550 కోట్లను సరైన సమయంలో చెల్లించకపోవడంతో తన అన్న ముకేశ్ అంబానీ ఆర్థికంగా ఆదుకోవడంతో జైలు శిక్ష నుంచి బయట పడిన విషయం తెలిసిందే. గడిచిన కొన్ని వారాలుగా రేడియో స్టేషన్, మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని విక్రయించిన సంస్థ..జనరల్ ఇన్సూరెన్స్ యూనిట్‌ను విక్రయించడానికి పలు సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. గడిచిన కొన్ని రోజులుగా సంస్థపై వస్తున్న వదంతుల నేపథ్యంలో అడాగ్ గ్రూపునకు చెందిన ఆర్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీల షేర్లు జనవరి నుంచి 65 శాతం వరకు పడిపోయిన నేపథ్యంలో అంబానీ మంగళవారం మీడియా ముందుకు వచ్చారు. ప్రస్తుతం గ్రూపునకు ఉన్న మొత్తం బకాయిలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని, సమయానుకూలంగా కొంత ఆలస్యమవనున్నప్పటికీ పూర్తిగా తీర్చడంలో మాత్రం వెనుకంజ వేసే అవకాశాలు లేవని, ఇందుకోసం గ్రూపునకు ఉన్న అన్ని ఆస్తులను విక్రయించనున్నట్లు అనిల్ తెలిపారు.

# 1 నుంచి ఆన్‌లైన్ చార్జీలు ఎత్తివేత

## ప్రకటించిన రిజర్వు బ్యాంకు

**ముంబై, జూన్ 11:** డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా జరిపే లావాదేవీలపై విధించే చార్జీలను వచ్చే నెల 1 నుంచి ఎత్తివేస్తున్నట్లు రిజర్వు బ్యాంక్ మంగళవారం ప్రకటించింది. దీంతో ఆర్టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జరిపే ప్రతి లావాదేవీలపై ఇక నుంచి ఎలాంటి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదు. ఈ ప్రయోజనాలను బ్యాంకులు తమ ఖాతాదారులకు అందించాలని ఆర్బీఐ సూచించింది. నెఫ్ట్ ద్వారా రూ.2 లక్షల వరకు పంపుకోనుండగా, అదే ఆర్టీజీఎస్ ద్వారా ఎంతైన పంపుకోవచ్చును. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రతి నెఫ్ట్ లావాదేవీలపై రూ.1 నుంచి రూ.5 వరకు వడ్డిస్తుండగా, ఆర్టీజీఎస్ లావాదేవీలపై రూ.5 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నది. ఈ నెల 6న తన పరపతి సమీక్షలో ఆర్బీఐ ఈ కీలక నిర్ణయం తీసుకున్నది.

### ఏటీఎం చార్జీలపై కమిటీ

ఏటీఎం చార్జీలను, బ్యాంకుల ఫీజులను సమీక్షించడానికి ఐబీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వీజీ కన్నన్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీని రిజర్వు బ్యాంక్ మంగళవారం ఏర్పాటు చేసింది. అత్యధికంగా వినియోగిస్తున్న ఏటీఎంపై చార్జీలు అధికంగా ఉన్నాయని సామాన్యుడి నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా రిజర్వు బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఆరుగురు సభ్యులు కలిగిన ఈ కమిటీలో దిలీప్ అస్బే(ఎన్‌పీసీఐ సీఈవో), గిరి కుమార్ నాయర్(ఎస్‌బీఐ సీజీఎం), ఎస్ సంపత్ కుమార్(హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లయబిల్టి గ్రూపు హెడ్), కే శ్రీనివాస్(ఏటీఎం ఇండస్ట్రీ బాడీ డైరెక్టర్), సంజీవ్ పటేల్(టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్ సీఈవో)లు ఉన్నారు. కాగా, గురువారం వ్యవస్థలోకి ఆర్బీఐ 15 వేల కోట్ల నిధులను చొప్పించనున్నది.

# జెట్ కథ కంచికేనా!

## వెనక్కి తగ్గిన హిందుజా, ఎతిహాద్ గ్రూపులు

### కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమా!



**న్యూఢిల్లీ, జూన్ 11:** ఆర్థిక సంక్షోభంతో మూతపడిన జెట్ ఎయిర్‌వేస్ కథ కంచికి చేరినట్లే కనిపిస్తున్నది. ఇప్పటివరకు హిందుజా, ఎతిహాద్ గ్రూపులు వాటాను కొనుగోలు చేస్తారని కాస్త ఆశ ఉండేది. కానీ ఈ రెండు సంస్థలు కూడా వెనక్కి తగ్గడంతో విమాన రన్‌వేపై నిలిచిపోయిన జెట్ విమానాలు ఇప్పట్లో గాల్లోకి ఎగిరే అవకాశాలేమి కనిపించడం లేదు. సంస్థపై జరుగుతున్న దర్యాప్తు, దివాలా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ రెండు సంస్థలు వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఇబ్బందికర పరిణామాల నేపథ్యంలో వాటాను కొనుగోలు చేయడం లేదని ఇప్పటికే లండన్‌కు చెందిన హిందుజా గ్రూపు ప్రకటించగా..ఎతిహాద్ కూడా భవిష్యత్తు పెట్టుబడులను నిలిపివేసింది. ప్రముఖ ఇంగ్లీష్ పేపర్ లైవ్‌మింట్ నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. నేలపట్టునే నిలిచిపోయిన జెట్ ఎయిర్‌వేస్‌ను కొనుగోలుచేయడం వల్ల ఇబ్బందులు తప్పా ఎలాంటి ఉపయోగం ఉండదని హిందుజాకు చెందిన ఇద్దరు ప్రమోటర్లు భావిస్తున్నారు. జెట్ ఎయిర్‌వేస్ దివాలా విషయంపై ప్రత్యేక కోర్టు గురువారం వరకు కేసును వాయిదావేసింది. నిధులు లేక మూతపడిన సంస్థ పన్ను ఎగవేతకు సంబంధించి ఆదాయ పన్ను శాఖ కూడా కేసును దాఖలు చేయడానికి సిద్ధమైంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది జెట్ ఎయిర్‌వేస్ పరిస్థితి. వీటితోపాటు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా సంస్థలో జరుగుతున్న అవకతవకలపై దర్యాప్తు చేయాలని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీని ఆదేశించింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా..కంపెనీలోకి వచ్చిన విదేశీ నిధులపై కూడా దృష్టి సారించింది. 2014లో దుబాయికి చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎతిహాద్.. జెట్‌లో వాటాను కొనుగోలు చేసింది. కంపెనీలో వాటాను పెంచుకోవడానికి ఎతిహాద్ ఆసక్తి చూపినప్పటికీ..తర్వాత వెనక్కి తగ్గింది. 2013లో 24 శాతం వాటాను కొనుగోలు చేయడానికి ఎతిహాద్ రూ.2,060 కోట్ల నిధులను వెచ్చించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఎస్‌బీఐతోపాటు ఇతర సంస్థలు స్పందించడానికి నిరాకరించాయి. ప్రస్తుతం సంస్థకు రూ.8 వేల కోట్లకు పైగా అప్పు ఉన్నది.

### భారీగా పడిపోయిన జెట్ షేరు

హిందుజా, ఎతిహాద్ గ్రూపులు జెట్ ఎయిర్‌వేస్ వాటా కొనుగోలు ప్రక్రియ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు ధర భారీగా పడిపోయింది. ఒక దశలో 14.41 శాతం పడిపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.107.15 వద్దకు జారుకున్నది. చివరకు ఈ భారీ నష్టాల నుంచి క్రమంగా కోలుకొని 10.58 శాతం నష్టంతో రూ.111.95 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్ఈలోనూ కంపెనీ షేరు ధర 10.25 శాతం తగ్గి రూ.112 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.150.28 కోట్లు తగ్గి రూ.1,271.72 కోట్లకు పడిపోయింది.

# ప్యాసింజర్ వాహనాలు ఢమాల్

## 18 ఏండ్ల కనిష్ఠ స్థాయికి అమ్మకాలు

**న్యూఢిల్లీ, జూన్ 11:** దేశవ్యాప్తంగా ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 18 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. మార్కెట్లో ఈ వాహనాలకు డిమాండ్ లేకపోవడంతో గడిచిన నెలలో అమ్మకాలు 20 శాతం పడిపోవడంతో ఆటోమొబైల్ సంస్థలు ఉత్పత్తిని భారీగా తగ్గించుకుంటున్నాయి. వరుసగా ఏడో నెల మేలోనూ 2,39,347 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది అమ్ముడైన 3,01,238లతో పోలిస్తే 20 శాతం దిగువకు పడిపోయాయి. గతేడాది అక్టోబర్‌లో 1.55 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న పీవీల విక్రయాలు అప్పటి నుంచి పతనం చెందాయి. సెప్టెంబర్ 2001లో 21.91 శాతం పడిపోయిన అమ్మకాలు మళ్లీ ఇప్పుడు అంతే స్థాయిలో పతనం చెందాయి. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) విడుదల చేసిన నివేదికతో ఈ విషయం వెల్లడైంది. ఆటోమొబైల్ పరిశ్రమలో మందకొడి పరిస్థితులు కొనసాగుతున్నాయి..హోల్‌సేల్ అమ్మకాల కంటే రిటైల్ విక్రయాలు ఆశించిన స్థాయిలో ఉన్నాయని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ తెలిపారు.ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే కేంద్రం జోక్యం చేసుకోని ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించాలని, 2008-09, 2011-12 సంవత్సరాల్లో వివిధ మార్గాల ద్వారా కేంద్రం ఆటోమొబైల్ పరిశ్రమను ఆదుకున్నదని, ముఖ్యంగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

### సియామ్ విడుదల చేసిన నివేదికలో పలు అంశాలు..

- దేశీయంగా కార్ల అమ్మకాలు 26.03 శాతం తగ్గి 1,47,546లకు పడిపోయాయి. అంతక్రితం ఇదే నెలలో 1,99,479 కార్లు అమ్ముడయ్యాయి.
- మోటార్‌సైకిళ్ల విక్రయాలు కూడా 4.89 శాతం క్షీణించ ఇ11,62,373లకు పరిమితమయ్యాయి. 2018 మే నెలలో 12,22,164 బైకులు విక్రయించారు.
- మొత్తం ద్విచక్ర వాహన అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 6.73 శాతం తగ్గి 17,26,206లకు పడిపోయాయి.
- కమర్షియల్ వాహన సేల్స్ కూడా 10.02 శాతం తగ్గి 68,847లకు పరిమితమయ్యాయి.
- గత నెలలో దేశవ్యాప్తంగా 20,86,358 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదేనెలలో అమ్ముడైన 22,83,262లతో పోలిస్తే 8.62 శాతం తగ్గాయి.

## పెరిగిన ప్రేమ్‌జీ వేతనం

### గతేడాది 95 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జూన్ 11:** వచ్చే నెల చివర్లో చైర్మన్‌గా పదవీ విరమణ చేయబోతున్న విప్రోఎగ్జిక్యూటివ్ చైర్మన్ అజీం ప్రేమ్‌జీ గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను 2,62,054 డాలర్ల వేతనాన్ని అందుకున్నారు. మన కరెన్సీలో ఇది రూ.1.81 కోట్లు. అంతక్రితం ఏడాది అందుకున్న జీతంతో పోలిస్తే 95 శాతం పెరిగినట్లు సంస్థ వార్షిక నివేదికలో వెల్లడించింది. ఆయన కుమారుడు రిషద్ ప్రేమ్‌జీ 987,652 డాలర్ల జీతాన్ని అందుకున్నారు. మన కరెన్సీలో ఇది రూ.6.8 కోట్లని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే విప్రో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబిదాలీ జెడ్ నీముచ్‌వాలా వేతనం కూడా 41 శాతం పెరిగి 3.9 మిలియన్ డాలర్ల(రూ.27.3 కోట్లు)కు చేరుకున్నది. వేతన రూపంలో 62,322 డాలర్లు అందుకున్న అజీం ప్రేమ్‌జీ.. కమిషన్ కింద 1,31,231 డాలర్లు, ఇతర మార్గాల ద్వారా 55,705 డాలర్లు, దీర్ఘకాలిక పరిహారం కింద 12,796 డాలర్లు లభించాయి. వేతన, అలెవెన్స్‌ల కింద మిలియన్ డాలర్లు అందుకున్న నీముచ్‌వాలాకు కమిషన్ రూపంలో 8,91,760 డాలర్లు, ఇతర మార్గాల ద్వారా 2 మిలియన్ డాలర్లు లభించాయి.

# కవి నాళేశ్వరం శంకరానికి శ్రీశ్రీ పురస్కారం




మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో మహాకవి శ్రీశ్రీ పురస్కార గ్రహీత, కవి డాక్టర్ నాళేశ్వరం శంకరంను సన్మానిస్తున్న అతిథులు

**త్యాగరాయ గానసభ:** ప్రముఖ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరంను కళానిలయం సంస్థ మహాకవి శ్రీశ్రీ పురస్కారాన్ని ప్రదానంచేసి మంగళవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన శంకరం కవి, విమర్శకుడు, పరిశోధకునిగా కీర్తి సాధించారు. ఓయూ నుంచి చలం రచనలపై పీహెచ్‌డీ పొందారు. దూదిమేడ కవితాసంపుటి ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన నాళేశ్వరం తెలంగాణ రచయితల సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. పలు సంస్థలు ఆయనను ఘనంగా సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశాయి. ప్రపంచ తెలుగు మహాసభల్లో కవులకు ఆయన మార్గనిర్దేశనం చేశారు. కార్యక్రమంలో లలిత సంగీత గాయని హైమావతి భీమన్న, గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తి, కవి జల్దివిద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

# శారదాపీఠం ఉత్తరాధికారిగా బాలస్వామి

- శిష్యతురీయాశ్రమదీక్ష ప్రదానం చేయనున్న స్వరూపానందేంద్ర
- బెజవాడ దుర్గమ్మ పాదాలవద్ద 15-17 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం

**వరకవుల దుర్వాసరాజు, హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** విశాఖ శారదాపీఠం బావిబాధ్యతలను ఇరవై ఆరేండ్ల బ్రహ్మచారి కిరణ్‌కుమార శర్మ (బాలస్వామి)కు అప్పగించాలని శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీమహాస్వామి నిర్ణయించుకున్నారు. కుమారశర్మకు శిష్యతురీయాశ్రమ దీక్షను స్వయంగా ప్రదానం చేయదలిచారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో వేదవేద్యులు, ఆధ్యాత్మిక, రాజనీతి, కళారంగాల ప్రముఖుల సమక్షంలో బాలస్వామి సన్యాసాశ్రమ స్వీకరణ ఘనంగా నిర్వహించనున్నారు. బెజవాడ దుర్గమ్మ పాదాలవద్ద కృష్ణానదీతీరాన నెలకొన్న గణపతిసచ్చిదానంద ఆశ్రమం, జయదుర్గాతీర్థం వేదికగా జరిగే కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి భక్తకోటి తరలిరానున్నది. తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. కుమారశర్మ స్వస్థలం ఏపీలోని విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం. 1993 ఏప్రిల్ 4న విశాఖలో జన్మించారు. పోణంగి హనుమంతరావు, ప్రభావతమ్మ దంపతుల ఇద్దరు పిల్లల్లో పెద్దవాడు. మూడోతరగతి చదువుతుండగా తల్లిదండ్రులతో కలిసి స్వరూపానందేంద్రను దర్శించే భాగ్యం కలిగింది. బాలకిరణుడు.. మహాస్వామి కంటికి అపరశంకరునిగా గోచరించారు. వెంటనే పిల్లవాడ్ని పీఠానికి చేర్చమని తల్లిదండ్రులకు సూచించారు. నాటినుంచి కుమారశర్మ జీవితం మారిపోయింది. మహాస్వామి ప్రధాన శిష్యుడయ్యారు. ఆయన బాటలో ధర్మపరిరక్షణకు కృషిచేస్తానని కుమారశర్మ చెప్పారు.



స్వరూపానందేంద్రస్వామితో కుమారశర్మ

**బాలస్వామి యోగ్యుడు**

ఆదిశంకరుడు, సచ్చిదానందేంద్రుడు, అద్వైతానందేంద్రుడు వీరి పరంపరగా శారదాపీఠం నడుస్తున్నది. దీనికి ఉత్తరాధికారిగా కిరణ్‌కుమారశర్మ వ్యవహరించబోతున్నారు. వీరి సన్యాస నామం దీక్ష స్వీకార సమయంలో వెల్లడిస్తాం. కుమారశర్మ యోగ్యుడు. వేదవేదాంగాలు చదువుకున్నవారు. వారి నేతృత్వంలో శారదాపీఠం మరిన్ని సత్కార్యాలు చేయనున్నది.

-స్వరూపానందేంద్ర స్వామి



చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 119 బీసీ గురుకుల పాఠశాలలను ఒకేరోజు ప్రారంభించడం గొప్ప విషయమని అడ్వకేట్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 17న బీసీ గురుకులాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ గన్‌పార్కు వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి అనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

- నమస్తే తెలంగాణ, హైదరాబాద్



## ఆ చేపలు తినేవారిలో
# పాదరసం స్థాయి ఎక్కువే

- ఐఐటీ హైదరాబాద్ పరిశోధనలో వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బొగ్గు మండించే ప్లాంట్ల సమీపంలో లభించే చేపలు తినడం వల్ల శరీరంలో పాదరసం స్థాయి అధికం అవుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్, నెల్లూరు, వాస్కోడిగామ నగరాల్లో 600 మంది నివాసితుల వెంట్రుకలపై పరిశోధన చేసింది. 'పాదరసం అనేది ఒక విష పదార్థం. వివిధ రూపాల్లో ఇది పర్యావరణంలోకి ప్రవేశిస్తున్నది. కలుషిత వాతావరణంలో లభించే ఆహారం.. ముఖ్యంగా చేపలు, బియ్యం ద్వారా మానవ శరీరంలోకి వెళ్తుంది. బొగ్గు మండించడం వల్ల పెద్దమొత్తంలో పాదరసం వాతావరణంలోకి విడుదలవుతున్నది' అని ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిఫ్ ఖురేషీ తెలిపారు. 2020 నాటికి మన దేశంలో 540 టన్నుల పాదరసం వ్యర్థాలు వాతావరణంలో కలుస్తాయని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ఇది దేశ ప్రజల ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండెపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

# నేటినుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఎమ్మెల్యేల ప్రమాణం, గురువారం స్పీకర్‌గా తమ్మినేని సీతారాం ప్రమాణ స్వీకారం జరుగనున్నది. శుక్రవారం గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 15, 16 తేదీల్లో శాసనసభకు సెలవు. 18వ తేదీతో సమావేశాలు ముగియనున్నాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలి క్యాబినెట్ సమావేశంతోనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాశమంతఎత్తుకు ఎదిగారని అన్నారు. ఏపీ అసెంబ్లీ తొలి సమావేశాలు ప్రారంభంకాగానే తొలుత సీఎం వైఎస్ జగన్, అనంతరం ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రమాణంచేస్తారని తెలిపారు. సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తామని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టంచేశారు.

# 'పెద్దలసభలో తెలుగుపెద్ద' పుస్తకాన్ని ఆవిష్కరించినఏపీ సీఎం జగన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత, ప్రముఖ సాహితీవేత్త, కవి, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) పార్లమెంట్ ప్రసంగాల సంకలనం 'పెద్దలసభలో తెలుగు పెద్ద' పుస్తకాన్ని మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సినారె ప్రసంగాల పుస్తకం తన చేతులమీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని జగన్ అన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, పుస్తక సంకలనకర్త, రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జాతీయ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ గోడ రఘురాం, రైతునేస్తం పబ్లికేషన్స్ అధిపతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



'పెద్దలసభలో తెలుగు పెద్ద' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

# ఏపీలో ఇసుక రవాణా బంద్

- త్వరలో నూతన ఇసుక విధానం
- గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో మంగళవారం నుంచి ఇసుక రవాణా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కొత్త ఇసుక విధానం వచ్చేంతవరకు ఇసుక రవాణాచేయడానికి వీల్లేదని ఆ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టంచేశారు. ఇసుక రవాణాపై కొత్త విధానాన్ని తీసుకురావాలని సీఎం జగన్ ఆదేశాలిచ్చారని, జూలై ఒకటిలోపు దానిని తీసుకొస్తామని మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఇసుక స్మగ్లింగ్‌కి నేటినుంచి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆదేశాలిచ్చామని పెద్దిరెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణా ఆపకపోతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

# వైఎస్ జగన్‌కు స్వామినాథన్ అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ సీఎం జగన్‌కు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అభినందనలు తెలిపారు. నవరత్నాల్లో భాగంగా రైతులను ఆదుకునేందుకు జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా పథకంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. సంక్షోభంలో ఉన్న రైతుల్లో ఈ పథకం మనోధైర్యం నింపిందని కొనియాడారు. దివంగత నేత వైఎస్సార్‌తో రైతాంగం కోసం అనేక సార్లు కలిసి పనిచేశానని ఆయన గుర్తుచేశారు. 'మీ నాయకత్వంలో రైతుల కోసం చేపట్టే కార్యక్రమాలకు నా సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది' అని జగన్‌ను ఉద్దేశించి స్వామినాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నక్సల్ దంపతుల అరెస్టు

**ముంబై:** ఇద్దరు సీనియర్ నక్సలైట్ నాయకులు కిరణ్‌కుమార్ (63), ఆయన భార్య నర్మద (60)ను మహారాష్ట్ర పోలీసులు తెలంగాణలో అరెస్టు చేశారని ఓ సీనియర్ అధికారి మంగళవారం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో ఏప్రిల్ 9న బీజేపీ ఎమ్మెల్యే భీమా మాండవిపై దాడి కేసులో వీరు ప్రధాన సూత్రధారులని ఆ అధికారి తెలిపారు. విజయవాడకు చెందిన కిరణ్ రెండు దశాబ్దాలుగా అండర్‌గ్రౌండ్‌లో ఉన్నాడని తెలిపారు.

## షీ టీమ్స్‌తో మహిళల్లో పెరిగిన భరోసా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ముఖ్యంగా మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిందని శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్ చెప్పారు. షీటీమ్స్ ఏర్పాటుతో మహిళల్లో భరోసా పెరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకరూప పోలీస్‌సేవల్లో భాగంగా షీటీమ్స్‌కు నాలుగురోజులపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఉమెన్‌సేఫ్టీ వింగ్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు.

# లక్ష్యందిశగా గురుకులాలు

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల

**హైదరాబాద్/ బండ్లగూడ, నమస్తే తెలంగాణ:** పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు కేసీఆర్ సర్కారు ప్రత్యేకంగా కృషిచేస్తున్నదని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జాతీయస్థాయి నీట్ అర్హత సాధించిన వారు, మారిటైం యూనివర్సిటీ, లాసెట్‌లలో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థుల అభినందన సభను మంగళవారం రాజేంద్రనగర్‌లోని గిరిజన సంక్షేమ ఐఐటీ సెంటర్‌లో నిర్వహించారు. నీట్‌లో అధిక మార్కులు సాధించడం హర్షణీయమని మంత్రి కొప్పుల పేర్కొన్నారు. 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ అర్హత సాధించడం ఆనందంగా ఉందని, గురుకులాలతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఉన్నతస్థానాలను దక్కించుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్‌ప్రవీణ్‌కుమార్‌ను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లోని గిరిజన సంక్షేమ ఐఐటీ సెంటర్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ, ఎస్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# కోర్టులో లొంగిపోయిన జూనియర్ ఆర్టిస్ట్ కోటి

- లక్ష్మీపార్వతి, నటి పూనంకౌర్ కేసులలో నిందితుడు
- విచారణకు వస్తున్నానంటూ బుకాయించి కోర్టులో ప్రత్యక్షం



నిందితుడు కోటి.. బాధితురాలు, నటి పూనంకౌర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వైఎస్సార్సీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి, నటి పూనంకౌర్‌పై సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిన జూనియర్ ఆర్టిస్ట్ కోటి అలియాస్ ఆనందపాల్ అనే వ్యక్తి.. నాటకీయ పరిణామాల మధ్య కోర్టు ఎదుట లొంగిపోయాడు. నాంపల్లి కోర్టులో దర్శనమివ్వడంతో పట్టుకొనేందుకు వచ్చిన హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులకు బురిడీ కొట్టి న్యాయమూర్తి ముందుకు రావడంతో.. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తనపై సోషల్‌మీడియాలో అసత్య, అసభ్యకరమైన ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీపార్వతి ఏప్రిల్‌లో తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదుచేశారు. తనపై యూట్యూబ్‌లో అభ్యంతకర వీడియోలను అప్‌లోడ్‌చేసిన గుర్తుతెలియని వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని నటి పూనంకౌర్ ఏప్రిల్ లో సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. లక్ష్మీపార్వతి, పూనంకౌర్‌పై తప్పుడు పోస్టులు పెట్టింది కోటి అనే జూనియర్ ఆర్టిస్ట్ ఒక్కరే అని పోలీసులు తేల్చి ఆధారాలు సేకరించారు. తదుపరి విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు పంపడంతో.. న్యాయవాదితో కలిసివస్తున్నట్టు పలుమార్లు బుకాయించాడు.

# తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తంచేస్తాం

- అటా నూతన అధ్యక్షుడు వినోద్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న అటా అధ్యక్షుడు వినోద్‌కుమార్

**ఖైరతాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి విశ్వవ్యాప్తం చేసేందుకు కృషిచేస్తానని అమెరికన్ తెలంగాణ అసోషియేషన్ (అటా) నూతన అధ్యక్షుడు వినోద్‌కుమార్ కుకునూర్ తెలిపారు. అటా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం మీడియాతో మాట్లాడారు. సంగీత సాహిత్య కళారంగాల్లో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, ప్రోత్సాహక ప్రయత్నాలకు సంపూర్ణ మద్దతు పలుకుతూ అమెరికాలో అంతర్జాతీయ వేడుకల్లో ఇక్కడి కళాకారులు, సాహితీవేత్తలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో మహిళా సాధికారతకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. సమావేశంలో అటా కోశాధికారి రామచంద్రారెడ్డి ఆది, భారత సమన్వయకర్తలు డాక్టర్ పద్మజారెడ్డి, రామచంద్రారెడ్డి బాణాపురం తదితరులు పాల్గొన్నారు.

# అక్బరుద్దీన్ కోలుకోవాలి

## ట్విట్టర్‌లో ఏపీ సీఎం జగన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనారోగ్యంతో లండన్‌లో చికిత్స పొందుతున్న ఎంఐఎం శాసనసభాపక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ త్వరగా కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు మంగళవారం ట్వీట్‌చేశారు. కాగా, ప్రస్తుతం అక్బరుద్దీన్ ఆరోగ్యం కుదుటపడుతున్నదని మజ్లీస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

**జగన్‌ను కలిసిన కర్ణాటక సీఎం తనయుడు**

ఏపీ సీఎం జగన్‌ను కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి కుమారుడు నిఖిల్ గౌడ మర్యాదపూపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయానికి రాగా.. సీఎం జగన్ నిఖిల్‌ను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇద్దరు కాసేపు ముచ్చటించారు. సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగానే కలిశానని నిఖిల్ పేర్కొన్నారు.

## ఆర్టీసీ జేఏసీ నేతలతో
# నేడు జగన్ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిమాండ్ల సాధన కోసం సమ్మె యోచనచేస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ జేఏసీ నేతలతో బుధవారం సీఎం జగన్ భేటీ కానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పేషీ నుంచి నేతలకు ఆహ్వానం అందింది. బుధవారం ఉదయం సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు సీఎం జగన్‌ను కలిసి సమస్యలు వివరించనున్నారు.

## తప్పుడు ర్యాంకులతో మీడియాలో ప్రచారం

- కార్పొరేట్ కాలేజీలపై చర్యలు కోరుతూ డీజీపీకి ఫిర్యాదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీట్ ఫలితాల్లో తమ కళాశాలల విద్యార్థులకే టాప్ ర్యాంకులు వచ్చాయని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు అకాడమీల పేరుతో పోటీపడి మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పీడీఎస్‌యూ, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు మంగళవారం డీజీపీ ఎం మహేందర్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు.

## వారాంతపు సెలవులు ఇవ్వండి

### డీజీపీకి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం వినతి

రాష్ట్రంలో పోలీసు సిబ్బందికి వారాంతపుసెలవు మంజూరుచేయాలని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తిచేసింది. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే సాధారణ బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపిరెడ్డి మంగళవారం డీజీపీని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.

## సీఎల్పీ విలీనం పిటిషన్లపై ప్రతివాదులకు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనమండలి, శాసనసభలో కాంగ్రెస్ సభా పక్షాల విలీనాలపై ఆపార్టీ నేతలు షబ్బీర్ అలీ, మల్లు భట్టివిక్రమార్క దాఖలు చేసి న పిటిషన్లను హైకోర్టు మంగళవారం విచారించింది. అసెంబ్లీలో సీఎల్పీ విలీనంపై భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం దాఖలుచేసిన పిటిషన్ మంగళవారం విచారణ జాబితాలో లిస్ట్ కాలేదు. దీనిపై బుధవారం విచారణ జరుగనున్నది. కాగా, సీఎల్పీని విలీనం చేసే అధికారం స్పీకర్‌కు లేదని భట్టివిక్రమార్క గతంలో దాఖలుచేసిన పిటిషన్‌తోపాటు.. మండలిలో సీఎల్పీ విలీనానికి సంబంధించిన రెండు పిటిషన్లలో హైకో ర్టు ప్రతివాదులకు నోటీసులిచ్చింది.

# వర్షాకాల ప్రమాదాలపై రైల్వేశాఖ అప్రమత్తం

- రైల్వేలైన్ల పరిధిలోని 101 చెరువులకు మరమ్మతులు
- నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షాకాలం సమీపించడంతో రైల్వేశాఖ అప్రమత్తమైంది. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రైల్వే ట్రాక్‌లకు 32 కి.మీ. పరిధిలోని చెరువులపై నీటిపారుదల, రైల్వే శాఖల అధికారులు మంగళవారం జలసౌధలో సమీక్షా సమావేశం నిర్వహించగా, కృష్ణా, గోదావరి బేసిన్‌ల చీఫ్ ఇంజినీర్లు హమీద్‌ఖాన్, వీరయ్య, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజినీర్ పాల్గొన్నారు. దాదాపు 726 చెరువులు రైల్వే ట్రాక్‌లకు సమీపంలో ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. కొత్త రైల్వే లైన్లు ఏర్పాటైన నేపథ్యంలో మరో 200 చెరువులు రైల్వే ట్రాక్‌లకు దగ్గరగా ఉంటాయని అంచనావేశారు. 101 చెరువులకు వరదను తట్టుకునేలా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

## పలు రైళ్లు పాక్షికంగా రద్దు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మరమ్మతు పనులు కొనసాగుతున్నందున పలు రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. బోధన్- మహబూబ్‌నగర్ ప్యాసింజర్‌ను షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ స్టేషన్ల మధ్య బుధవారం (జూన్ 12) నుంచి ఆగస్టు 12 వరకు పాక్షికంగా రద్దుచేశారు. కాచిగూడ- మహబూబ్‌నగర్ మధ్య నడిచే రైలును షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ మధ్య ఆగస్టు 12 వరకు, కాచిగూడ- మేడ్చల్ ప్యాసిజర్ రైలును బొల్లారం- మేడ్చల్ మధ్య ఆగస్టు 10 వరకు పాక్షికంగా రద్దుచేశారు. ఫలక్‌నుమా- లింగంపల్లి, ఫలక్‌నుమా- హైదరాబాద్ మధ్య నడిచే ఎంఎంటీఎస్ రైళ్లు రద్దుచేసినట్టు తెలిపారు.

# అంతర్రాష్ట్ర గంజాయి స్మగర్ల అరెస్ట్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను మంగళవారం రాచకొండ పోలీసులు అరెస్ట్‌చేసి, 82 కిలోల గంజాయితో పాటు రూ.30వేల నగదును స్వాధీనం చేసుకొన్నారు. రాచకొండ ఏసీపీ గొట్టె సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కామోజీ కొండల్‌కు జైలులో పరిచయమైన మాణిక్యం, సోదరుడు తేజతో కలిసి గంజాయి వ్యా పారాన్ని ప్రారంభించారు. సోమవారం మీర్‌పేట్ పోలీసులు బడంగ్‌పేట్‌లోని ఓ ఇంట్లో సోదాలు జరిపి 20 ప్యాకెట్లలో ఉన్న 40 కేజీల గంజాయిని, మరో ప్రాంతంలో 42 కిలోల గంజాయిని పట్టుకున్నారు.



గంజాయిని చూపుతున్న అడిషనల్ కమిషనర్





**Authorised Dealers For Bajaj Auto Ltd.:** Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545 • Mancherial MAHI BAJAJ 08736-259088, 9912278641 • Adilabad SRR MOTORS 9491249451, 9491159452. **Authorised Service Centre:** JAGITIAL 8522038460, 9949565692, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, JANNARAM 9440004495, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208, CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000, GAJWEL 9848347349, MEDAK 7702014433, SIDDIPET 7702015577.

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
బుధవారం 12 జూన్ 2019
/nt.zindagi

బడి గంట మోగింది.. ఇప్పటికే ఏ స్కూళ్లో చేర్పించాలని.. తల్లిదండ్రులు ఒక నిర్ణయానికి వచ్చేసే ఉంటారు.. బండెడు పుస్తకాలు.. బోలెడు హోమ్‌వర్క్స్.. పరీక్షల ఒత్తిడి.. ఆ పసి ప్రాయాలకు ఇవన్నీ తలకు మించిన భారం.. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు కూడా కార్పొరేట్‌ల వైపు చూపు సారిస్తారు.. కానీ పుస్తకాలే అవసరం లేకుండా.. ఆడుతూ.. పాడుతూ.. వాళ్లకి నచ్చిన రీతిలో పాఠాలు నేర్చుకుంటూ.. ఆ చిరునవ్వు చిదిమేయకుండా.. రంగులమయం చేసేందుకు.. విజన్ రెయిన్‌బో కాన్సెప్ట్ స్కూల్ మొదలైంది.. దీని స్థాపకురాలు నౌషీన్ అహ్మద్.. ఆ స్కూల్ వివరాలు.. ఆమె ఈ స్కూల్ ఎందుకు స్థాపించింది.. ఈ విషయాలన్నీ తెలుసుకోవాలంటే స్టోరీలోకి వెళ్లిపోండి..



# పిల్లల భవిష్యత్తు రంగులమయం!

**మన** స్టూడెంట్స్‌కే ర్యాంకులు రావాలని లెక్చరర్లు.. తమ పిల్లలే ఫస్ట్ రావాలని తల్లిదండ్రులు. చదువు పేరుతో తెచ్చే ఒత్తిడి తట్టుకోలేక ఎంతోమంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. స్టూడెంట్‌కి మార్కులు ఎలా సంపాదించాలో నేర్పడం కాదు. సబ్జెక్ట్ నేర్పాలి. నాలెడ్జ్ ఎలా పెంచుకోవాలో నేర్పండి. ఎప్పుడో రాసిన సిలబస్ ఇప్పటికీ అదే నడుస్తుంది. బయట ప్రపంచం రోజుకు ఒక రంగును పులుముకుంటున్నది. పుస్తకాల జ్ఞానం ఉంటే సరిపోదు. ఈ మాటలు విజన్ రెయిన్‌బో స్కూల్‌కి సరిగ్గా సరిపోతాయి. ఇక్కడ పుస్తకాలు ఉండవు. పరీక్షలు అంతకన్నా ఉండవు. కానీ ఒక విద్యార్థిని ఎలా తయారు చేయాలో, భవిష్యత్తులో ఎలా ఉండాలో మాత్రం నేర్పిస్తామంటున్నది నౌషీన్ అహ్మద్.

**పిల్లల కష్టాలు:** ఉదయం యూనిఫామ్ వేసుకొని బ్యాగ్, లంచ్ తీసుకొని స్కూల్ బస్ ఎక్కిన మొదలు తిరిగి సాయంత్రం ఎప్పుడో ఐదు గంటలకు ఇంటికి చేరుతారు పిల్లలు. ర్యాంకులనే ఒత్తిడి భరించలేక నిద్ర లేవగానే అమ్మా.. కడుపునొప్పి అంటూ మొదలుపెడుతారు. స్కూల్ సమయం అయిపోగానే మామూలైపోతుంది. రెండో రోజు మరొక డ్రామా. ఇలా ఊహ తెలియని వయసులో అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి. తప్పు ఎక్కడుంది. కార్పొరేట్ స్కూల్ అంటూ చెప్పుకొనే యాజమాన్యంలో ఉందా? లేక మార్కులే పరమావధిగా భావిస్తున్న తల్లిదండ్రుల్లో ఉందా? అని ప్రశ్నిస్తున్నది నౌషీన్. విజన్ రెయిన్‌బో స్కూళ్లో బెదిరించే కర్రలు ఉండవు. నచ్చినప్పుడు చదివేలా ఇక్కడ ఏర్పాటు చేశారు.

**పుస్తకం బహుమతి:** నౌషీన్ అహ్మద్‌కు పుస్తకాలంటే ప్రాణం. హైదరాబాద్‌లో ఉండే అన్ని లైబ్రెరీల్లో నైషీన్‌కు అకౌంట్ ఉంది. మార్కెట్లో విడుదల అయిన ప్రతి పుస్తకం నౌషీన్ దగ్గర కచ్చితంగా ఉంటుంది. కొత్త పుస్తకం రాగానే లైబ్రెరీల నుంచి నౌషీన్‌కు కబురు వెళ్తుంది. అందుకే తను పెట్టిన స్కూల్‌లో ప్రత్యేకంగా లైబ్రెరీ ఏర్పాటు చేసింది. అందులో మొత్తం 7,000 పుస్తకాలున్నాయి. నౌషీన్‌కు చదువు చెప్పడం అంటే ఇష్టం. అలా అని ఎప్పుడో వచ్చిన సిలబస్‌ను పట్టుకొని బోర్డు మీద వివరిస్తూ చెప్పడం అంటే కష్టమంటున్నది. పిల్లల కోసం ప్రత్యేకంగా మాంటిస్సోరి విద్యను ప్రవేశ పెట్టాలనుకుంది. ఈ విద్యపై అధ్యయనం చేసింది. దీనికి కావాల్సిన పూర్తి వివరాలు సేకరించింది. ఈ ఆలోచన ఇప్పటిది కాదు 15 యేండ్ల కిందటిది. పిల్లలకు సిలబస్‌లేని చదువు చెప్పాలనుకుంది. భర్త దానిష్ సాయంతో ఒక పాఠశాల స్థాపించింది. దానికి 'విజన్ రెయిన్‌బో స్కూల్' అని పేరు పెట్టింది. అన్ని పాఠశాలల మాదిరిగా ఇది ఉండదు. విద్యకు తగ్గట్టుగా విద్యార్థులు ఉంటారు. వీరికి పుస్తకాలుండవు. పరీక్షలుండవు. టైం టేబుల్ ఉండదు. ఇది హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఉన్నది.

### సంపాదన ఆశించలేదు..

నా భార్య నౌషీన్ మాంటిస్సోరిని పరిచయం చేద్దామంటే. ముందుగా ఆలోచించా. కానీ నౌషీన్ మాత్రం పట్టువదల్లేదు. ఇలాంటి విద్యను అందించాలనుకుంది. ఆమె పట్టుదలను కాదన లేకపోయాను. మానవునికి సంబంధించిన ఏడు చక్రాలు అంటే శరీరం, మెదడు, ఆత్మ మొదలైన వాటిని పరిగణలోకి తీసుకొని ఈ పద్ధతిలోనే చదువు ప్రారంభించాం. విజన్ రెయిన్‌బో పేరుతో హైదరాబాద్‌లో మరెక్కడా లేదు. ఇక్కడ పది వరకు చదువుకున్న స్టూడెంట్స్ ఇంటర్మీడియట్ కోసం వేరే కాలేజ్‌లో చేరుతుంటారు. అక్కడి స్టూడెంట్స్‌తో పోలిస్తే వీరు ఉత్సాహంగా, చురుగ్గా ఉంటున్నారని వారి తల్లిదండ్రులు చెప్పినప్పుడు చాలా సంతోషం వేసింది.

**- దానిష్ అహ్మద్**



**మాంటిస్సోరి విద్య:** ఈ పాఠశాలలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉంటుంది. అయితే 1,2,3 అంటూ తరగతులుండవు. వయసుని బట్టి పదో తరగతిలోపు నాలుగు విడతులుగా విభజిస్తారు. అంటే.. 3-6, 6-9, 9-12, 12-15 యేండ్లు. ఇలా నాలుగు భాగాలుగా ఆయా వయసుతో సెపరేట్ చేస్తారు. 12-15లోపు అంటే పది పూర్తయినట్టు. వీరికి ప్రత్యేకంగా తరగతి గది అవసరం లేదు. ఐదుగురు విద్యార్థులకు ఒక టీచరు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారు. అంతకుమించి ఒకరిని కూడా తీసుకోరు. టీచర్లకు ప్రత్యేకంగా యేడాది పాటు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాతే వారికి బోధించే అవకాశం కల్పిస్తారు. వీరు చెప్పే ప్రతి విషయాన్ని బొమ్మల ఆధారంగా యాక్టింగ్ చేస్తూ విద్యార్థులకు వివరిస్తారు. పుస్తకాలకు బదులుగా యాక్టివిటీలు ఏర్పాటు చేస్తారు. మాంటిస్సోరి అంటే శబ్దాలను బట్టి ప్రనౌన్సియేషన్, ఫొనెటిక్స్ నేర్పిస్తారు.దీంతో విద్యార్థుల్లోని గ్రాస్పింగ్ పవర్‌ను అంచనా వేయవచ్చు.

### రెయిన్‌బో బజార్..

నెలకు ఒకసారి విద్యార్థులతో వర్క్‌షాప్‌లు కండక్ట్ చేపిస్తాం. స్కూల్ పనులన్నింటినీ కో-ఆర్డినేటర్ అరీఫా అహ్మద్ దగ్గరుండి చూసుకుంటుంది. పిల్లలకు కావలసిన ఆటల వర్క్‌షాప్‌లు, టాలెంట్ ప్రోగ్రాములు, వీలైనన్నింటినీ ఉచితంగా కండక్ట్ చేస్తాం. ఇవి అన్ని రకాల వయసు వారికి వర్తిస్తాయి. ఈ నెల జూన్ 30న రెయిన్‌బో బజార్ నిర్వహిస్తున్నాం. అందరూ ఆహ్వానితులే. స్కూల్ వివరాల కొరకు https://www.facebook.com/visionrainbow/ లింక్ క్లిక్ చేయండి. ఇతర వివరాల కోసం ఫోన్ నెం. 9246805664ని సంప్రదించండి.



**సంప్రదాయ ఆటలుఫ:** నైషీన్ అహ్మద్ విద్యార్థులకు చదువు నేర్పడమే కాదు, చదువుతో పాటు ఆటలు, పాటలు, జీవిత సత్యాలు నేర్పిస్తున్నది. కుండల తయారీ, ఫ్యాషన్, బిజినెస్ స్కిల్స్, పెయింటింగ్, ప్రదర్శనలు, కొనుగోలు చేసే పద్ధతి ఇలా అన్ని రకాల స్కిల్స్‌లో విద్యార్థులు నేర్పరులు అవుతారు. ఇక గేమ్స్ విషయానికి వస్తే.. ఇంటర్నేషనల్ క్రీడలతో పాటు పల్లెల్ని గుర్తు చేసేలా తొక్కుడు బిల్ల, కచ్చకాయలు, కర్రబిల్ల వీటితో పాటు మెదడుకు పదును పెట్టే పజిల్స్ చేయిస్తుంటారు. నెలకు ఒకసారి తప్పకుండా పేరెంట్స్ మీటింగ్ ఉంటుంది. అందులో.. ఇంటి దగ్గర విద్యార్థులకు ఎలాంటి వాతావరణం కల్పించాలి. వారితో ఏం పనులు చేయించాలనే విషయాలు తల్లిదండ్రులతో మాట్లాడుతుంది స్కూల్ యాజమాన్యం. విద్యార్థులు ఎలాంటి మూడ్‌లో ఉన్నా వారిని యాక్టివిటీ వైపు మళ్లించడం అక్కడి టీచర్లకు వెన్నతో పెట్టిన విద్య. ఇక ఫీజుల విషయానికి వస్తే 5,000 రూపాయలతో మొదలవుతుంది. ఒక్కో యాక్టివిటీకి ఫీజు ఉంటుంది. వేరే స్కూల్ నుంచి ఇందులో అడుగు పెట్టాలంటే.. విద్యార్థిపై పూర్తి స్టడీ చేశాకే తీసుకుంటారు.



... వనజ వనిపెంట
బేగంపేట్ సంజయ్ చారి

## రూప.. ఫుడ్ డెలివరీ గర్ల్

**జీవితం సజావుగా సాగుతున్నదని అనుకున్నప్పుడే ఏదో ఒకటి జరుగుతుంది. అలాంటప్పుడే ధైర్యంగా ముందుకు వెళ్లాలి. కోల్‌కతాకు చెందిన రూప చౌదరి ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నది. అండగా ఎవరూ లేకపోయినా తనను తాను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నది.**



కష్టాన్ని దాటాల్సి వచ్చినప్పుడు ఆదుకోవడానికి ఒకరు తోడుండాలి అంటారు. అందులో మహిళలకైతే చెప్పనక్కర్లేదు. కానీ కోల్‌కతాకు చెందిన రూప చౌదరికి పదేండ్ల బాబు తప్ప ఎవరూ లేరు. ఇప్పుడు ఆమె బతుకాలి, భవిష్యత్తుగా ఉన్న బాబును బతికించాలి. అందుకే ఆమె జీవనోపాధి మీద దృష్టిపెట్టింది. పురుషులు చేసే పనుల్లోనూ చేరి సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఇటీవల ఓ ఫుడ్ డెలివరీ సంస్థలో కోల్‌కతాలో మొదటి 'డెలివరీ గర్ల్'గా ఈమె వార్తల్లోకి ఎక్కింది. రూప చిన్న వయస్సుల్లోనే తల్లిదండ్రులు, అక్కలు చనిపోయారు. తర్వాత బంధువుల ఇంట్లో ఉండి పెరిగింది. అప్పుడే పెండ్లయింది. బాబు పుట్టిన కొన్ని రోజులకు రూప దంపతుల మధ్య గొడవలు అయ్యాయి. భర్త దూరంగా వెళ్లిపోయాడు. రూప ఒంటరిదైంది. దీంతో రూప ఉపాధి కోసం అనేక మార్గాలు అన్వేషించింది. ఇటీవలే ఫుడ్ డెలివరీ గర్ల్‌గా చేరింది. రూప ఇలాంటి పని చేయడం మొదటిసారేం కాదు. గతంలో ఓ క్యాబ్ సంస్థలో కార్ డ్రైవర్‌గా, బైక్ రైడర్‌గా పని చేసింది. ఇటీవల కోల్‌కతాలో ఓ ఫుడ్ డెలివరీ సంస్థ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో అందులో చేరింది రూప.

## చద్దన్నం మూట విప్పండి!



**పెద్దల మాట చద్దన్నం మూట సామెత బాగా పాపులర్ అయ్యింది. అదే మాదిరిగా ఒకప్పుడు సద్దన్నం కూడా బాగా ఫేమస్సు. ఇప్పడైతే సిటీల్లో అన్నం మిగిలితే చెత్తలో పడేస్తున్నారు. పల్లెల్లో ఫ్రైడ్ రైస్ చేసుకుని తింటున్నారు. సద్దన్నంతో ఎన్ని లాభాలున్నాయో చదవండి.**

- టిఫిన్ అనగానే మనకు గుర్తొచ్చేవి ఇడ్లీ, దోశ, చపాతి, కానీ రాత్రి వండిన అన్నాన్ని తెల్లవారి ఆవకాయ, పెరుగు కలుపుకుని పచ్చిమిరప, ఉల్లిగడ్డ నంజుకుని తింటే రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం.
- చద్ది అన్నంలో పొటాషియం, కాల్షియం, ఐరన్, విటమిన్లు దాదాపుగా 15 రెట్లు అధికంగా ఉంటాయి. ఉల్లిపాయ, మిరపకాయ పెరుగు కలుపుకుని తింటే శరీరంలో వేడి తగ్గి చలువ చేస్తుంది. ఎండాకాలంలో శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది.
- రాత్రిపూట మిగిలిన అన్నంలో కొంచం పాలు, పచ్చి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, కరివేపాకు, జీలకర్ర వేసి కలిపి దానిలో కొంచెం పెరుగు వేసి పొద్దున తింటే అనారోగ్య సమస్యలన్నీ తొలగిపోతాయి. ఎముకలకు బలం కూడా చేకూరుతుంది.
- చద్దన్నం తింటే మంచిదే కదా అని మధ్యాహ్నమో సాయంత్రమో తిందామంటే కుదరదు. తెల్లారిన తర్వాత కూడా ఎక్కువ సమయం అలాగే ఉంచేస్తే పాడైపోయే అవకాశం ఉంది. అందుకే చద్ది అన్నాన్ని ఉదయం 9 గంటల్లోపే తినేయాలి.
- ముందురోజు వండిన అన్నం ఉదయం తీసుకోవడం వల్ల అరుదుగా లభించే విటమిన్ బి6, బి 12ను తేలికగా పొందవచ్చు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. చద్ది అన్నాన్ని వారంలో కనీసం రెండుసార్లు తినే వారిలో రోగనిరోధక శక్తి శాతం ఎక్కువగా ఉంటుంది.

## పాదాలపై పగుళ్లా?

- మైనంను కొద్దిగా వేడిచేసి కరిగిన తర్వాత దాని బరువులో సగభాగం ఆవాల నూనెను కలపాలి. ఒక పాత్రలో కొన్ని నీళ్లు పోసి అందులో నూనెను కలిపిన మైనాన్ని వేయాలి. కొద్దిసేపటి తర్వాత ఆ నీళ్లను గిన్నెలో వడబోయాలి. వడకట్టిన తర్వాత గిన్నెలో పడే పదార్థాన్ని రాత్రి పడుకునే ముందర కాళ్ల పగుళ్లకు పూయాలి. వారం పాటు ఇలా చేస్తే సమస్య తొలిగిపోతుంది.
- రాత్రి పడుకునే ముందు వేడి చేసిన కొబ్బరి నూనెను పాదాల పగుళ్లకు పూసి సాక్సులు వేయాలి. ఉదయం సాక్స్‌లు తీసి వేడి నీళ్లలో పాదాలను 15 నిమిషాలు ఉంచాలి. పగుళ్ల వద్ద నిదానంగా బ్రష్‌తో శుభ్రం చేయాలి.
- 25 గ్రాముల మైనం, 100 గ్రాముల ఆవాల నూనెను వేసి, ఒక పొంగు వచ్చే వరకు మరిగించాలి. నూనె చల్లారక ముందే ఒక వెడల్పాటి మూతి కలిగిన పాత్రలో నిల్వ చేసుకోవాలి. చల్లారిన తర్వాత ఆయింట్‌మెంట్ మాదిరిగా తయారవుతుంది. దీన్ని పగుళ్ల వద్ద పూస్తే అవి తొలిగిపోతాయి.
- పాదాలు బాగా పగిలితే రాత్రి సబ్బుతో కడిగి పొడి బట్టతో తుడవాలి. తర్వాత నువ్వుల నూనె రాయాలి. సాక్సులు ధరించి నిద్రపోవాలి. ఉదయం మళ్లీ సబ్బుతో కడిగితే సరిపోతుంది.


**ఆముదం, రోజ్‌వాటర్, నిమ్మరసంను సమపాళ్లలో కలిపి, పాదాలు పగిలిన చోట ప్రతి రోజు 2 సార్లు లేదా 3 సార్లు పూస్తే పాదాల పగుళ్లు మాయమవుతాయి. వారం పాటు క్రమం తప్పకుండా చేస్తే మంచిది.**



## సేంద్రియ పద్ధతిలో కూరగాయలు

**ప్రతిరోజూ తీసుకునే కూరగాయలను పురుగు మందులతోనే ఎక్కువగా పండిస్తున్నారు. దీనివల్ల ఆ కూరగాయలు విషతుల్యంగా మారి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. అటువంటి సమస్యను పరిష్కరించేందుకు సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తూ భవిష్యత్ తరాలకు ఆరోగ్య సందేశమిస్తున్నదీ 62 యేండ్ల బామ్మ.**





బయట కూరగాయలు కొనాలంటే జనాలు భయపడాల్సి వస్తున్నది. ఆ కూరగాయలు ఎన్నిరకాల క్రిమి సంహారక మందులు వేసి పండించారోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితులున్నాయి. అందుకే అహ్మదాబాద్‌కు చెందిన 62 యేండ్ల భావన షా తన ఇంటి ఆవరణలోనే సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నది. భావనాషా భర్త నితిన్‌తో కలిసి ఉద్యోగరీత్యా ముంబైలో కొన్నాళ్ల పాటు ఉండాల్సి వచ్చింది. అక్కడ కాలుష్య వాతావరణంలో ఉండలేక ఆమె భర్త రిటైర్ అయిన తర్వాత అహ్మదాబాద్‌కు వచ్చేశారు. కాలుష్యానికి దూరంగా ఉండాలనుకున్నారు. అందుకోసం తమ పెరట్లో ఆకు కూరలు, పలురకాల కాయలు పండించడం ప్రారంభించారు. వర్షం నుంచి వచ్చిన నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలు తవ్వించారు. తద్వారా వర్షపు నీటిని నిల్వ ఉంచి సేంద్రియ సాగు మొదలు పెట్టారు. ఇంటిపై 10,000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఓ ట్యాంక్‌తోపాటు, విద్యుత్ కోసం 12 సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 20 రకాల కూరగాయలు, పండ్లను పండిస్తున్నారు. తమకు కావల్సినప్పుడల్లా తాజా కూరగాయలను కోసుకొని తింటూ ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నామని చెబుతున్నది భావన షా. తోటకు కావాల్సిన సేంద్రియ ఎరువులను వారే తయారు చేసుకుంటూ, హానికరమైన వాతావరణానికి దూరంగా ఉంటున్నారు.

## నవజాత శిశువుల ఆలనా పాలనా!



- బాబు పుట్టిన నెల రోజుల్లోనే సున్నితంగా ఎక్కువ ఒత్తిడి లేకుండా మర్దన చేయాలి. క్రమంగా ఒత్తిడితో మర్దన చేయాలి. మర్దనా చేసే ముందు మీరు విశ్రాంతిగా ఉండాలి. మర్దన చేసేముందు మీ చేతులని 2-3 సార్లు రుద్దుకుంటే చేతులు వేడెక్కుతాయి.
- మీ చేతికి గోళ్లు లేకుండా చూసుకోవడం మంచిది. గుళ్లు పెరిగి ఉంటే శిశువుకు గుచ్చుకునే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత వేడి నీళ్లతో ముందు వీపు మీద, ఆ తర్వాత తల మీద పోసి స్నానం చేయించి తెల్లని తువ్వాలుతో తుడవాలి.
- స్నానం అనంతరం పాలు పట్టించి పడుకోబెట్టాలి. స్నానం శిశువులకు మంచి నిద్ర, సుఖాన్ని ఇస్తుంది. శిశువు స్నానం ఆయాలకి, అనర్హులకు అప్పజెప్పడం కంటే మీరే చేయిస్తే మీ చేతి స్పర్శతో మరింత అనుబంధం పెరుగుతుంది.
- శిశువులకు ఆరు నెలల వరకు నీటితో అవసరం ఉండదు. సమయమేదైనా శిశువులు ఏడిస్తే పాలు పట్టిస్తే చాలు. కొన్ని సందర్భాల్లో డాక్టర్ సూచనల మేరకు మాత్రమే పాల ఉత్పత్తులు గానీ, ఇతర ద్రవాలను గానీ పట్టించాలి. చిన్నారుల విషయంలో స్వంత నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది.

# త్రీడీ హోలోగ్రామ్స్ సర్కస్

**సర్కస్‌లో వివిధ జంతువుల విన్యాసాలు చిన్నా, పెద్ద అనే తేడాల్లేకుండా అందరినీ ఎంతో అబ్బుర పరుస్తుంటాయి. ఇలా మూగ జీవులను హింసించడం నేరమని పలు జంతు సంరక్షణ సంస్థలు కోరడంతో జర్మనీ దేశంలో సర్కస్‌లో వాటి వేధింపులకు తెరపడింది. టెక్నాలజీని ఉపయోగించి జంతువుల స్థానంలో త్రీడీ హోలోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టగా ఇదిప్పుడు ట్రెండింగ్ అవుతున్నది.**

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పలురకాల సాధు జంతువులతోపాటు, క్రూర జంతువులను త్రీడీ హోలోగ్రామ్ రూపంలో రూపొందించి సర్కస్ విన్యాసాలను ప్రదర్శిస్తున్నారు. జంతువులను హింసించకుండా ఉండేందుకు జర్మనీలోని ఓ సర్కస్ కంపెనీ ఈ వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నది. త్రీడీ హోలోగ్రామ్స్ రూపంలో జంతువులు జనాల మీదకు దూసుకెళ్లినా ఎటువంటి ప్రమాదం వాటిల్లదని సర్కస్ నిర్వాహకులు చెబుతున్నారు. పేరుకే టెక్నాలజీ కానీ, అచ్చం నిజమైన జంతువులు కండ్ల ముందు కదలాడినట్లు అనిపిస్తుందని వారు అంటున్నారు. 'సర్కస్ రాన్కాల్లి' అనే సంస్థ జంతువుల రూపంలో 3డీ హోలోగ్రామ్స్‌ను రూపొందించింది. తొలిసారిగా వీటిని జర్మనీలో ప్రవేశపెట్టారు. ఏనుగులు, గుర్రాలు, ఇతర జంతువుల హోలోగ్రామ్స్ పలు రకాల విన్యాసాలతో ప్రేక్షకులను అలరిస్తున్నాయి. సర్కస్‌లో భాగంగా డమ్మీ జంతువులు చేసే హూంకార, గీంకారాలతో శబ్దాలు అద్భుతంగా ఉన్నాయని, నిజం జంతువులే చేసినట్లుగా అనిపిస్తుందని ప్రేక్షకులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో అన్ని దేశాలకూ రానున్న ఈ త్రీడీ హోలోగ్రామ్ జంతువులను గురించి సోషల్‌మీడియాలో చర్చ జరుగుతున్నది.



# నిశ్శబ్దంపై అవగాహన



**ధగ ధగ ధగ మంటూ ఓ ద్విచక్ర వాహనం వీధిలోకి వస్తే నిద్రపోతున్న పిల్లలు లేచి గుక్కపెట్టి ఏడిసేవాళ్లు. అది ఆ యువకుడికి పరమ చిరాకుగా అనిపించింది. బయటికి వెళ్తే ట్రాఫిక్‌లోనూ ఇదే లొల్లి. అవసరం లేకున్నా ఇష్టం వచ్చినట్లు కొట్టే హారన్ల చప్పడు తట్టుకోలేకపోయేవాడు. ఇది అందరి సమస్యగా భావించి శబ్దకాలుష్యం తగ్గించేందుకు ఓ ప్రయత్నం చేశాడు. మార్పు సాధించాడు.**

బెంగళూరుకు చెందిన ఆదినారాయణన్, భారతి దంపతులు. ఇద్దరు స్థానికంగా ప్రయివేటు ఉద్యోగాలు చేస్తున్నారు. తరచూ వాళ్లుండే వీధిలో పెద్ద శబ్దం చేస్తూ స్థానిక యువకులు వెళ్తుండేవారు. ఎన్నోసార్లు శబ్దం చేయవద్దని చెప్పినా అక్కడి యువకులు వారి మాట వినకపోయేవారు. ఒకరోజు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆదినారాయణ్, భారతి కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక శబ్దం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆ తర్వాత గొడవ సద్దుమణిగినప్పటికీ ఆ దంపతుల్లో నిరాశే ఉండేది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, హైవే మీద ఇలా ఎక్కడ పడితే అక్కడ శబ్ద కాలుష్యం పెరుగుతూనే ఉందని వారు గ్రహించారు. శబ్ద కాలుష్యం తగ్గించేందకు జూలై 2016లో కోయంబత్తూర్ నుంచి బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలను చుట్టివచ్చారు. హారన్ వాడకుండా తమ జీప్‌లో 15 వేల కిలోమీటర్లు ప్రయాణించారు. తాము ప్రయాణిస్తున్న మార్గంలో వేలాది కూడళ్ల వద్ద, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద హారన్ వాడకంపై అవగాహన కల్పించారు. హారన్ అవసరం మేరకే వాడలని లేబుల్స్‌ను వాహనాలపై అంటించారు. సిగ్నల్స్ పడిన సమయంలో వాహనదారులకు శబ్దకాలుష్యంపై అవగాహన కల్పించారు. వీరి ప్రయత్నం ఎంతోమందిలో మార్పు తెచ్చింది.

## కూర్చునే తినండి



**యువత చాలా బిజీగా ఉన్నది. కనీసం తిండి తినేంత సమయం కూడా దొరకనంత బిజీ వాళ్లది. అంతా ఫాస్ట్ ఫాస్ట్‌గా చేసేస్తుంటారు. అయితే.. ఏది ఎలా చేసినా తిండి మాత్రం కూర్చునే తినమంటున్నారు నిపుణులు.**

బిజీ లైఫ్‌లో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని యువత కొన్ని ఆహార నియమాలను పాటించాలని సూచిస్తున్నారు ఫ్లోరిడా పరిశోధకులు. యువత భోజనం చేసే విధానంపై అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా పరిశోధక బృందం అధ్యయనం చేసింది. బిజీలో పడి యూత్ బఫే సిస్టంకు అలవాటు పడ్డారని.. ఆరోగ్యపరంగా అది ఎంత మాత్రం మంచిది కాదని చెప్తున్నారు. దీనివల్ల హైపోథాలమిక్ పిట్యుటరీ అడ్రినల్ సమస్యలు ఏర్పడుతాయన్నారు.



**మ్యాచ్ స్టార్ట్ అయిందా? స్కోరెంత? బ్యాటింగ్ ఎవరిది? గెలుస్తుండొచ్చా? అంటూ యువతకు 'క్రికెట్ వరల్డ్ కప్' ఫీవర్ పట్టుకుంది! కానీ.. క్రికెట్ ఒక్కటే ఆటనా? వుడ్‌బాల్ లాంటి ఆటలు ఎన్ని లేవు? ఆదర్శ్‌లాంటి వుడ్‌బాల్ ఆణిముత్యాలు ఎంతమంది లేరు? అందరూ క్రికెట్ వెంట పరుగులు తీస్తుంటే తాను వుడ్‌బాల్‌లో ఆరితేరి వరల్డ్‌కప్‌కు ఎంపికైన కందిక ఆదర్శ్ పరిచయం ఈ కథనం.**



# వుడ్‌బాల్ ఆణిముత్యం

**ఉడ్‌బాల్ ఆటనా? ఇదెలా ఉంటుంది? అని చాలామంది ఆశ్చర్యానికి గురవుతుంటారు. ఇదో అంతర్జాతీయ క్రీడ. పచ్చని మైదానాల్లో లేదా ఇసుక మీద ఆడే ఆట. ఒలింపిక్స్‌లో కూడా వుడ్‌బాల్‌కు అవకాశం ఉంది. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడే ఉల్లాసవంతమైన ఇండోర్ గేమ్. చాలా తక్కువమంది ఛాంపియన్లు ఉన్న వుడ్‌బాల్ ఆటనే ఎంచుకున్నాడు తెలంగాణ తేజం జనగామ జిల్లా చెన్నూరు యువకుడు ఆదర్శ్.**



**ఎవరు ఆడతారు? :** తైవాన్‌లో ఎక్కువగా ఆడే వుడ్‌బాల్ చూడటానికి చాలా క్లాసీగా కనిపిస్తుంది. ఈ ఆటను 2008లో ఏషియన్ బీచ్‌గేమ్స్‌లో విలీనం చేశారు. అదే సంవత్సరం ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియాలో చేర్చారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఉడ్‌బాల్‌ను ఆడుతున్నాయి. అరిస్ సుమరియాంటో, కిమ్ ప్యో హ్వాన్ లాంటి తక్కువ మంది ఛాంపియన్లు ఈ ఆటలో ఉన్నారు. అలాంటి అరుదైన ఆట కోసం కలలుగని వాటిని సాకారం చేసుకున్నాడు ఆదర్శ్. తెలంగాణలోని ఓ గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన అతను ఒలింపిక్స్‌లో ప్రవేశమున్న ఇలాంటి ఆటలో రాణించడం మనందరికీ గర్వకారణం.

**ఎలా ఆడతారు?:** చెక్కతో చేసిన బాల్ ఉంటుంది. దానిని బ్యాట్‌తో కొద్దిదూరంలో ఉన్న వికెట్స్‌కు కొడతారు. బాల్ సెంటర్ వికెట్‌ను కొట్టాలి. వుడ్‌బాల్ ఆటలో బ్యాట్‌ను మాలెట్ అనీ.. వికెట్స్‌ను గేట్ అని అంటారు. ఇలా కొన్ని రౌండ్లు ఉంటాయి.

**ఆదర్శ్ ప్రవేశం ఎలా? :** 2014లో ఆదర్శ్ పదో తరగతి పూర్తి చేసి వరంగల్‌లోని ఇంటర్‌లో చేరాడు. ఆ సమయంలో చెన్నూర్‌కు చెందిన పీఈటీ సందీప్‌ను వుడ్‌బాల్ గేమ్‌లో ప్రోత్సహించారు. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా సందీప్ ఆదర్శ్‌కు వుడ్‌బాల్ నేర్పించేవారు. ఆదర్శ్ వేరే వ్యాపకం ఏమీ లేకుండా సెలవు వచ్చిన ప్రతిసారి ఊరికొచ్చి సందీప్ వద్ద దీనిని నేర్చుకునేవాడు. అదే పనిగా ప్రతిరోజు నాలుగింటికి లేచి 8 గంటల దాకా ప్రాక్టీస్ చేసేవాడు. ఓ వైపు చదువుకు ఆటంకం కలుగకుండా మరో వైపు ఆటలో రాణిస్తూ ఆదర్శ్ ఇంటర్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతుండగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం వచ్చింది.

**దక్షిణాదిలో ఒకే ఒక్కడు:** వుడ్‌బాల్‌లో ప్రావీణ్యం సాధించిన ఆదర్శ్ 2017లో మహారాష్ట్రలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. అనంతరం కొన్ని రోజులకు ఆదర్శ్‌కు ఒక లెటర్ వచ్చింది. మలేషియాలో జరిగే అంతర్జాతీయ వుడ్‌బాల్ పోటీల్లో పాల్గొనాలని ఆ లెటర్ సారాంశం. ఈ పోటీల్లో దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఒకే ఒక్కడు ఆదర్శ్. విశేష ప్రతిభ కనబర్చినప్పటికీ అక్కడి పిచ్ సమస్య కారణంగా విజయాన్ని అందుకోలేకపోయాడు. అయినప్పటికీ ఏ మాత్రం నిరాశకు లోనవకుండా ఆటను మరింత ప్రాక్టీస్ చేశాడు. ఇది వరకటి ఆటలో ప్రతిభ కనబర్చిన ఆదర్శ్ కు మహారాష్ట్ర వుడ్‌బాల్ బోర్డు వరల్డ్ కప్ పోటీలకు ఆదర్శ్ ఎన్నికైనట్లు లేఖ పంపింది.

**టార్గెట్ 2020:** 2018లో థాయిలాండ్‌లో నిర్వహించిన వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొని ప్రత్యర్థి పాకిస్తాన్ మీద 17 పాయింట్లు సాధించాడు. కంబోడియా, కొరియా, శ్రీలంక, ఉక్రేన్‌లపై విజయం సాధించాడు. ఉగండాపై ఆడి ఒక్క పాయింట్ తేడాతో ఓడిపోయాడు. ఉగండాపై గెలిస్తే సెమీ ఫైనల్‌కు చేరుకునే వాడు. 2020లో జరిగే ఏసియన్ బీచ్ గేమ్‌లో ఇండియాకు మెడల్ తేవడమే లక్ష్యంగా ఆడుతున్నాడు ఆదర్శ్. 2020లో విజయం సాధిస్తానని ధీమాగా చెబుతున్నాడు.

**నాన్నే ఆదర్శం :** ఆదర్శ్ వాళ్ల నాన్న అంజయ్య పోస్ట్ మాస్టర్. బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కూడా. 1989లోనే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఎన్నో అవార్డులు అందుకున్నారు. కుటుంబ బాధ్యతలు మీద పడడంతో, ఆర్థిక స్థోమత లేక ఆటకు దూరమయ్యారు. ఉద్యోగ రీత్యా బిజీగా ఉండే అంజయ్య సమయం దొరికినప్పుడల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేవారు. తాను సాధించలేని విజయాలను తన కొడుకు సాధించాలని కలలు కన్నాడు. ఆదర్శ్ మూడో తరగతిలో ఉన్నప్పటి నుంచే ప్రతీరోజు ఉదయం నాలుగింటికి ఊరి చివరి ఖాళీ స్థలంలో ఆడించేవారు.

**రచయిత కూడా:** ఆదర్శ్ వుడ్‌బాల్ ఆటలోనే కాకుండా సామాజికాంశాలపైనా స్పందిస్తున్నాడు. గ్రహాంతర వాసులు ఉన్నారా? ఉంటే ఎలా ఉంటారు. ఎక్కడుంటారు? భూమి పుట్టుకనుంచి గ్రహాంతర వాసులకు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయా? ఇలా అన్నింటినీ క్రోడీకరిస్తూ 200 పేజీల వరకు రాశాడు. ఇందులో మనకు తెలియని ఎన్నో ఆసక్తికర అంశాలు ఉన్నాయి. ఇవే కాకుండా 'మన సంస్కృతి', 'ఇదీ మన చరిత్ర' అంటూ ఎన్నో కొత్త విషయాల్ని తన అక్షరాల్లో బంధించాడు. వీటిని పుస్తకం వేస్తానని ఆదర్శ్ చెబుతున్నాడు.

**యూనివర్సిటీల ఆహ్వానం :** రైలుపట్టాల్లాగా ఆదర్శ్ జీవితంలో క్రీడలు, చదువు సమానంగా సాగాయి. అంతర్జాతీయ వ్యవహారాలపై ఆసక్తి ఉండడంతో ఐర్ స్టూడెంట్ అప్డేట్స్‌ను తరచూ ఫాలో అవుతూ ఉండేవాడు. ఇంటర్న్‌షిప్‌కోసం ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీ క్లబ్‌లు నిర్వహించిన పరీక్షలో ఆదర్శ్ ఉత్తీర్ణుడయ్యాడు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షలో 'మతం– మౌఢ్యం' అనే అంశంపై అప్పటికప్పుడు వ్యాసం రాశాడు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్శిటీ క్లబ్‌లు తాము నిర్వహించే సదస్సులో పాల్గొని ప్రసంగించాల్సిందిగా ఆహ్వానం పంపాయి. ఈ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయా యూనివర్శిటీ జర్నల్స్‌లో ప్రచురిస్తాయి. అనంతరం ఆ విద్యార్థి చదువుకున్నన్ని రోజులు ఉపకార వేతనం పొందుతాడు.



**మెడల్ నా లక్ష్యం**

ప్రస్తుతం డిగ్రీలో బీఏ చదువుతున్నా. ఐఏఎస్ అధికారిని కావాలని నా జీవిత కల. 2020లో ఏసియన్ బీచ్ గేమ్‌లో ఇండియాకు మెడల్ తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఇందుకోసం రోజుకు 8 గంటలు కష్టపడుతున్నా. ఎండా, వాన ఏమీ లెక్క చేయకుండా సాధన చేస్తున్న. రెప్పపాటులో విజయం నా నుంచి దూరమైంది. ఈసారి కచ్చితంగా మెడల్ సాధిస్తా అనే బలమైన నమ్మకం ఏర్పడింది. వుడ్‌బాల్ ఆటలో నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలు నిర్వహించే సదస్సుకు రమ్మని ఆహ్వానం పంపించాయి. ఆర్థిక స్థోమత లేని కారణంగా సదస్సుకు హాజరు కాలేకపోతున్నా. ప్రభుత్వం సహకరించాలని వేడుకుంటున్నా.

**- కందిక ఆదర్శ్**

... పడమటింటి రవికుమార్

# పచ్చదనాన్ని కాపాడేందుకు..



**ప్రకృతి మనకు అందమైన వాతావరణాన్ని ఇచ్చింది. దానిని కాపాడుకోవడంలో ఎక్కువగా మానవ తప్పిదాలే కనిపిస్తున్నాయి. పలురకాలుగా మన చుట్టూ ఉన్న మంచి వాతావరణాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నాం. పరిశుభ్రత, పచ్చదనం సరిగా లేకపోవడం వల్ల మనుషులేకాదు పెంపుడు జంతువులూ తొందరగా తనువు చాలిస్తున్నాయి. వాటి జ్ఞాపకార్థం బెంగళూరుకు చెందిన ఓ లా విద్యార్థి వినూత్నంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.**

బెంగళూరుకు చెందిన ప్రమోద్ అనే యువకుడు సిలికాన్ వ్యాలీలో లా చదువుతున్నాడు. బెంగళూరు నగరంలో అంతరించి పోతున్న పచ్చదనాన్ని పెంచేందుకు వినూత్న ఆలోచన చేశాడు. పెంపుడు జంతువులను పోషించే యజమానుల కోసం ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టును రూపొందించాడు. ఏదోక జబ్బుతో ప్రతి ఏటా పెంపుడు జంతువులు చనిపోతుంటాయి. వాటిని ఎక్కడ పడితే అక్కడ భూమిలో పూడ్చేస్తూ ఉంటారు. దాని వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అలా దెబ్బతినకుండా ఉండేందుకు ఆయా జంతువులను భూమిలో పూడ్చకుండా కాల్చడం వల్ల కొంతమేర ప్రకృతిని కాపాడిన వారమవుతామని వారికి అర్థమయ్యేలా వివరించాడు. ఇటలీలో చనిపోయిన పెంపుడు జంతువులను కాల్చి, తద్వారా వచ్చిన బూడిదను మొక్కలకు ఎరువుగా వేస్తున్నారు. అదే ప్రాజెక్టును బెంగళూరులోనూ ప్రారంభించాడు. ఈ ప్రాజెక్టు కింద బెంగళూరు నగరంలో చనిపోయిన పెంపుడు జంతువును కాల్చివేసి, ఆ బూడిదను వాటి జ్ఞాపకార్థకంగా ఓ మొక్కను నాటించి ఎరువుగా వేస్తున్నాడు.

# అలియా ఫ్యాషన్ ప్రచారం

**అలియా భట్ సినిమాల్లోనే కాదు.. సామాజిక కోణంలోనూ క్రియా శీలంగా పాల్గొంటున్నది. గతంలో పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న అలియా తాజాగా పర్యావరణం కోసం ప్రచారం చేస్తున్నది.**

'మైసు' ఫ్యాషన్ గురించి తెలుసా? దుస్తులను రీసైకిల్ చేసి ఎలా వినియోగించుకోవచ్చు అనేది దీని ప్రధాన ఉద్దేశం. మైసు ఫ్యాషన్‌గా పిలిచే దీని పూర్తిపేరు మై వార్డ్‌రోబ్.. సు వార్డ్‌రోబ్'. దీనిని ఒక క్యాంపెయిన్‌లా నిర్వహిస్తుండగా అలియా భట్ దానిని ప్రమోట్ చేస్తున్నది. పాతబట్టలను పారేయ కూడదు. వాటిని అందంగా డిజైన్ చేసి కొత్తవాటిగా మార్చాలి. వార్డ్‌రోబ్‌లు పాత బట్టలతో కాకుండా రీసైకిల్.. రీడిజైన్ చేసిన ఇలాంటి దుస్తులతో కనిపించాలి అని అలియా అవగాహన కల్పిస్తున్నది. సాల్ట్ స్కౌట్ డాట్ కమ్ ద్వారా ఇలా కొత్తగా డిజైన్ చేసిన దుస్తువులను అమ్ముతున్నారు. వాటిని ది కోర్బెట్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు. అనుష్క శర్మ కూడా ఈ క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నది. అనుష్క నుంచి ఛాలెంజింగ్‌గా ఈ క్యాంపెయిన్‌ను తీసుకొని అలియా సమాజం పట్ల తనకున్న బాధ్యతను.. తనలోని సేవా గుణాన్ని చాటుతున్నది అని సోషల్‌మీడియాలో ప్రశంసలు గుప్పిస్తున్నారు కొందరు. అయితే ఫ్యాషన్‌ను సేవ కోసం వినియోగించడం చాలా బాగుందనీ.. మనకు అవసరం రానిది ఇతరులకు అవసరం వస్తుందనే బాధ్యతతో ఏది చేసినా ఫలితం మంచిగానే ఉంటుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



## సుడోకు

**డైలీ సుడోకు 60 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 8 | 1 | 2 | 4 | 7 | 3 | 6 | 5 |
| 5 | 7 | 3 | 1 | 8 | 6 | 9 | 4 | 2 |
| 4 | 2 | 6 | 5 | 9 | 3 | 7 | 8 | 1 |
| 2 | 5 | 4 | 6 | 3 | 1 | 8 | 7 | 9 |
| 1 | 6 | 8 | 7 | 2 | 9 | 4 | 5 | 3 |
| 7 | 3 | 9 | 4 | 5 | 8 | 2 | 1 | 6 |
| 8 | 4 | 2 | 9 | 6 | 5 | 1 | 3 | 7 |
| 6 | 9 | 7 | 3 | 1 | 4 | 5 | 2 | 8 |
| 3 | 1 | 5 | 8 | 7 | 2 | 6 | 9 | 4 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.


సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -61**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 7 | | 3 | | | | | |
| | | | 1 | | 4 | 8 | | |
| | 3 | 4 | | 2 | 9 | | | |
| 3 | | | | | | | | |
| | | 7 | 2 | 4 | 8 | 5 | | |
| | | | | | | | | 6 |
| | | | 8 | 7 | | 9 | 2 | |
| | | 2 | 5 | | 1 | | | |
| | | | | | 2 | | 8 | 5 |

## ట్వీట్

**వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి** @ysjagan



**అక్బరుద్దీన్ ఓవైసీ ఆరోగ్యం వేగంగా మెరుగుపడి అతడు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను.**

జగన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య 1,038,415

## కామన్‌మ్యాన్ వాయిస్

యువీ అండర్–19 నుంచి ఎదిగి వచ్చిన అద్భుతమైన బ్యాట్స్‌మన్. ప్రపంచ కప్‌కోసం 27 ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్న కోట్లాదిమంది భారతీయుల కలను నిజం చేయడంలో కీలకపాత్ర యువరాజ్ దే.

– Raju Asari

నా క్లయింట్ రవిప్రకాశ్ మొబైల్ డేటా ఎట్లా కోర్టులో ప్రవేశపెడతారు?: రవి ప్రకాశ్ తరపు లాయర్
అవును సార్.. నిజమే. కానీ మీ క్లయింట్ తప్పు చేసినోళ్ల బండారం బయటపెట్టడానికి మంది ఆఫీసులల్లో దొంగ కెమెరాలు పెట్టడాన్ని ఏమంటారు?

– Katpally Santosh Reddy

## వైరల్ వీడియో




**అదొక పంజాబీ సాంగ్. కానీ దేశమంతటా ఊపు ఊపేస్తున్నది. ట్రెండింగ్‌లో టాప్‌వన్‌గా నిలిచి తేరెబిన్ కీవే రవాంగీ అని కేరింతలు కొట్టిస్తున్న ఈ వీడియో మీరూ చూడండి.**

Tere Bin Kive – Official Music Video | Ramji Gulati | Jannat Zubair & Mr. Faisu
Total views : 12,179,516+
Published on Jun 9, 2019

టెక్నాలెడ్జీ 2.0

ఏదైనా చిన్న అవకాశం దొరికితే వేల కోట్ల రూపాయలు కొల్లగొడుతుంటారు హ్యాకర్స్. క్షణాల్లోనే వెబ్‌సైట్స్‌ను హ్యాక్ చేస్తూ.. బాధితుల నుంచి కోట్ల రూపాయాలు గుంజుతుంటారు. డేటా దొంగించి నానా తిప్పలు పెడుతుంటారు. ఒక్కోసారి డేటా నాశనం చేస్తూ, వైరస్‌లు, స్పామ్‌లు సృష్టిస్తూ రకరకాలుగా ఇబ్బంది పెడుతుంటారు. అయితే ఇక నుంచి హ్యాకర్ల ఆటలు సాగవు. వారి పాలిట యముడిలాంటి సాఫ్ట్‌వేర్ వచ్చేసింది. సమాచార సంరక్షణకు వజ్రాయుధంగా మారింది.

### ఉపయోగాలు ఇవీ..

బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అన్ని రంగాలకూ ఉపయోగకరమే. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ నుంచి ప్రభుత్వాలను నిర్ణయించే ఓటింగ్ వరకూ అన్నింటిలోనూ దీన్ని ఉపయోగించొచ్చు. ఇది పారదర్శకత, నమ్మకాన్ని కలిగిస్తుంది. మోసాలకు తావుండదు. అందరి అంగీకారంతోనే ఏ వ్యవహారమైనా నడుస్తుంది. అధికారులు, లేదా రాజకీయ పార్టీల ఇష్టాయిష్టాలతో పని లేకుండా సంక్షేమ పథకాలు ప్రభుత్వాల నుంచి నేరుగా లబ్ధిదారులకు అందుతాయి. బ్లాక్ చెయిన్ టెక్నాలజీకి సంబంధించిన స్మార్ట్ కాంట్రాక్టును ఉపయోగించుకొని ఆస్తి కొనుగోలు చేస్తే దానికి సంబంధించిన అన్ని వివరాలు స్పష్టంగా ఉంటాయి. సమాచార భద్రతకు ఢోకా ఉండదు. కొన్న వ్యక్తి ఎవరో.. అమ్మిన వారు ఎవరో కూడా తెలియదు. షాపింగ్‌తో మొదలు.. టెక్నాలజీని ఉపయోగించే ఏ రంగంలోనైనా బ్లాక్ చెయిన్ ఉపయోగపడుతుంది.

# హ్యాకర్ల పాలిట యముడు!



సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రధానమైన సవాలు హ్యాకింగ్. దీని వల్ల జరిగే నష్టం మాటల్లో చెప్పలేనిది. లెక్కల్లో అందనిది. ఈ హ్యాకింగ్ నుంచి తప్పించుకోవడానికి, హ్యాకర్ల భారిన పడకుండా ఉండటానికి ఎప్పటికప్పుడు పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఎక్కడో ఓ చోట పంజా విసురుతూనే ఉన్నారు హ్యాకర్స్. ఈ నేపథ్యంలో వారి మైండ్ బ్లాంక్ అయ్యే సాఫ్ట్‌వేర్ వచ్చేసింది. అదే 'బ్లాక్ చెయిన్' టెక్నాలజీ. వైరస్, హ్యాకింగ్, స్పామ్, బగ్ వంటి ఎన్నో రకాల చికాకుల నుంచి రక్షించడానికి వజ్రాయుధంలా వచ్చేసింది. తక్కువ ఖర్చు, పారదర్శకత, వేగం, కచ్చితత్వం దీని ప్రత్యేకతలు. అందుకే ఇది అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది.

### ఒక్కో లావాదేవీ.. ఒక బ్లాక్


బ్లాక్ అంటే ఒక భాగం. ప్రతి లావాదేవీ.. అందులో భాగమైన వారందరి వివరాలు ఒక్కో బ్లాక్‌గా ఏర్పడతాయి. ఒకవేళ ఈ బ్లాక్‌లో ఉన్నవారితో ఇంకో లావాదేవీ జరిగిందనుకోండి. అది మునుపటి బ్లాక్‌కు అనుబంధంగా ఇంకో ప్రత్యేకమైన బ్లాక్‌గా ఏర్పడుతుంది. ఇలా బ్లాక్‌లన్నీ వరుసగా ఒక చెయిన్ మాదిరిగా ఏర్పడతాయి. మొత్తం చెయిన్లో ఎక్కడ మార్పులు జరిగినా.. అది ఆ లావాదేవీ నమోదైన బ్లాక్‌లో రీ ఎంటర్ అవుతుంది. పది నిమిషాలకు ఒకసారి బ్లాక్‌లోని వివరాలు నెట్‌వర్క్‌లో ఉండే అందరి కంప్యూటర్లలోకి చేరి.. లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నదీ లేనిదీ సరిచూసుకుంటాయి. ఈ క్రమంలో ఎక్కడ తేడా వచ్చినా ఆ విషయాన్ని నెట్‌వర్క్‌లో ఉన్న వారందరికీ తెలియజేస్తాయి. ఒక నెట్‌వర్క్ పరిధిలో వేల నోడ్స్ ఉంటాయి. దీనివల్ల మోసం అనేది అసాధ్యం. బ్లాక్ చెయిన్ వ్యవస్థ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి పబ్లిక్ బ్లాక్ చెయిన్. అంటే.. అందరికీ అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వాలు, ప్రజలకు సంబంధించిన లావాదేవీలను నమోదు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకునేది. రెండోది ప్రైవేట్. కంపెనీలు, వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసుకునేది.

### గ్రూపుల ఆధీనంలో సమాచారం

ఈ బ్లాక్ చెయిన్ టెక్నాలజీలో ఎంతమందైనా సమాచారం ఎంటర్ చేయవచ్చు. సరి చేయవచ్చు. అప్డేట్ చేయవచ్చు. అయితే ఆ సమాచారమంతా ఒకేచోట కేంద్రీకృతమై ఉండదు. మిలియన్ల కంప్యూటర్లలో ఉంటుంది. ఒక్కరి కంట్రోల్లో ఉండదు. ఒక గ్రూప్ యూజర్ల ఆధీనంలో ఉంటుంది. దీంతో హ్యాకర్లకు ఈ సమాచారాన్ని నాశనం చేయడం కుదరదు. వినడానికి అద్భుతంగా అనిపించినా ఇది నిజమే. అదే బ్లాక్ చెయిన్ ప్రత్యేకత. ఈ టెక్నాలజీలో డేటా (సమాచారం) అంతా బ్లాకులుగా నిక్షిప్తం అవుతుంది. అవన్నీ ఒకదానికొకటి అనుసంధానమై ఉంటాయి. అందుకే దీన్ని బ్లాక్ చెయిన్ అంటారు. పాత సమాచారం ఉంటుంది. సరికొత్త డేటా అప్‌డేట్ అవుతుంటుంది. దానిని మార్చడం, తొలగించడం తేలిక కాదు. లావాదేవీలన్నీ బ్లాక్‌లో ఎన్‌క్రిప్ట్ అవుతూ ఒక బ్లాకుగా మారి.. కంప్యూటర్ నెట్‌వర్క్‌లో స్టోర్ అవుతాయి.

### భద్రతకు మారుపేరు

ప్రస్తుత మార్కెట్లో సమాచార నిల్వ కోసం పలురకాల డేటా స్ట్రక్చర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే బ్లాక్ చెయిన్ వీటన్నింటి కంటే భిన్నమైనది. దీనికి కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) డేటాబేస్ ఉండదు. వినియోగదారులకు ఒకరకంగా, పర్యవేక్షకులకు మరో విధమైన యాక్సెస్ ఉంటుంది. ఒకవేళ హ్యాకర్లు ఈ సమాచారం మార్చాలని ప్రయత్నిస్తే నెట్‌వర్క్‌లో ఒక బ్లాక్‌లో మార్చినప్పటికీ మిగిలినవి ఆ మార్పును అనుమతించవు. అంటే అన్ని బ్లాక్‌లు ఒకేసారి మార్చాల్సి ఉంటుంది. ఇది అసాధ్యం. ఒక బ్లాక్ సమాచారాన్ని ఛేదించినంత మాత్రాన.. మిగతా సమాచారం తెలుసుకోవడం సాధ్యం కాదు. దాదాపు అసంభవం అని చెప్పాలి. ఈ ఎన్క్రిప్షన్ కంప్యూటర్ నుంచి కంప్యూటర్‌కు జరుగుతుంది. ప్రోగ్రామర్‌కి కానీ, చౌర్యం చేసే వారికి కానీ పూర్తి సమాచారం లభించదు. అందువల్లే బ్యాంకులు, ట్రేడింగ్ కంపెనీలు, బీమా సంస్థలు, ఆసుపత్రులు తదితరాలన్నీ దీనిపై దృష్టి సారిస్తున్నాయి.





### మన దేశంలో బ్లాక్ చెయిన్

బిట్‌కాయిన్ల గురించి తెలుసు కదా..! వాటి కోసమే ఈ టెక్నాలజీ వచ్చింది. సటోషీ నకమోటో పేరుతో కొందరు అజ్ఞాత టెకీలు దీన్ని అభివృద్ధి చేశారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీని మన దేశంలో తొలిసారిగా 2008లో క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్‌లో ఉపయోగించారు. మన నీతి ఆయోగ్ ఈ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నది. ఎస్బీఐ 2019 ఆర్థిక సంవత్సరం చివరిలోగా దీన్ని వినియోగించుకోవడానికి సన్నాహాలు చేస్తున్నది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) బ్లాక్ చెయిన్ ఉపయోగించి టెలిమార్కెటింగ్, స్పామ్ కాల్స్ నివారించడానికి సన్నద్ధమవుతున్నది. ఇండియా ట్రేడ్ కనెక్ట్ పేరుతో ఇన్ఫోసిస్ 7 ప్రైవేటు బ్యాంకులతో జతకట్టింది. ఇది బ్లాక్ చెయిన్ ఆధారిత ట్రేడ్ నెట్‌వర్క్. Moneta Go బ్లాక్ చెయిన్ సొల్యూషన్ ఇప్పటికే భారత్‌లో సేవలు ఆరంభించింది. eMudhra బ్లాక్ చెయిన్ ఆధారిత స్మార్ట్ కాంట్రాక్టు సొల్యూషన్లను మన దేశంలో అందిస్తున్నది. ఫైనాన్షియల్, సెక్యూరిటీ మార్కెట్లో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించడానికి ఆర్బీఐ, సెబీ కృషి చేస్తున్నాయి. బ్లాక్ చెయిన్ సేవలను ఇక్కడ విస్తృతం చేయడానికి ప్రైవేటు సంస్థ బ్లాక్ చెయిన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటైంది.

... ✍ డప్పు రవి

## బ్లాక్ చెయిన్ డిస్ట్రిక్ట్‌గా తెలంగాణ





ప్రస్తుతం బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వైపే ప్రపంచమంతా చూస్తున్నది. ఈ క్రమంలో తొలి బ్లాక్ చెయిన్ డిస్ట్రిక్ట్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ ప్రభుత్వం టెక్ మహీంద్రా సంయుక్తంగా దేశంలోనే తొలి బ్లాక్ చెయిన్ డిస్ట్రిక్ట్‌ను నెలకొల్పడానికి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ఏర్పాటయ్యే సంస్థలు, స్టార్టప్‌లకు రాయితీలు, భూములు, నిధులను ప్రభుత్వం ఇవ్వనున్నది. తెలంగాణలో నూతన ఆవిష్కరణలకు అగ్ర తాంబూలం ఇస్తున్న ప్రభుత్వం.. ఇటీవల బ్లాక్ చెయిన్ ముసాయిదాను విడుదల చేసింది. 2025 నాటికి గ్లోబల్ జీడీపీలో 10 శాతం బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఆక్రమించనున్నదని, 2030 నాటికి బ్లాక్ చెయిన్ ఏటా 3 లక్షల కోట్ల డాలర్ల వ్యాపారాన్ని సృష్టించనుందని నిపుణుల అంచనా. అన్ని రంగాల సంస్థలకు ఈ టెక్నాలజీ ప్రయోజనకరంగా మారడంతో రాబోయే రోజుల్లో బ్లాక్ చెయిన్ టాప్ పొజిషన్‌లోకి రావచ్చు. అది కూడా ఎంతో దూరంలో లేదు.

## బగ్ ఉందని చెప్పాడు నగదు అందుకున్నాడు

**సామాజిక మాధ్యమాల్లో మనకు తెలియకుండా ఎన్నో బగ్స్ ఉంటాయి. మనకే కాదు అవి యాజమాన్యాలకూ కూడా తెలియకుండా ఉంటాయి. వాటి వల్ల హ్యాకర్లు తమ పని సింపుల్‌గా చేయడం సాధ్యం అవుతుంది. ఇలా యూజర్‌కు, కంపెనీకి నష్టం కలిగించే బగ్ ఒకటి కేరళకు చెందిన బీటెక్ విద్యార్థికి కనిపించింది. వెంటనే మార్క్ జూకర్‌బర్గ్‌కు లెటర్ రాశాడు.. తర్వాత ఏం జరిగింది?**







ఫేస్‌బుక్ గ్రూప్‌కు చెందిన వాట్సాప్‌లో ఓ హానికర బగ్‌ను గుర్తించాడు కేరళకు చెందిన అనంత కృష్ణన్. యూజర్లకు తెలియకుండా వాట్సాప్‌లో కొన్ని ఫైళ్లను, ఇతర సమాచారాన్ని ఇతరులు డెలిట్ చేయడానికి అవకాశం ఉండే బగ్‌ను గుర్తించాడు. దీని గురించి ఫేస్‌బుక్ ఫౌండర్ మార్క్ జూకర్‌బర్గ్‌కు సమాచారం అందించాడు. ఆ బగ్ ఏంటీ? ఎందుకు వచ్చింది? ఎలా తీయాలి అని వివరంగా లెటర్ రాశాడు. దీన్ని రెండు నెలల పాటు పరిశీలించిన ఫేస్‌బుక్ ఆ బగ్ నిజమేనని, తొలగించడానికి చర్యలు తీసుకుంది. దీంతో అనంత కృష్ణన్ ప్రతిభకు మెచ్చిన జూకర్‌బర్గ్ అనంత కృష్ణన్‌కు ఐదు వందల డాలర్ల ( రూ. 35 వేలు) నగదును అందించాడు. దీంతో పాటు ఫేస్‌బుక్ ఆల్ ఆఫ్ ఫేమ్ థాంక్స్ లిస్ట్‌లో ఆనంత కృష్ణన్‌కు చోటు కల్పించాడు. తన లేఖను పరిశీలించినందుకు ఈ స్టూడెంట్ ఫేస్‌బుక్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

## షావోమీ నుంచి మరో 5జీ

నయామాల్

**మొబైల్ మార్కెట్‌లో ట్రెండ్ సృష్టిస్తున్న షావోమీ నుంచి మరో ఎంఐ 5జీ ఫోన్ రానున్నది. ఇప్పటికే ఆ కంపెనీ నుంచి 5G ఎంఐ మిక్స్3 స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉంది.**

ఇండియాలో 5G నెట్ వర్క్ వేగవంతమైన తరుణంలో షావోమీ తన బ్రాండ్‌ను కొనసాగిస్తున్నది. త్వరలోనే రెడ్‌మీ నుంచి మరో 5జీ ఫోన్‌ను రిలీజ్ చేస్తున్నట్టు ఆ కంపెనీ ప్రకటించింది. దాని పూర్తి వివరాలు తెలియనున్నాయి. ఎంఐ నుంచి ఇదివరకే ఉన్న MI MIX3, 5G పేరుతో 5G స్మార్ట్ యూజర్ల నుంచి మంచి క్రేజ్ సంపాదించింది. క్వాల్ కామ్స్ స్నాప్ డ్రాగన్ 855 మొబైల్ ప్లాట్ ఫాంతో స్నాప్ డ్రాగన్ x50 మోడమ్ ఉంది.






### ఫీచర్లు

| | |
|---|---|
| **డిస్‌ప్లే** | : 6.39 అంగుళాలు |
| **రిజల్యూషన్** | : 2340x1080p యాస్పెక్ట్ రేషియో |
| **ప్రాసెసర్** | : ఆక్టాకోర్, క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 855 |
| **ర్యామ్** | : 6 జీబీ |
| **మెమొరీ** | : 64 జీబీ |
| **ఓఎస్** | : ఆండ్రాయిడ్ పై |
| **కెమెరా** | : 12MP AI డ్యుయల్ కెమెరాతో సోనీ IMX576 సెన్సార్ 960fbs స్లో మోషన్ వీడియో కేపబులిటీస్ |
| **ఫ్రంట్ కెమెరా** | : ప్రైమరీ కెమెరా 24MP, సెకండరీ కెమెరా 2MP సెన్సార్ పోర్టరైట్ సెల్ఫీ |
| **బ్యాటరీ** | : 3800mAH |

## ఇక ఇన్‌స్టాలో..



**పాపులర్ లిప్‌సింకింగ్ యాప్ టిక్‌టాక్‌కు పోటీగా ఇన్‌స్టాగ్రామ్ ఫీచర్‌ను అప్‌డేట్ చేసింది. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా వెల్లడించింది.**

ఇప్పుడు టిక్ టాక్ స్టోరీల మాదిరిగానే ఇన్‌స్టాలోనూ క్రియేట్ చేయొచ్చు. ఈ ఫీచర్‌ను ఇన్‌స్టా యూజర్ల కోసం ఇటీవలే రిలీజ్ చేసింది. అప్‌డేటెడ్ యాప్‌లో ఇన్‌స్టా మ్యూజిక్ సపోర్ట్‌తో ఈ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఆన్ స్క్రీన్ లిరిక్స్ పేరుతో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. యూఎస్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలలతో పాటు మరి కొన్ని దేశాల పాటల లిరిక్స్‌ను పొందుపరిచింది. ఈ ఫీచర్‌ను యాక్సెస్ చేయడానికి ఇన్‌స్టా యాప్‌ను అప్‌డేట్ చేసి యూస్ చేయడమే.. స్టోరీ క్రియేట్ చేస్తున్నప్పుడు మ్యూజిక్ లెన్స్‌ను ఎంపిక చేసుకోవాలి. తర్వాత షూటింగ్ స్టార్ట్ చేయాలి. అప్పుడు వెంటనే మీరు ఎంచుకున్న పాటకు సంబంధించిన లిరిక్స్ అన్నీ స్క్రీన్‌మీద స్క్రోల్ అవుతూ ఉంటాయి. వాటిని అనుసరిస్తూ లిప్ సింక్ చేయాలి. పర్ఫెక్ట్ లిప్ సింకింగ్ రావడానికి యూజర్ల కోసం ఈ ఫీచర్‌ను ప్రవేశపెట్టినట్టు ఇన్‌స్టా తెలిపింది. ఇండియా యూజర్లకు త్వరలోనే దీనిని అందిస్తామని పేర్కొన్నది.

## లిమిట్ దాటిందో!

టెక్‌చిట్కా




**ఫోన్ వాడితే ఫోన్ టెంపరేచర్, రేడియేషన్ పెరగడం సహజం. అయితే మీ ఫోన్‌కు ఇవి లిమిట్‌లో ఉండాలి. మీ ఫోన్‌కు ఎంత రేడియేషన్ ఉంది? ఎంత టెంపరేచర్ ఉంది? వాటి లిమిట్ ఎంత ఉండాలో తెలుసుకోవాలనుందా?**

SAR (Specific absorption rate) రేట్ అనేది 16/జీ ఉంటే సరిపోతుంది. కాబట్టి మీ ఫోన్ ఎస్ఆర్ విలువ 1.2 లేదా 0.6 పరిధిలో ఉంటే భయపడాల్సిన పని లేదు. ఫోన్ వాడడం తగ్గించడం ద్వారా, ఇయర్ ఫోన్లను ఎక్కువ వాడకపోవడం ద్వారా రేడియేషన్‌ను తగ్గించవచ్చు. ' #07#' ను డయల్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో ఎస్ఏఆర్ విలువ ఎంత ఉందో తెలుసుకోవచ్చు. *#*#4636#*#* డయల్ చేయడం ద్వారా బ్యాటరీ స్టేటస్, టెంపరేచర్ తెలుస్తుంది. ఒక్కో ఫోన్‌కు నిర్దేశితమైన ఉష్ణోగ్రత అందులో సూచిస్తుంది. ఒకవేళ ఎక్కువగా ఉంటే దానిని తగ్గించాలి. ఎక్కువ యాప్స్ వాడడం, హెడ్‌ఫోన్స్ వినియోగించడం, బ్రైట్‌నెస్‌ను ఎక్కువ ఉంచడం తగ్గించాలి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఐసీఎఫ్‌లో అప్రెంటిస్‌లు

**చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**





- **ట్రేడ్ అప్రెంటిస్‌లు**
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 992
- **విభాగాలవారీగా ఖాళీలు:** కార్పెంటర్-80, ఎలక్ట్రీషియన్-200, ఫిట్టర్-260, పెయింటర్-80, వెల్డర్-290, పాసా-2
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి సైన్స్/మ్యాథ్స్ సబ్జెక్టులతో 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచీలో ఐటీఐ ట్రేడ్‌లో సర్టిఫికెట్ ఉండాలి.
- **వయస్సు:** 2019 అక్టోబర్ 1 నాటికి 15 ఏండ్ల నుంచి 24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **స్టైపెండ్ :** మొదటి ఏడాదికి రూ. 5700/-, రెండో ఏడాదికి రూ. 6500/- చెల్లిస్తారు.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూన్ 24
- **వెబ్‌సైట్:** www.icf.indianrailways.gov.in

## అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

**రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 2019-20 విద్యా సంవత్సరానికి రెండేండ్లు/ మూడేండ్ల డిప్లొమా ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం సీట్ల సంఖ్య:** 880 (వ్యవసాయం-620, విత్తన సాంకేతిక పరిజ్ఞానం-80, సేంద్రీయ వ్యవసాయం-60, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్-110)
- **అర్హత:** పదోతరగతి/తత్సమాన పరీక్షలో కనీసం 5.0 గ్రేడ్ పాయింట్ (హిందీతో కలిపి)తో ఉత్తీర్ణులైనవారు అర్హులు. పదోతరగతి కంపార్ట్‌మెంట్/ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ పాసైనవారు, దానికంటే పై చదువులు చదివిన అభ్యర్థులు అర్హులుకారు. పదో తరగతిలోపు ఏదైనా నాలుగేండ్లపాటు గ్రామీణ ప్రాంతాల్లో (నాన్ మున్సిపల్ పరిధి) చదివిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **వయస్సు:** 2019 డిసెంబర్ 31 నాటికి 15 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/బీసీలు రూ.1100/- ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలు రూ. 600/-చెల్లించాలి.
- **ఎంపిక:** పదోతరగతి మార్కుల ఆధారంగా
- **కోర్సు కాలపరిమితి:** వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం/ సేంద్రీయ వ్యవసాయం-రెండేండ్లు. అగ్రికల్చరల్ ఇంజినీరింగ్-మూడేండ్లు
- **కోర్సు ఫీజు:** రూ. 12,700/-, (ప్రైవేట్ పాలిటెక్నిక్‌లో రూ. 17,200/-) చెల్లించాలి.

**ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్‌ల సీట్ల వివరాలు**

- నాగర్‌కర్నూల్ (పాలెం), జగిత్యాల (పొలాస), నల్లగొండ (కంపాసాగర్), సంగారెడ్డి(బసంతపూర్), ఖమ్మం(మధిర), సంగారెడ్డి (జోగిపేట), సిద్దిపేట (తోర్నాల), కరీంనగర్ (జమ్మికుంట), కామారెడ్డి(మాల్‌తుమ్మెద), నిజామాబాద్ (రుద్రూరు), హైదరాబాద్ (రాజేంద్రనగర్) వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ఈ కోర్సును నిర్వహిస్తున్నాయి.
- వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రీయ వ్యవసాయం కోర్సుల్లో ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 20 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో ప్రతి ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** www.pjtsau.ac.in

## ఆర్‌సీఎఫ్‌ఎల్‌లో ఇంజినీర్లు

**ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్‌ఎల్) ఖాళీగా ఉన్న ఇంజినీర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **మొత్తం పోస్టులు:** 16 (బాయిలర్ ప్రొఫిషియన్సీ ఇంజినీర్-15, సీనియర్ ఆఫీసర్-2)
- **అర్హత:** బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత. కంపెనీ సెక్రటరీలో మెంబర్‌గా నమోదై ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** www.rcfltd.com

## నీరీలో ఖాళీలు

**నాగ్‌పూర్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఈఆర్ఐ) ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- ప్రాజెక్ట్ అసిస్టెంట్, జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీసీఏ/ డిప్లొమా, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్‌ల లేదా ఎంఏతో పాటు నెట్/గేట్ ఉత్తీర్ణత. అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్ :** www.neeri.res.in

## హోంసైన్స్ కాలేజీలో బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్

**రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ 2019-20 ఇయర్‌కిగాను యూనివర్సిటీ సైఫాబాద్ హోంసైన్స్ కాలేజీలో నాలుగేండ్ల బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

- కోర్సు పేరు: బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్
- కాలేజ్ ఆఫ్ హోంసైన్స్ సైఫాబాద్, హైదరాబాద్‌లో క్లాసులు జరుగుతాయి. ఈ కోర్సు చేయడానికి బాలికలు మాత్రమే అర్హులు.
- **మొత్తం సీట్ల సంఖ్య:** 60
- **అర్హత:** బైపీసీ, ఎంపీసీ, ఎంబైపీసీ సబ్జెక్టులతో రెండేండ్ల వ్యవధిగల ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. మూడేండ్ల డిప్లొమా కోర్సు (హోమ్‌సైన్స్)లో సర్టిఫికెట్ ఉన్నవారికి సూపర్‌న్యూమరీ కోటాలో 10 శాతం సీట్లను కేటాయిస్తారు.
- **వయస్సు:** 2019 డిసెంబర్ 31 నాటికి 17 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 25 ఏండ్లు, పీహెచ్‌సీలకు 27 ఏండ్ల వరకు సడలింపు ఉంటుంది
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1800/- (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 900/-)
- **ఎంపిక:** ఇంటర్/డిప్లొమాలోని ఆప్షనల్ సబ్జెక్టులోని వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకుని మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- నాలుగేండ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సు ఎంపికలో రిజర్వేషన్లు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉంటాయి.
- మొత్తం సీట్లలో 40 శాతం గ్రామీణ ప్రాంతాల్లో చదివిన అభ్యర్థులకు కేటాయించారు. నాన్ మున్సిపల్ పరిధిలోని 1 నుంచి 12వ తరగతి వరకు నాలుగేండ్లపాటు చదివి ఉండాలి.
- లోకల్ అభ్యర్థులకు 85 శాతం, నాన్‌లోకల్ అభ్యర్థులకు 15 శాతం సీట్లు భర్తీచేస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ. 36,450/- (కోర్సు తదనంతరం రూ. 14,000/- రిఫండబుల్ ఉంటుంది)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** www.pjtsau.ac.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
బుధవారం 12 జూన్ 2019

# దిమాక్ ఖరాబ్ చేస్తది!

'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగు చిత్రసీమలో అరంగ్రేటం చేసింది కన్నడ కస్తూరి నభానటేష్. చారడేసి కళ్లలో కావాల్సినంత చిలిపిదనాన్ని ఒలికిస్తూ యువ హృదయాల్ని దోచుకుంది. అందం, అభినయం కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సొగసరికి తెలుగులో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. రామ్ సరసన 'ఇస్మార్ట్‌శంకర్', రవితేజ జోడీగా 'డిస్కో రాజా' చిత్రాల్లో నటిస్తుందీ సుందరి. 'నభా హాస్యాన్ని పండించే విధానం బాగా నచ్చింది. 'నన్ను దోచుకుందువటే' ట్రైలర్‌లో ఆమె నటనను చూసి 'డిస్కోరాజా' కోసం ఎంపిక చేసుకున్నాం' అని ఆ చిత్రబృందం తెలిపింది. 'నభానటేష్ హుషారైన అమ్మాయి. ఎలాంటి పాత్రలోనైనా మెప్పిస్తుంది. 'ఇస్మార్ట్‌శంకర్'లో ఆమె పాత్ర కీలకంగా ఉంటుంది' అని చిత్ర ప్రతినిధి పేర్కొన్నారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంలో 'దిమాక్ ఖరాబ్' అనే లిరికల్ వీడియోలో అందాల ప్రదర్శనతో కుర్రకారుని ఉర్రూతలూగించింది ఈ కన్నడ సోయగం. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.


నభా నటేష్

'మంచి పాత్రలు లభిస్తే కామెడీ రోల్స్ చేయడానికి ఎప్పుడూ సిద్ధమే. కేవలం హీరోగా మాత్రమే సినిమాలు చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. హీరోగా మారిన తర్వాత కమెడియన్ పాత్రలు అంగీకరించననే ఆలోచనతో ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదు' అని అన్నారు సప్తగిరి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వజ్రకవచధర గోవింద'. అరుణ్ పవార్ దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సప్తగిరి పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...

# కథలతోనే నా ప్రయాణం


సప్తగిరి

**'వజ్రకవచధర గోవింద' నేపథ్యమేమిటి? ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

• వజ్రం చుట్టూ తిరిగే కథ ఇది. ఇందులో గోవిందు అనే దొంగగా నేను కనిపిస్తాను. వజ్రానికి గోవిందుకు ఉన్న సంబంధం ఏమిటి? దాని వల్ల అతడికి ఎదురైన కష్టనష్టాలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. హీరోగా కాకుండా హాస్య నటుడి పంథాలో నా పాత్ర ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' మాదిరిగా ఈ సినిమా పేరుతో పాటు డబ్బును తీసుకొస్తుందనే నమ్మకం ఉంది.

**దర్శకుడు అరుణ్‌పవార్‌తో రెండో సినిమా చేయడానికి కారణమేమిటి?**

• 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' సినిమా చేస్తున్నప్పుడు అరుణ్‌పవార్‌తో మరో సినిమా చేస్తానని మాటిచ్చాను. కథకు సరిపోయే దర్శకుడి కోసం అన్వేషిస్తున్న సమయంలో అరుణ్ అయితేనే న్యాయం చేయగలడనిపించింది. తొలి సినిమా సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందని అతడితో ఈ సినిమా చేశాను.

**వినోదాన్ని నమ్ముకునే ఈ సినిమా చేశారా?**

• ఇదివరకు హీరోగా నటించిన సినిమాల్లో నేను సరిగా నవ్వించలేకపోయాననే విమర్శలు వచ్చాయి. కమర్షియల్ హంగులను నమ్మి ఆ సినిమాలు చేశాను. అందుకు భిన్నంగా ఈ సినిమాలో కథతో పాటు వినోదానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాం. ఏడేళ్ల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయడంతో ఆ ప్రభావం నేను చేస్తున్న సినిమాలపై తప్పకుండా ఉంటుంది. ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశాన్ని చెప్పడానికే ప్రయత్నిస్తాను. ఇందులో క్యాన్సర్ రోగులకు సహాయం చేయాలనే సందేశాన్ని చెప్పాం.

**అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన అనుభవంతో మీరు నటించే సినిమాల్లో అవసరమైన సలహాలు ఇస్తుంటారా?**

• కథకు అవసరమైతే సలహాలు ఇస్తుంటాను. నచ్చితే దర్శకులు తీసుకుంటారు. ఒకవేళ వారు తీసుకోకపోయినా బాధపడను.

**హాస్యనటులు హీరోలుగా రాణించలేరనే మాటతో మీరు ఏకీభవిస్తారా?**

• ఆ మాటను నేను నమ్మను. అందరి జీవితాలు ఒకేలా ఉండవు. కథను నమ్ముకునే ప్రయాణాన్ని సాగించాలని అనుకుంటున్నాను. అదే నన్ను హీరోగా ముందుకు నడిపిస్తుందనే నమ్మకం ఉంది. కథ లేకుండా ఏ సినిమా ఆడదు. కథల విషయంలో కరెక్ట్‌గా ఉంటే ఎవరైనా విజయాల్ని అందుకోవచ్చు.

**హాస్యనటుడి ఇమేజ్ హీరోగా నిలదొక్కుకోవడానికి అడ్డొస్తుందని అనుకుంటున్నారా?**

• వందశాతం అడ్డొస్తుంది. తొందరలోనే దానిని అధిగమిస్తాననే నమ్మకం ఉంది.

**దర్శకత్వం వహించే ఆలోచన ఉందా?**

• ప్రస్తుతానికైతే ఆలోచన లేదు. నటనపైనే దృష్టి సారిస్తాను.

**ప్రస్తుతం చేస్తున్న సినిమాలేవి?**

• సప్తగిరికి దయ్యం పట్టింది పేరుతో రెండు కథలను సిద్ధం చేసుకున్నాను. వాటిని తెరపై తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నాను. 'ప్రేమకథా చిత్రమ్' తరహాలో ఇవి సాగుతాయి. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న ఓ సినిమాలో హాస్యనటుడిగా కనిపిస్తాను.

# గిరిపుత్రుల పోరాటం


ఆర్య, కేథరిన్

ఆర్య, కేథరిన్ థెరిస్సా జంటగా నటించిన తమిళ చిత్రం 'కదంబన్' తెలుగులో 'గజేంద్రుడు' పేరుతో అనువాదమవుతున్నది. రాఘువ దర్శకుడు. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రాన్ని లక్ష్మీ వెంకటేశ్వర ఫ్రేమ్స్ పతాకంపై ఉదయ్‌హర్ష తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 21న ప్రేక్షకులముందుకురానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తమిళంలో విమర్శకులు ప్రశంసలందుకుందీ చిత్రం. ఓ కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజన పుత్రులుగా నాయకానాయికలు నటించారు. ఆద్యంతం థ్రిల్‌కు గురిచేసే అంశాలతో ఆకట్టుకుటుంది. అడవిని ఆక్రమించుకొని సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించాలనుకున్న సంఘ విద్రోహ శక్తుల పన్నాగాన్ని గిరిపుత్రులు ఎలా ఆటకట్టించారన్నదే చిత్ర కథ. యువన్‌శంకర్‌రాజా సంగీతం ప్రధానాకర్షణగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది' అన్నారు.

# తెలంగాణ ప్రేమకథ


సుమయ

రామ్ ప్రణీత్, సుమయ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ జంట'. మహేష్ మొగుళ్లూరి నిర్మాత. దగ్గుబాటి వరుణ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. నిఖిలేష్ తొగరి దర్శకుడు. సెన్సార్ పూర్తయింది. 'యు.ఎ' సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'తెలంగాణ నేపథ్యంలో సాగే పల్లెటూరి ప్రేమకథ ఇది. దర్శకుడు నిఖిలేష్ వినూత్నమైన ఇతివృత్తంతో సినిమాను తెరకెక్కించారు. ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. ఓ జంట ప్రేమప్రయాణానికి దృశ్యరూపమిదని.. అదిలాబాద్, ప్రకాశం జిల్లాలోని అందమైన లొకేషన్స్‌లో షూటింగ్ జరిపామని, రామ్ ప్రణీత్, సుమయ జోడీ ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు.

# టెర్రరిజమ్ నేపథ్యంలో..


అపర్ణశర్మ, బిట్టు

బిట్టు, అపర్ణశర్మ, హిమాన్షి ఖురానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఏక్'. సత్ రుద్రారపు దర్శకత్వం వహిస్తున్నారు. కె వరల్డ్ మూవీస్ పతాకంపై హరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల హైదరాబాద్‌లో దర్శకుడు అజయ్ భూపతి ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'టెర్రరిజమ్ నేపథ్యంలో రూపొందించిన చిత్రమిది. ఇటీవల పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన అమరవీరులకు అంకితం చేస్తున్నాం. మంత్ర ఆనంద్ అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దేశభక్తి ప్రధానంగా సాగే ఈ చిత్రంలో అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ వున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని ఈ నెల 14న విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. సుమన్, బెనర్జీ, పృథ్వీ, శ్రవణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చక్రవర్తి, రచయిత, నిర్మాత: హరి.











